

# అనంత జనశక్తి

జనం కోసమే మా అక్షరం

06.09.2026

ఆదివారం | అనంతపురం

సంపుటి : 11 | సంచిక: 116

పేజీలు : 08 | వెల: రూ.5

AJS అనంత జనశక్తి జనం కోసమే మా అక్షరం

PUBLISHED BY ANANTAPUR, KADAPA, CHITTOR, VISAKHAPATNAM, SRIKAKULAM, EALLURU, TIRUPATHI, ONGOLE, VIJAYAWADA, NELLORE, PRAKASHAM, GUNTUR, KURNOOL.


## పనిచేసినందుకే రాళ్ల దెబ్బలు, ఏమీ ఫర్లేదు

- 2029లోగా మరో మూడు డీఎస్సీలు
- మంత్రి నారా లోకేష్ ప్రకటన
- విజయవాడలో ఉపాధ్యాయుల దినోత్సవం
- వైఎస్ జగన్ తీవ్ర స్థాయిలో విమర్శలు



విజయవాడ, సెప్టెంబర్ 05, అనంత జనశక్తి న్యూస్

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని నిరుద్యోగ యువతకు విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ గుడ్ న్యూస్ వినిపించారు. 2029 సంవత్సరంలోగా మరో మూడు డీఎస్సీలు నిర్వహిస్తామని నారా లోకేష్ ప్రకటించారు. విజయవాడలోని ఏ కన్వెన్షన్ సెంటర్‌లో జరిగిన రాష్ట్రస్థాయి ఉపాధ్యాయ దినోత్సవంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడిన నారా లోకేష్.. డీఎస్సీలపై కీలక ప్రకటన చేశారు. 2029లోగా మరో మూడు డీఎస్సీ పరీక్షలు నిర్వహిస్తామని ప్రకటించారు. 2లో..

## కాంగ్రెస్ సంబరాలు దేని కోసం?

- మాజీ మంత్రి హరీశ్ రావు కామెంట్
- అధికారంలోకి రావడానికి చేసిన హామీలన్నీ విస్మరించినందుకా?
- రాజీనామా చేయాల్సింది కేసీఆర్ కాదు.. రేవంత్ రెడ్డి 5లో..



హైదరాబాద్, సెప్టెంబర్ 05, అనంతజనశక్తి న్యూస్

కాంగ్రెస్ ప్రభుత్వంపై మాజీ మంత్రి హరీశ్ రావు మరోసారి విరుచుకుపడ్డారు. శనివారం మాట్లాడుతూ.. కాంగ్రెస్ సంబరాలు దేని కోసం.. అధికారంలోకి రావడానికి చేసిన హామీలన్నీ విస్మరించినందుకా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ తీరు ఉల్టా చోర్ కొత్వాల్ కో డాంటే అన్నటుగా ఉందంటూ ఎద్దేవా చేశారు. సీఎం రేవంత్ రెడ్డి పని తీరును ప్రజలు అసహ్యించుకుంటున్నారన్నారు. విద్యార్థులు, నిరుద్యోగులు, జీఓ నం 97 రద్దు, రైతులకు న్యాయమైన కరెంట్ కోసం, ప్రజా సమస్యలు ఎజెండాగా అసెంబ్లీలో బీఆర్ఎస్ కొట్లాడుతోందని తెలిపారు.

## సామాన్య ప్రయాణికుడిలా మెట్రో ట్రైన్‌లో మోదీ జర్నీ

- మెట్రోలో ప్రధాని మోడీ ప్రయాణం 2లో..
- చిన్నారులు, ప్రయాణికులతో ముచ్చట్లు



న్యూఢిల్లీ, సెప్టెంబర్ 05, అనంతజనశక్తి న్యూస్

ప్రధాని మోడీ సామాన్యుడిలా మారిపోయారు. భద్రతా సిబ్బందిని పక్కన పెట్టి ప్రజలతో మమేకం అయిపోయారు. రొటీన్‌కు భిన్నంగా శనివారం ఢిల్లీ మెట్రోలో ప్రయాణించి సందడి చేశారు. శ్రీరామ్ కాలేజ్ ఆఫ్ కామర్స్ శతాబ్ది వేడుకల్లో పాల్గొనేందుకు మెట్రోలో ప్రయాణించి కాలేజీకి వెళ్లారు. చేతిలో మెట్రో కార్డు పట్టుకుని ప్రయాణించిన ప్రధాని.. మార్గమధ్యంలో విద్యార్థులు, తోటి ప్రయాణికులతో సరాదాగా గడిపారు. ఇందుకు సంబంధించిన వీడియోలు వైరల్ అవుతున్నాయి.

# టీచర్‌కు ప్రత్యామ్నాయం లేదు

## సాంకేతికత ఎంత పెరిగినా టీచర్లు అవసరమే: సీఎం చంద్రబాబు నాయుడు

- టీచర్స్ డే వేడుకలకు హాజరు
- సమాజంలో గొప్ప వ్యక్తులంతా..
- ఉపాధ్యాయుల చేతుల్లో ఎదిగిన వాళ్లే
- టీచర్లు గౌరవంగా జీవించాలి
- పాఠశాలల్లో మౌలిక వసతులు పెంచుతున్నాం
- బడి పరిసరాలు పచ్చగా ఉండాలి
- అప్పుడే పిల్లలకు మంచి ఆలోచనలు వస్తాయి 2లో..



అమరావతి, సెప్టెంబర్ 05, అనంతజనశక్తి న్యూస్

సాంకేతికత ఎంత పెరిగినా టీచర్‌కు ప్రత్యామ్నాయం లేదని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. సమాజంలో గొప్ప వ్యక్తులంతా ఉపాధ్యాయుల చేతుల్లో ఎదిగిన వాళ్లేనని చెప్పారు. విజయవాడలోని 'ఎ' కన్వెన్షన్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి ఉపాధ్యాయ దినోత్సవంలో సీఎం పాల్గొన్నారు. తొలుత మాజీ రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం సీఎం మాట్లాడారు. "1991 నుంచి పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి. ఎక్కడికక్కడ పోటీతో పాటు అవకాశాలు పెరిగాయి. టెక్నాలజీతో మంచి చెడు రెండూ ఉన్నాయి. నేటి కాలంలో బోధనా విధానం పూర్తిగా మారింది. మా చిన్నప్పుడు టీచర్లు బాగా కొట్టేవారు. భయభక్తులతో చదువుకునే వాళ్లం. టీచర్‌తో దెబ్బలు తిన్నవారంతా బాగుపడతారు. పిల్లల మానసిక స్థితి మారుతోంది.. టీచర్లు గమనించాలి. మారుతున్న సాంకేతికత పిల్లలపై పెను ప్రభావం చూపిస్తోంది. సామాజిక మాధ్యమాలు పిల్లలకు శాపంగా మారాయి. పిల్లల్లో కుటుంబ విలువలు, నైతిక ప్రవర్తన పెంపుపై టీచర్లు దృష్టి పెట్టాలి.

**టీచర్లు గౌరవంగా జీవించాలి**

అన్ని పాఠశాలల్లో మౌలిక వసతులు పెంచుతున్నాం. బడి పరిసరాలు పచ్చగా ఉండాలి.. అప్పుడే పిల్లలకు మంచి ఆలోచనలు వస్తాయి. బడిలో పచ్చదనం పెరిగేలా టీచర్లు చర్యలు తీసుకోవాలి.

## లష్కరే కీలక ఉగ్రవాది హతం

ఆర్మీ సిబ్బందిపై దాడుల్లో సూత్రధారి

తొలిసారిగా 2024లో అతడి ఉనికి వెలుగులోకి



2లో..

శ్రీనగర్, సెప్టెంబర్ 05, అనంత జనశక్తి న్యూస్

జమ్మూ కశ్మీర్‌లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మోస్ట్ వాంటెడ్, పాకిస్థాన్‌కు చెందిన లష్కరే తొయిబాకు ఉగ్రవాది యాసిర్ హతమయ్యాడు. గత కొంతకాలంగా కదలికలపై నిఘా పెట్టిన భద్రతా బలగాలు శుక్రవారం యూస్‌మార్గ్‌లో గుర్తించాయి. పర్వత ప్రాంతాలకు చేరుకున్న భద్రతా బలగాలు గాలిస్తుండగా.. ఉగ్రవాది కాల్పులు జరిపాడు. దీంతో సైన్యం అప్రమత్తమై ఎదురు కాల్పులు జరపడంతో యాసిర్ హతమైనట్లు అధికారులు వెల్లడించారు.

## రెవెన్యూ వ్యవస్థ పూర్తిగా క్షీణించింది

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు



2లో..

హైదరాబాద్, సెప్టెంబర్ 05, అనంతజనశక్తి న్యూస్

సీఎం రేవంత్‌రెడ్డిపై బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు రాంచందర్ రావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కుట్రపూరితంగానే భూములను 22ఏ నిషేధిత జాబితాలో చేర్చారని ధ్వజమెత్తారు. 22ఏతో మధ్యతరగతి ప్రజలు అల్లాడుతున్నారని పేర్కొన్నారు. శనివారం హైదరాబాద్ ఇందిరాపార్క్ దగ్గర బీజేపీ మహాధర్నా చేపట్టింది. ఈ ధర్నాలో రాంచందర్ రావు పాల్గొని మాట్లాడారు. 22ఏ భూ భారతి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. భూ సంస్కరణల పేరుతో భూ భారతిని సీఎం రేవంత్‌రెడ్డి తీసుకువచ్చారని అన్నారు.

## సోమరులు.. అసమర్థులు

- మండి అధికారులపై కంగన ఆగ్రహం
- రూ.11 కోట్ల ఎంపీ నిధులు విడుదలైనా..
- కొనసాగని అభివృద్ధి పనులు 2లో..

## 10 మంది దోషులే

- బస్తర్ దాడి కేసులో తీర్పు 2లో..
- 13 ఏళ్ల నాడు 29 మంది మృతి
- సెప్టెంబర్ 16వ తేదీన తుది తీర్పు



## ఒకేసారి రెండు డీఏలు

- ఉద్యోగులకు శుభవార్త చెప్పిన చంద్రబాబు
- ఉద్యోగులు ప్రభుత్వంలో భాగమని వెల్లడి



అమరావతి, సెప్టెంబర్ 05, అనంతజనశక్తి న్యూస్

ఏపీలో ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం గుడ్‌న్యూస్ చెప్పింది. వేతన సవరణ సంఘం (పీఆర్సీ) ఏర్పాటుతో పాటు మరికొన్ని సమస్యలను పరిష్కరించేందుకు సీఎం చంద్రబాబు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. ఉద్యోగ సంఘాల నేతలతో నిర్వహించిన సమావేశంలో వివిధ అంశాలపై సీఎం చర్చించారు. అక్టోబర్ 1 నుంచి రెండు డీఏలు చెల్లించేందుకు ప్రభుత్వం అంగీకారం తెలిపింది. 2022 నాటి సరెండర్ లీవ్‌లు జనవరిలో ఇవ్వాలని నిర్ణయించింది. అనంతరం నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు సూర్యనారాయణ వివరాలు వెల్లడించారు. 5లో..

## 13 నుండి 28కి పెరిగిన కొత్త జెడ్పీలు

- జిల్లా పరిషత్‌ల పునర్వ్యవస్థీకరణ
- 24వ తేదీతో పాలక వర్గాల పదవీకాలం ఎండ్
- ఆ వెంటనే 28 కొత్త జిల్లా పరిషత్‌ల వ్యవస్థ అధికారికంగా 2లో..



## ఎమ్మెల్యే పదవికి కేసీఆర్ రాజీనామా చేయాలి

- మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడి 2లో..
- ప్రజలకు జవాబుదారీగా ఉండాలి
- ఎమ్మెల్యే పదవిలో కొనసాగడం ఎందుకు?



హైదరాబాద్, సెప్టెంబర్ 05, అనంత జనశక్తి న్యూస్

కేసీఆర్ తన ఎమ్మెల్యే పదవికి వెంటనే రాజీనామా చేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ డిమాండ్ చేశారు. ప్రజలకు జవాబుదారీగా ఉండాల్సిన ప్రజాప్రతినిధి తన బాధ్యతలను నిర్వర్తించనప్పుడు ఎమ్మెల్యే పదవిలో కొనసాగడం ఎందుకని ప్రశ్నించారు.

# సామాన్య ప్రయాణికుడిలా మెట్రో ట్రైన్‌లో మోదీ జర్నీ



(మొదటి పేజీ తరువాయి)

100వ వార్షికోత్సవ వేడుకల్లో ప్రసంగించేందుకు వెళ్లిన ప్రధాని మోదీ.. సాధారణ ప్రయాణికుడిలా మెట్రోలో ప్రయాణించారు. ఈ సందర్భంగా మెట్రోలో ఉన్న చిన్నారులతో...విద్యార్థులతో.. ఇతర ప్రయాణికులతో ముచ్చటించారు. ప్రతిరోజూ ఢిల్లీ మెట్రోలో కనిపించే సాధారణ దృశ్యానికి.. ప్రధాని మోదీ ప్రయాణం ప్రత్యేకతను తీసుకొచ్చింది. కాలేజీకి చేరుకునే క్రమంలో ఆయన పలువురితో ఆప్యాయంగా మాట్లాడారు.

**SRCCకి 100 ఏళ్లు**

ప్రధాని మోదీ హాజరవుతున్న ఈ కార్యక్రమం SRCCకి ఎంతో ప్రత్యేకమైనది. దేశంలోని ప్రముఖ విద్యాసంస్థల్లో కటైన శ్రీరామ్ కాలేజ్ ఆఫ్ కామర్స్ తన 100 ఏళ్ల ప్రస్థానాన్ని పూర్తి చేసుకుంది. SRCC శతాబ్ది వేడుకలకు ప్రధాని మోదీ ముఖ్య అతిథిగా హాజరవుతున్నారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి కూడా ఈ కార్యక్రమంలో పాల్గొననున్నారు. జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఈ వేడుకలు జరుగుతున్నాయి. ప్రస్తుత విద్యార్థులతో పాటు కాలేజీ మాజీ ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు, పూర్వ విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొంటున్నారు. దీంతో SRCC శతాబ్ది వేడుకలు పలు తరాల విద్యార్థులు, అధ్యాపకులను ఒకే వేదికపైకి తీసుకువస్తున్నాయి.

**13 ఏళ్ల తర్వాత మళ్లీ కాలేజీలోకి..**

SRCCలో ప్రధాని మోదీ పర్యటించడం 13 ఏళ్ల తర్వాత ఇదే తొలిసారి. ఆయన చివరిసారిగా 2013లో గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో SRCCని సందర్శించారు. ఈ ఏడాది ఏప్రిల్‌లో SRCC శతాబ్ది వేడుకల సందర్భంగా కాలేజీ గవర్నింగ్ బాడీ, ప్రతినిధి బృందాన్ని ప్రధాని మోదీ తన నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా SRCC 100 ఏళ్ల ప్రస్థానాన్ని గుర్తు చేస్తూ ప్రత్యేక తపాలా బిళ్లను కూడా విడుదల చేశారు. ఇప్పుడు నెలల తర్వాత ప్రధాని స్వయంగా SRCCకి చేరుకున్నారు. మెట్రో కార్డు చేతిలో పట్టుకుని విద్యార్థులు, ప్రయాణికులతో ముచ్చటిస్తూ ఆయన చేసిన ఈ ప్రయాణం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

# 10 మందిదోషులే

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 05, అనంత జనశక్తి న్యూస్**



దేశ చరిత్రలోనే అత్యంత తీవ్రమైన దాడిలో ఒకటిగా నిలిచిన జీరామ్ వ్యాలీ మావోయిస్టుల దాడి కేసులో ఎట్టకేలకు ఓ సుదీర్ఘ న్యాయ ప్రక్రియ పూర్తయింది. సుమారు పదమూడేళ్ల క్రితం కాంగ్రెస్ అగ్ర నాయకత్వాన్నే తుడిచిపెట్టేసిన ఈ ఘోర ఘటనపై జగదల్‌పూర్‌లోని ప్రత్యేక జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) న్యాయస్థానం చారిత్రాత్మక తీర్పును వెలువరించింది. ఈ కేసు విచారణను పూర్తి చేసిన ప్రత్యేక న్యాయమూర్తి అభయ్ సింగ్ రాజ్‌పుత్, ఇద్దరు మహిళలు సహా మొత్తం 10 మందిని దోషులుగా నిర్ధారిస్తూ తీర్పునిచ్చారు. అయితే ఈ దోషులకు ఎలాంటి శిక్షలు పడనున్నాయో సెప్టెంబర్ 16వ తేదీన ప్రకటించనున్నట్లు వెల్లడించారు.

**అసలేం జరిగిందంటే..?**

2013 మే 25వ తేదీన బస్తర్ జిల్లాలోని దర్భా పోలీస్ స్టేషన్ పరిధిలోని జీరామ్ వ్యాలీ జాతీయ రహదారిపై ఘోర దాడి జరిగింది. ముఖ్యంగా ఆ సమయంలో కాంగ్రెస్ పార్టీ నిర్వహించిన 'పరివర్తన్ ర్యాలీ'లో పాల్గొని తిరుగుపయనం అవుతున్న నాయకుల కాన్వాయ్‌ను లక్ష్యంగా చేసుకుని మావోయిస్టులు తీవ్ర స్థాయిలో మెరుపు దాడి చేశారు. కాపుకాసి మరీ జరిపిన ఈ దాడిలో మొత్తం 29 మంది అమాయకులు ప్రాణాలు కోల్పోగా.. మరొక 30 మంది తీవ్ర గాయాలపాలయ్యారు. ఈ ఘటనతో రాష్ట్ర కాంగ్రెస్ నాయకత్వం కోలుకోలేని దెబ్బతింది.

**ముఖ్య నాయకులు బలి**

ఈ ఘోర దాడిలో నాటి కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు నంద్ కుమార్ పటేల్, ఆయన కుమారుడు దినేష్, అసెంబ్లీలో మాజీ ప్రతిపక్ష నేత మహేంద్ర కర్మా, కేంద్ర మాజీ మంత్రి విద్యా చరణ్ శుక్లా, మాజీ ఎమ్మెల్యే ఉదయ్ ముదియార్ వంటి అగ్రశ్రేణి రాజకీయ నాయకులు ప్రాణాలు కోల్పోయారు. వీరితో పాటు పలువురు భద్రతా సిబ్బంది, సాధారణ పౌరులు కూడా బలికావాల్సి వచ్చింది. తొలుత స్థానిక బస్తర్ పోలీసులు విచారణ ప్రారంభించినప్పటికీ.. కేసు తీవ్రత దృష్ట్యా కేంద్ర ప్రభుత్వం దీనిని ఎన్ఐఏకు అప్పగించింది.

**101 మంది సాక్షులతో విచారణ**

కేసును స్వీకరించిన ఎన్ఐఏ సెప్టెంబర్ 2014లోనే చార్జ్‌షీట్ దాఖలు చేసింది. ఈ కేసు విచారణలో భాగంగా దర్యాప్తు సంస్థ ఏకంగా 101 మంది సాక్షుల వాంగ్మూలాలను నమోదు చేసి కోర్టు ముందు ఉంచింది. అనేక ఏళ్ల సుదీర్ఘ విచారణ అనంతరం కోర్టు ఈ నిర్ణయానికి వచ్చింది. మరోవైపు ఈ దాడిపై రాజకీయ వేడి కూడా కొనసాగింది. నాటి సీఎంగా ఉన్న భూపేష్ బఘేల్ ఎన్ఐఏ పూర్తి విషయాలను బయటకు తీయలేదని ఆరోపించగా.. మాజీ సీఎం రామన్ సింగ్ దీనిని కేవలం రాజకీయం మాత్రమేనని కొట్టిపారేశారు. ఇక ఈ తీర్పుపై ఉన్నత న్యాయస్థానంలో అప్పీల్ చేస్తామని డిఫెన్స్ న్యాయవాదులు తెలిపారు.

# పనిచేసినందుకే రాళ్ల దెబ్బలు, ఏమీ ఫర్లేదు

(మొదటి పేజీ తరువాయి)

"ఏం పనిచేయకపోతే రాళ్ల దెబ్బలు తగలవు. పనిచేసినందుకే రాళ్ల దెబ్బలు. ఏపీపీఎస్సీకి, డీఎస్సీకి తేడా తెలియనివారు నాపైన అనేక ఆరోపణలు చేస్తున్నారు. ఏం ఫర్వాలేదు. 2029లోగా మరో మూడు డీఎస్సీలు నిర్వహిస్తాం. ప్రభుత్వ పాఠశాలలకు అవసరమైన ఉపాధ్యాయులను అందించే బాధ్యత తీసుకుంటాం. సమాజంలో గౌరవంగా ఎలా బతకాలి, ఇంటిపేరును ఎప్పుడూ ఉన్నతస్థానంలో నిలపాలని నాకు నేర్పించింది.. నా తండ్రి చంద్రబాబు. అందుకే నేను మాటిస్తున్నా. మొదటి డీఎస్సీని ఎంత పారదర్శకంగా నిర్వహించామో.. రాబోయే మూడు డీఎస్సీలు అలాగే నిర్వహిస్తాం. దశాబ్దాలుగా జరగని యూనివర్సిటీ ఫ్యాకల్టీ రిక్రూట్‌మెంట్ పారదర్శకంగా నిర్వహిస్తాం. వచ్చే ఏడాది ఏప్రిల్ నాటికి ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు నియమిస్తాం " అని నారా లోకేష్ తెలిపారు.



# 13 నుండి 28కి పెరిగిన కొత్త జెడ్పీలు




**అమరావతి, సెప్టెంబర్ 05, అనంతజనశక్తి న్యూస్**

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పరిపాలనా సౌలభ్యం, ప్రజలకు మెరుగైన సేవలు అందించే లక్ష్యంతో జిల్లా పరిషత్‌ల పునర్వ్యవస్థీకరణతో పాటు శాంతిభద్రతల పరిరక్షణకు కీలక నిర్ణయాలు తీసుకుంది. రాష్ట్రంలో కొత్త జిల్లాల ఏర్పాటుకు అనుగుణంగా ప్రస్తుతం ఉన్న 13 జిల్లా పరిషత్‌ల స్థానంలో 28 కొత్త జిల్లా పరిషత్‌లను ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది.

ఇందులో భాగంగా కొత్తగా ప్రతిపాదించిన మార్కాపురం, పోలవరం జిల్లాలకు కూడా ప్రత్యేక జెడ్పీలను మంజూరు చేశారు. ఈ నూతన వ్యవస్థ సమర్థవంతంగా పనిచేయడానికి వీలుగా అదనంగా 15 జెడ్పీ సీఈఓ , 15 డిప్యూటీ సీఈఓ పోస్టుల సృష్టికి ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఈ నెల 24వ తేదీతో ప్రస్తుత జిల్లా పరిషత్ పాలకవర్గాల పదవీకాలం ముగియనుండగా, ఆ గడువు పూర్తయిన వెంటనే ఈ 28 కొత్త జిల్లా పరిషత్‌ల వ్యవస్థ అధికారికంగా అమల్లోకి రానుంది.

మరోవైపు రాష్ట్రంలో పెరిగిన జనాభా, పట్టణీకరణను దృష్టిలో ఉంచుకుని ప్రజలకు మరింత మెరుగైన రక్షణ కల్పించేందుకు పోలీసు శాఖ కీలక ప్రతిపాదనలు సిద్ధం చేసింది. రాజమండ్రి, గుంటూరు, తిరుపతి, కర్నూలు నగరాల్లో కొత్తగా 4 పోలీస్ కమిషనరేట్లను ఏర్పాటు చేయాలని ప్రభుత్వానికి నివేదించింది. ఈ ప్రతిపాదనలకు ప్రభుత్వం ఆమోదం తెలిపితే, ప్రస్తుతం ఉనికిలో ఉన్న విజయవాడ, విశాఖపట్నం కమిషనరేట్లతో కలిపి రాష్ట్రంలో మొత్తం కమిషనరేట్ల సంఖ్య 6కు చేరుతుంది.

ఈ కొత్త కమిషనరేట్ల ఏర్పాటు ద్వారా సైబర్ నేరాల కట్టడి, సీసీ కెమెరాల నెట్‌వర్క్ విస్తరణ, ట్రాఫిక్ నియంత్రణ మరియు శాంతిభద్రతల విభాగాల మధ్య సమన్వయం గణనీయంగా మెరుగుపడుతుందని అధికారులు భావిస్తున్నారు. పోలీసు వ్యవస్థ ఆధునీకరణ, ఈ నూతన కమిషనరేట్ల ఏర్పాటు ద్వారా ప్రజలకు మరింత వేగవంతమైన, నాణ్యమైన రక్షణ సేవలు అందుబాటులోకి వస్తాయని ఉన్నతాధికారులు స్పష్టం చేశారు.

# లష్కరే కీలక ఉగ్రవాది హతం

(మొదటి పేజీ తరువాయి)





హతమైన ఉగ్రవాదిని యాసిర్‌గా గుర్తించినట్లు జమ్మూ కశ్మీర్ పోలీసులు తెలిపారు. ఒకప్పుడు లష్కరే తొయిబా ఉగ్రముఠాలో కీలకంగా వ్యవహరించిన యాసిర్ ..ఏడాది కిందట దాని నుంచి విడిపోయి, స్వతంత్రంగా ఉగ్ర కార్యకలాపాలు కొనసాగిస్తున్నాడు. పహల్గామ్‌లో పర్యాటకులపై ఉగ్రదాడికి పాల్పడిన ముగ్గురు ముష్కరులతో అతడికి సంబంధాలు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. సోషల్ మీడియాలో వైరల్ అయిన ఉగ్రవాదుల ఫొటోలో యాసిర్ కూడా ఉండటం గమనార్హం. దీంతో అతడి కదలికలపై నిఘా ఉంచిన భద్రతా బలగాలు.. యూస్‌మార్గ్‌లో అతడి జాడ కనిపెట్టాయి.

**కాగా, కశ్మీర్‌లో యాసిర్ ఉనికిని తొలిసారి 2024లో గుర్తించారు. మే 4, 2024లో పూంఛ్‌లో భారత వైమానిక దళం సైనికుల కాన్వాయ్‌పై దాడి.. అదే ఏడాది అక్టోబరు 20న సోన్‌మార్గ్ సమీపంలో గగన్‌గిర్‌లో కార్మికులపై దాడి, అదే నెల 2024లో బోటా పత్రిలో సైన్యంపై దాడి సహ కనీసం మూడు ఘటనల్లో యాసిర్ పాత్ర ఉంది. ఈ దాడిలో ముగ్గురు సైనికులు సహా ఐదుగురు ప్రాణాలు కోల్పోయారు. పూంఛ్ నుంచి యూస్‌మార్గ్ మీదుగా పుల్వామాలోని పఖేర్‌పోరావైపు ఉగ్ర కదలికలు ఉన్నట్లు నిఘా వర్గాలు సమాచారం ఇవ్వడం ఈ ఆపరేషన్ చేపట్టినట్లు సైనికాధికారులు పేర్కొన్నారు. వారం రోజులుగా మాటువేసిన భద్రతా దళాలు.. యాసిర్‌తో పాటు మరికొందరు ఉంటారని భావిస్తున్నారు.**

బోటా పత్రి దాడి తర్వాత లష్కరే తోయిబా ఉగ్రవాదులు యాసిర్, మూసా యూస్ మార్గ్, పుల్వామా ప్రాంతాలలో దాక్కున్నారు. పిర్ పంజాల్ పర్వత శ్రేణుల గుండా జమ్మూ వైపు వెళ్లిన వీరు, ఈ నెల ప్రారంభంలో తిరిగి కశ్మీర్ లోయలోకి ప్రవేశించినట్లు భద్రతా దళాలు గుర్తించాయి. పూంచ్ పరిధిలోని అష్ఠార్ గలీ నుంచి యూస్ మార్గ్ ద్వారా పుల్వామాలోని పఖేర్పొరా వైపు ఉగ్రవాదులు వెళ్తున్న కదలికలను భద్రతా దళాలు ఖచ్చితమైన సమాచారంతో పసిగట్టాయి. సెప్టెంబరు 1 ఆర్మీ, జమ్మూ కశ్మీర్ పోలీసులు, సీఆర్పీఎఫ్ సంయుక్తంగా పర్వత ప్రాంతాన్ని చుట్టుముట్టి దిగ్బంధించాయి. అష్ఠార్ గలీ పర్వత ప్రాంతంలో ఉగ్రవాదులు కాల్పులు జరపడంతో ఇరువర్గాల మధ్య జరిగిన ఎదురుకాల్పుల్లో లష్కరే ఉగ్రవాది యాసిర్ హతమయ్యాడు. ఎన్‌కౌంటర్ స్థలం నుంచి ఒక ఏకే రైఫిల్‌ను స్వాధీనం చేసుకున్నారు.

# సోమరులు.. అసమర్థులు




**హిమాచల్‌ప్రదేశ్, సెప్టెంబర్ 05, అనంతజనశక్తి న్యూస్**

హిమాచల్‌ప్రదేశ్‌లోని మండి నియోజకవర్గ అభివృద్ధి పనులపై బీజేపీ ఎంపీ కంగనా రనౌత్ తాజాగా సమీక్ష నిర్వహించారు. జిల్లా స్థాయి అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ సమావేశంలో అధికారులను ఆమె గట్టిగా నిలదీశారు. సుమారు రూ.11 కోట్ల ఎంపీ నిధులు విడుదలైనా అభివృద్ధి పనులు ఆశించిన స్థాయిలో ముందుకు సాగకపోవడంపై ఆమె అసంతృప్తి వ్యక్తం చేశారు. అధికారుల పనితీరుపై తీవ్ర వ్యాఖ్యలు చేస్తూ వారిని 'సోమరులు, పూర్తిగా అసమర్థులు' అంటూ ఆమె విమర్శించారు .

మండి నియోజకవర్గంలో చేపట్టాల్సిన పనులపై అధికారులు పదేపదే హామీలు ఇస్తున్నారని, కానీ క్షేత్రస్థాయిలో మాత్రం పనులు కనిపించడం లేదని కంగన మండిపడ్డారు. ఇక మాటలు చెప్పడం ఆపి.. పెండింగ్‌లో ఉన్న పనులను వెంటనే పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఎంపీ నిధుల వినియోగంపై గత సమావేశాల్లో కూడా తాను ప్రశ్నించానని, అప్పుడు నిధుల వినియోగంలో ఎలాంటి సమస్యా లేదని అధికారులు చెప్పారని ఆమె అన్నారు. అయితే తర్వాత బయటి సంస్థల సర్వేలతో అసలు పరిస్థితి బయటపడిందని కంగన పేర్కొన్నారు .

'మండి నియోజకవర్గంలో కొన్ని అభివృద్ధి పనులు చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్నట్లు అధికారులు తెలిపారు . భూమి అందుబాటులో లేకపోవడం, అవసరమైన అనుమతులు రాకపోవడం వంటి కారణాలతో కొన్ని పనులు ఆలస్యమైనట్లు చెప్పారు. అయితే ఈ కారణాలు చెబుతూ పనులను మరింత ఆలస్యం చేయడానికి వీల్లేదని కంగన స్పష్టం చేశారు. ఇప్పటికే చాలా కాలం గడిచిపోయిందని, ఇకపై ప్రతి పనికి స్పష్టమైన పురోగతి ఉండాలని అధికారులను ఆదేశించారు.

# ఎమ్మెల్యే పదవికి కేసీఆర్ రాజీనామా చేయాలి

(మొదటి పేజీ తరువాయి)

కేసీఆర్ తన ఎమ్మెల్యే పదవికి వెంటనే రాజీనామా చేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ డిమాండ్ చేశారు. ప్రజలకు జవాబుదారీగా ఉండాల్సిన ప్రజాప్రతినిధి తన బాధ్యతలను నిర్వర్తించనప్పుడు ఎమ్మెల్యే పదవిలో కొనసాగడం ఎందుకని ప్రశ్నించారు. ఈ డిమాండ్‌పై ఈనెల 6న ఇందిరాపార్క్ ధర్నా చౌక్ వద్ద నిర్వహించనున్న మహా ధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. మహా ధర్నాపై హైదరాబాద్‌లో నిర్వహించిన సన్నాహక సమావేశంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్ బాబు మాట్లాడారు.

''బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో రాష్ట్రానికి తీవ్ర నష్టం జరిగింది. పదేళ్లలో 100 ఏళ్ల విధ్వంసం జరిగింది. వెయ్యి రోజులుగా ఎమ్మెల్యేగా జీతం తీసుకుంటూ అసెంబ్లీకి హాజరుకాకుండా, తన నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో లేకుండా, ప్రతిపక్ష నేత పాత్రను నిర్వర్తించకుండా కేసీఆర్ వ్యవహరిస్తున్నారు. ఈ విషయాన్ని ప్రజల దృష్టికి తీసుకెళ్లనున్నాం. అదేవిధంగా కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల ప్రజాపాలనలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను వివరిస్తాం'' అని పొన్నం ప్రభాకర్ తెలిపారు.



# టీచర్‌కు ప్రత్యామ్నాయం లేదు

(మొదటి పేజీ తరువాయి)

తెదేపా అధికారంలో ఉండగా 14 డీఎస్సీలు చేపట్టాం. టీచర్లు గౌరవంగా జీవించాలి.. రాజకీయ నేతల చుట్టూ తిరగకూడదు. ప్రతిభావంతులైన టీచర్లను అన్ని రకాలుగా ప్రోత్సహిస్తున్నాం. టెలికామ్, ఐటీ గురించి ముందే ఊహించా.. ఈ విషయం అప్పటి ప్రధానికి చెప్పా. ఆనాడు మేం వేసిన పునాది వల్లే హైదరాబాద్ రూపురేఖలు మారాయి. ఇప్పుడు ఏ దేశానికి వెళ్లినా మన తెలుగువాళ్లు కనిపిస్తారు. విదేశాల్లో ఎక్కువ సంపాదించేది కూడా తెలుగువాళ్లే. టెక్నాలజీని వాడుకుంటేనే అందరికంటే ముందుకెళ్లగలం. ఏఐ, క్వాంటం, డేటా సెంటర్లు, డ్రోన్లు, రోబోటిక్స్ వచ్చాయి" అని చంద్రబాబు అన్నారు.

**ఆక్వా రైతుల చిరకాల సమస్యలకు సీఎం చంద్రబాబు పరిష్కారం**

ఆక్వా రైతుల ఎన్నో ఏళ్ల సమస్యలను ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పరిష్కరించారు. ఈ మేరకు మత్స్యశాఖ జీవో నంబర్-1756ను విడుదల చేసింది. ఆక్వా రైతుల సమస్యలను సీఎం చంద్రబాబు దృష్టికి గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము తీసుకెళ్లారు. ఈ సమస్యలపై సీఎం సానుకూలంగా స్పందించి వెంటనే చర్యలు చేపట్టారు. మత్స్యశాఖ విడుదల చేసిన జీవోపై ఆక్వా రైతు సంఘం నాయకులు హర్షం వ్యక్తం చేశారు. గుడివాడ ప్రజావేదికలో ఎమ్మెల్యే రామును.. ఆక్వా రైతులు శనివారం కలిసి కృతజ్ఞతలు తెలిపారు. జీవోలోని నిబంధనలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే రాము సూచించారు. గత ప్రభుత్వంలో పట్టించుకోని తమ సమస్యలకు కూటమి ప్రభుత్వంలో పరిష్కారం లభించిందని ఆక్వా రైతు సంఘం నాయకులు పేర్కొన్నారు.




# రెవెన్యూ వ్యవస్థ పూర్తిగా క్షీణించింది

(మొదటి పేజీ తరువాయి)

22ఏ భూముల వ్యవహారంపై న్యాయ విచారణ జరపాలి..

గతంలో 15 శాతం కమీషన్ ఉంటే.. ఇప్పుడు 30 శాతం కమీషన్ తీసుకుంటున్నారని రాంచందర్ రావు ఆరోపించారు. 22ఏ భూముల వ్యవహారంపై న్యాయ విచారణ జరపాలని డిమాండ్ చేశారు. తెలంగాణలో రెవెన్యూ వ్యవస్థ పూర్తిగా క్షీణించిందని విమర్శించారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ దొందూ దొందే అని రాంచందర్ రావు ఎద్దేవా చేశారు.



# 'డిజిటల్ అరెస్ట్' కేసులు..

## 20 రాష్ట్రాల్లో సీబీఐ సోదాలు



డిజిటల్ మోసాలపై నమోదైన కేసులకు సంబంధించి కేంద్ర దర్యాప్తు సంస్థ కీలక ఆపరేషన్ చేపట్టింది. దేశ వ్యాప్తంగా 20 రాష్ట్రాల్లో 89 చోట్ల సోదాలు జరిపింది. మూడు కేసుల్లో ప్రధాన నిందితులుగా ఉన్న ముగ్గురిని అరెస్టు చేసింది. వారి నుంచి బ్యాంకు ఖాతాల వివరాలు, డిజిటల్ పరికరాలు, ఇతర కీలక ఆధారాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపింది. డిజిటల్ అరెస్టుల పేరుతో బాధితుల నుంచి రూ.కోట్ల డబ్బును దోచుకోవడం, వాటిని ఇతర ఖాతాలకు మళ్లించడం వంటి చర్యలకు పాల్పడుతున్నారని పేర్కొంది.
పోలీసు, ఇతర ప్రభుత్వ అధికారులుగా నటిస్తూ సైబర్ నేరగాళ్లు అనేక రాష్ట్రాల్లో డిజిటల్ అరెస్టులకు పాల్పడుతూ బాధితుల నుంచి రూ.కోట్లు కొల్లగొడుతున్న విషయం తెలిసిందే. ఈ తరహా నేరాలపై కఠిన చర్యలు తీసుకోవాలని సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాల మేరకు రంగంలోకి దిగిన సీబీఐ.. మూడు కేసుల్లో ప్రధాన నిందితులను అరెస్టు చేసింది. ఈ మూడు కేసుల్లోనే బాధితులు సుమారు రూ.42 కోట్లు నష్టపోయినట్లు సీబీఐ వెల్లడించింది.
బిట్స్ పిలానీకి సంబంధించిన ఓ కేసులో పోలీసు అధికారిగా నమ్మిస్తూ సైబర్ నేరగాళ్లు ఓ వ్యక్తిని మూడు నెలల పాటు డిజిటల్ అరెస్టు చేశారు. బాధితుడి నుంచి రూ.7.67 కోట్లు దోచుకున్నారు. గుజరాత్‌లో మరో కేసులోనూ పోలీసులుగా నటిస్తూ మరో వ్యక్తి నుంచి రూ.19.24 కోట్లు దోపిడీ చేశారు. కర్ణాటకకు సంబంధించిన కేసులోనూ బాధితుడిని నెల రోజుల పాటు డిజిటల్ అరెస్టు చేసి రూ.14.45 కోట్లు తమ ఖాతాలకు మళ్లించుకోవడం గమనార్హం.
అరెస్టైన వారిలో హరియాణాకు చెందిన ఆకాశ్.. తన అకౌంట్లోకి రూ.1.95 కోట్ల నగదు స్వీకరించినట్లు సీబీఐ గుర్తించింది. కోల్‌కతాకు చెందిన రాజ్ కర్మాకర్ ఖాతాలోకి రూ.1.5 కోట్లు, జ్యోతి రాణి అనే యువతి ఖాతాలోకి భారీ మొత్తంలో మోసపూరిత నగదు వచ్చినట్లు సీబీఐ గుర్తించింది. వీటిలో కొంత నగదు విత్‌డ్రా చేయడం, మిగతా మొత్తాన్ని వివిధ ఖాతాలకు మళ్లిస్తున్నట్లు గుర్తించామని సీబీఐ అధికార ప్రతినిధి పేర్కొన్నారు.

# సదా వందనీయులు మన ఉపాధ్యాయులు



> **అంకితభావం, నిబద్ధత గల ఉపాధ్యాయుల పట్ల దేశ పౌరులు సదా గౌరవ భావం చూపాలి. అంకితభావం గల ఉపాధ్యాయుల సహకారంతో మన దేశం కొత్త విషయాలను నేర్చుకుంటూ కొంగొత్త శిఖరాలకు చేరుకోవాలని హృదయపూర్వకంగా ఆకాంక్షిస్తున్నాను.**
> **ద్రౌపదీ ముర్ము (భారత రాష్ట్రపతి)**

ఉపాధ్యాయులు మన విద్యార్థుల భవితవ్యాన్ని తీర్చిదిద్దే గురుతర బాధ్యత నిర్వర్తిస్తున్నారు. కోట్లాది విద్యార్థుల జీవితాల్లో జ్ఞానాన్ని, నైపుణ్యాలను, నైతిక విలువలను, స్ఫూర్తిని నింపుతున్న ఉపాధ్యాయులందరికీ ఈ ఉపాధ్యాయ దినోత్సవ సందర్భంగా దేశ ప్రజలందరి తరఫున కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. దేశ రెండో రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ సంస్మరణార్థం మనం ఉపాధ్యాయ దినోత్సవం వేడుకగా నిర్వహించుకుంటున్నాం. డాక్టర్ రాధాకృష్ణన్ అంతర్జాతీయ ఖ్యాతి గడించిన మేధావి, ప్రసిద్ధ రచయిత, దార్శనికుడు. అయినప్పటికీ వాటన్నింటి కంటే ఉపాధ్యాయుడిగా తన పాత్రే గొప్పదని రాధాకృష్ణన్ భావించారు. దేశ ప్రజలు అమితంగా అభిమానించే మాజీ రాష్ట్రపతులలో ఒకరైన డాక్టర్ ఏ.పి.జె. అబ్దుల్ కలామ్‌ను మిమ్మల్ని శాస్త్రవేత్తగా గుర్తుంచుకోవాలని కోరుకుంటారా లేక రాష్ట్రపతిగానా అని ప్రశ్నించగా తాను మంచి ఉపాధ్యాయుడిగా గుర్తుండిపోవాలని కోరుకుంటానని బదులిచ్చారు..
తమ సామర్థ్యాలు, సచ్ఛీలత వల్ల ఆరాధనీయులయ్యే ఉపాధ్యాయుల పట్ల విద్యార్థుల్లో సహజంగానే భక్తి భావన ఏర్పడుతుంది. అలాంటి ఉపాధ్యాయులే మనకు సదా స్ఫూర్తిదాతలు. ఉపాధ్యాయులు తమ విద్యార్థులను సొంత బిడ్డల్లా ప్రేమించాలనీ, అందరినీ సమానంగా, నిష్పక్షపాతంగా చూడాలని, విద్యార్థుల పై ఆగ్రహించకుండా ఓర్పు, సహనాలతో వ్యవహరించాలని మన ప్రాచీన గ్రంథాలు పేర్కొంటున్నాయి. నిత్యం విద్యార్థుల శ్రేయస్సుకే ప్రాధాన్యత ఇవ్వాలని, వారి సామర్థ్యానికి తగినట్లుగా బోధించాలని నిర్దేశిస్తున్నాయి.
అమిత జ్ఞానం, ఆప్యాయత గల ఉపాధ్యాయుల మార్గదర్శకత్వం లభించడం నా అదృష్టం. కొన్నిసార్లు మా ఉపాధ్యాయులు పాఠశాల వేళలు ముగిసిన తర్వాత కూడా తమ ఇళ్లలో మాకు పాఠాలు చెప్పేవారు, మమ్మల్ని ఎంతో శ్రద్ధగా చూసుకునేవారు.
నేను ఒడిశాలోని రాయిరంగపూర్‌లో శ్రీ అరవిందో ఇంటిగ్రల్ పాఠశాల పిల్లలకు పాఠాలు చెప్పాను. వారికి వివిధ సబ్జెక్టులు బోధించడంతో పాటు, వారు సంగీత ప్రదర్శనలు, క్రీడా కార్యక్రమాలు, నాటకాలలో పాల్గొనడానికి సహాయపడేదాన్ని. స్వాతంత్ర్య, గణతంత్ర దినోత్సవ వేడుకల్లో పాల్గొనేందుకు విద్యార్థులను సిద్ధం చేసేదాన్ని. ఆ వేడుకల సమయంలో వారిలో వెల్లివిరిసిన ఆనందోత్సాహాలను గుర్తు చేసుకోవడం నేటికీ నాకెంతో ఉత్సాహాన్ని ఇస్తుంది. పిల్లలను పిక్నిక్‌లకు తీసుకెళ్లి సుందర ప్రకృతిని చూపడం; ఆటలు, అన్వేషణల ద్వారా పక్షులు, జంతు, వృక్ష ప్రపంచాన్ని వారికి పరిచయం చేయడంలో గొప్ప సంతృప్తిని పొందాను. అలా ఉపాధ్యాయ వృత్తిలో పరమార్థాన్ని కనుగొన్నాను.
పాఠశాల చదువు ముగించుకుని సంవత్సరాలు గడిచినా కూడా నా విద్యార్థులు నన్ను తమ కుటుంబ వేడుకలకు ఆహ్వానిస్తుంటారు. నా విద్యార్థులలో చాలా మంది పేర్లే కాకుండా, వారిని ప్రేమగా పిలుచుకునే ముద్దు పేర్లు కూడా నాకు గుర్తున్నాయి. తాము విద్య నేర్పిన విద్యార్థులలోని సహజత్వం, జిజ్ఞాసల నుంచి ఉపాధ్యాయులు కూడా చాలా నేర్చుకుంటారని నేను నమ్ముతున్నాను.
రాష్ట్రపతిగా రెండవ సంవత్సరం పూర్తి చేసుకున్న సందర్భంగా, రాష్ట్రపతి భవన్ పరిసరాల్లోని పాఠశాలల విద్యార్థులను కలసి వారికి పర్యావరణ పరిరక్షణ గురించి బోధించే అవకాశం నాకు దక్కింది. సుమారు పదకొండేళ్ల క్రితం నా స్వగ్రామంలో ఒక వసతి గృహ పాఠశాలను స్థాపించాను. ఆ పాఠశాలలో నిరుపేద కుటుంబాలకు చెందిన, తల్లిదండ్రులను కోల్పోయిన పిల్లలు చదువుతున్నారు. వారిని కలవడానికి నేను తరచూ ఆ పాఠశాలను సందర్శిస్తుంటాను. ఈ ఏడాది జూన్ 20న నా పుట్టినరోజున పిల్లలను కలిసే అవకాశం రావడం ఎంతో ఆనందాన్నిచ్చింది. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ జీ కూడా నాతో పాటు పాఠశాలను సందర్శించి విద్యార్థులకు స్ఫూర్తినిచ్చారు. విద్యను అందించే బాధ్యత ఒక్క ఉపాధ్యాయులది మాత్రమే కాదు. తమ ప్రవర్తన, తమ విజయాల ద్వారా పిల్లలకు ఆదర్శనీయులుగా నిలిచేవారు కూడా స్ఫూర్తిదాతలే.
ఏడో తరగతి పూర్తి చేసిన తర్వాత తదుపరి విద్య కోసం మా గ్రామం దాటి వెళ్లిన మొట్టమొదటి అమ్మాయిని నేనే. ఆ తర్వాత భువనేశ్వర్‌లో చదువుతున్న రోజుల్లో కూడా ఉపాధ్యాయుల అపారమైన ప్రేమను, ప్రోత్సాహాన్ని పొందే అదృష్టం నాకు లభించింది. విద్యార్థులపై ప్రేమ, వృత్తి పట్ల అంకితభావం గల ఉపాధ్యాయులు విద్యార్థిలో అనంత సామర్థ్యాన్ని, స్ఫూర్తిని మేల్కొల్పగలరని వారిని చూశాకే నాకర్థమైంది.
మంచి ఉపాధ్యాయులు తమ విద్యార్థులు ఉత్తమమైన వ్యక్తులుగా మారాలన్న తపనతో పనిచేస్తుంటారు. సమ్మిళిత అభివృద్ధిని సాధించిన దేశంగా మారాలనే లక్ష్యంతో భారత్ ముందుకు సాగుతోంది. ఈ దశలో నవతరం విద్యార్థులు వ్యక్తిగత, సామూహిక నైపుణ్యాల సాధన కోసం శ్రమిస్తూ 'దేశానికే అగ్ర ప్రాధాన్యం' అనే స్ఫూర్తితో ముందుకు సాగేలా ఉపాధ్యాయులు ప్రోత్సహించాలి.

## ఆ బడికి.. 'హాకీ'ర్తి కిరీటం



ఝార్ఖండ్‌లోని బరియాటు సీఎంఎస్ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ (గర్ల్స్)లో అడుగు పెడితే అక్కడ విద్యార్థినుల చేతుల్లో పుస్తకాలతోపాటు హాకీ స్టిక్‌లూ దర్శనమిస్తాయి. ఆ ఆటలో మేటి అయ్యేందుకే చాలామంది ఆ స్కూల్లో చేరతారు. అక్కడుండే హాకీ శిక్షణ కేంద్రం నుంచి ఇప్పటికి 50 మందికి పైగా క్రీడాకారిణులు జాతీయ, అంతర్జాతీయ, ఒలింపిక్స్‌కి ప్రాతినిధ్యం వహించారు. 2016 రియో, 2020 టోక్యో ఒలింపిక్స్‌లో ఆడిన నిక్కీ ప్రధాన్, భారత హాకీ జట్టు మాజీ కెప్టెన్ అసుంతా లక్రా.. ఆ స్కూల్లో క్రీడా ఓనమాలు దిద్దినవాళ్లే. 2002 మాంచెస్టర్ కామన్వెల్త్ గేమ్స్‌లో స్వర్ణం సాధించిన జట్టులో సభ్యురాలు సుమ్రాయ్ టెటేతోపాటు సావిత్రి పుర్తీ, పుష్పా ప్రధాన్, ఆల్బా మింజ్ వంటి ప్రముఖ క్రీడాకారిణులు కూడా ఈ కేంద్రం నుంచే జాతీయ స్థాయికి ఎదిగారు. తాజాగా ఇక్కడి నుంచే ఐదుగురు ఇంగ్లాండ్, స్కాట్లాండ్ పర్యటనకు ఎంపికయ్యారు. 1972లో ఇక్కడ మహిళల హాకీ శిక్షణ కేంద్రం ప్రారంభమైంది. అప్పట్నుంచి ఈ పాఠశాల ఝార్ఖండ్‌లో మహిళా హాకీ క్రీడాకారులను తయారు చేసే ప్రధాన కేంద్రంగా మారింది. ప్రస్తుతం 30 మంది అమ్మాయిలు శిక్షణ పొందుతున్నారు.

## నేపాల్.. ఇంకా ఆచూకీ లేని 275 మంది భారతీయులు

నేపాల్ జలప్రళయంలో 275 మంది భారతీయుల ఆచూకీ ఇంతవరకు తెలియరాలేదని భారత విదేశాంగ శాఖ వెల్లడించింది. నేపాల్‌లో చిక్కుకుపోయిన 166 మందిని అక్కడి సిబ్బంది రక్షించినట్లు తెలిపింది. 1,907 మంది భారతీయులు చైనా నుంచి నేపాల్‌కు సురక్షితంగా చేరుకున్నారని విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జయస్వాల్ తెలిపారు.
గల్లంతైన భారతీయుల విషయమై నేపాల్ ప్రభుత్వంతో నిరంతరం సంప్రదింపులు జరుతూనే ఉన్నామని జయస్వాల్ పేర్కొన్నారు. గాలింపు చర్యల్లో భాగంగా అక్కడి ప్రభుత్వం అన్నివిధాలా కృషి చేస్తోందని, వారికి అవసరమైన సహాయాన్ని భారత్ అందిస్తూనే ఉంటుందన్నారు. మరిన్ని ఫోరెన్సిక్ కిట్లు, బైలీ వంతెనలను పంపిస్తామన్నారు. ఇప్పటివరకు నేపాల్‌కు ఏడు విమానాల్లో 95 టన్నుల సహాయక సామగ్రి తరలించామని అన్నారు. దీనికితోడు రెస్క్యూ ఆపరేషన్‌లో పాల్గొనేందుకు 54 మంది సిబ్బందిని పంపించినట్లు చెప్పారు.
ఇదిలా ఉంటే, నేపాల్ వరదల్లో మరణించినవారి సంఖ్య 1,295కు చేరగా, సుమారు 5వేల మంది ఆచూకీ లభ్యం కాలేదు.



## సీజేపీ కార్యకర్త తండ్రి తల పగులగొట్టిన 'ఇన్‌ఫ్లుయెన్సర్' అరెస్టు

**కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా కోరుతూ ఢిల్లీలోని జంతర్ మంతర్‌లో జరిగిన నిరసన ప్రదర్శన సందర్భంగా కాక్రోచ్ జనతాపార్టీ కార్యకర్త నిషు ఆజాద్ తండ్రిపై దాడి చేసి ఆయన తల పగులగొట్టానని ఒక సోషల్ మీడియా వీడియో ద్వారా చాటుకున్న 'హిందూత్వ ఇన్‌ఫ్లుయెన్సర్' స్వతంత్ర భరద్వాజ్ పోలీసులకు చిక్కాడు. అతణ్ని ఉత్తర్‌ప్రదేశ్‌లోని బులంద్‌శహర్‌లో శుక్రవారం అరెస్టు చేశారు. తనను తాను "కట్టర్ హిందూ"గా అభివర్ణించుకునే భరద్వాజ్ ఆచూకీ కనుగొనేందుకు పలు పోలీసు బృందాలు సమన్వయంతో పనిచేసి విజయం సాధించాయి. నిషు ఆజాద్ తండ్రి పుర్రె పగులగొట్టి ఆయన తలకు 60 కుట్లు పడేలా చేశానని ఒక వీడియోలో స్వయంగా వెల్లడించిన భరద్వాజ్‌ను 72 గంటల్లో అరెస్టు చేస్తామని ఢిల్లీ పోలీసులు అంతకు ముందు సీజేపీ నాయకత్వానికి హామీ ఇచ్చినప్పటికీ కొన్ని గంటలు గడవకనే అతణ్ని నిర్బంధించడం గమనార్హం.**





## మేఘాలు తాకుతాయ్.. మనసులు తేలికవుతాయ్!



మంచు దుప్పటి కప్పేసినట్లు కనిపించే మేఘాలు, పచ్చని పర్వతాల నడుమ డుడుమ లోయలు ప్రకృతి ప్రేమికులను మంత్రముగ్ధులను చేస్తున్నాయి. 556 అడుగుల ఎత్తు నుంచి జాలువారే జలపాతం, లోయలో ఎర్రటి నీటి ప్రవాహాలను చూడటానికి రెండు కళ్లూ చాలవేమో అనిపిస్తోంది. ఒడిశాలోని కొరాపుట్ జిల్లా లమతాపుట్ సమితి ఒనకడిల్లీలోని ఈ ప్రాంతాన్ని తిలకించటానికి ఆంధ్రప్రదేశ్, ఒడిశా, ఛత్తీస్‌గఢ్ నుంచి పర్యాటకులు పెద్దసంఖ్యలో వస్తున్నారు. ప్రకృతి అందాలను మనసారా ఆస్వాదిస్తూ సెల్‌ఫోన్లు, కెమెరాల్లో జ్ఞాపకాలను పదిలపరచుకుంటున్నారు.

## చింపాంజీల్లోనూ యాస



మనుషుల్లోనే కాదు.. చింపాంజీల్లో కూడా భిన్న సమూహాలకు భిన్న యాసలు ఉంటాయని తాజా అధ్యయనం పేర్కొంది. పసి చింపాంజీల నవ్వులు, ఏడుపు, చిన్న చిన్న అరుపుల్ని ధ్వని శాస్త్రం సాయంతో విశ్లేషించి ఆ జీవులకూ ప్రత్యేకమైన యాస ఉంటుందని తేల్చారు. వాటి సంతానం విలక్షణమైన ధ్వని పోకడలను అలవర్చుకుంటాయని శాస్త్రవేత్తలు తెలిపారు. ఈ పోకడల్ని పరిశోధకులు యాసగా అభివర్ణిస్తున్నారు. ఈ మేరకు ఒక వైజ్ఞానిక అధ్యయన నివేదికను పీఎల్ఓఎస్ జర్నల్ ప్రచురించింది. చింపాంజీ సమూహాలు ఏ విధంగా ధ్వని సంకేతాలను అభివృద్ధి చేసుకుంటాయో ఈ నివేదిక విశ్లేషించింది. ఇందులో భాగంగా జాంబియాలోని చిమ్‌పున్షి వన్యప్రాణి అనాథాలయం, టాంజానియాలోని గోంబే నేషనల్ పార్క్‌లలోని చింపాంజీ సమూహాల వాచ్య సంకేతాలను పోల్చారు. ఒక ప్రాంతంలో ఉన్న చింపాంజీలు ఒకరినొకరు పిలుచుకునే పద్ధతి మరో ప్రాంతంలోని చింపాంజీల ధ్వని సంకేతాలకు భిన్నంగా ఉన్నాయని అధ్యయన నివేదిక రచయితలు వెల్లడించారు. ఈ జంతువుల్లో జీవితాంతం ఒకే రకమైన ధ్వని సంకేతాలు ఉంటాయన్న భావన సరైనది కాదని, ఇవి తమ సమూహంలోని ఇతర జంతువులతో వ్యవహరించడం పెరిగే కొద్దీ వాటి ధ్వని సంకేతాల్లో మార్పులు చోటు చేసుకున్నాయని గుర్తించారు.

## విమానం భారీ కుదుపు ఘటన.. పైలట్‌ను తొలగించిన ఎయిరిండియా

థాయ్‌లాండ్ నుంచి ఢిల్లీ వచ్చే విమానం ఇటీవల తీవ్ర కుదుపులకు లోనైన ఘటన తీవ్ర చర్చనీయాంశమైన విషయం తెలిసిందే. ఈ వ్యవహారానికి సంబంధించి కీలక చర్యలు చేపట్టిన ఎయిరిండియా విమానయాన సంస్థ.. డ్రగ్స్ వాడినట్లు తేలిన ఆ పైలట్‌ను విధుల నుంచి తొలగించినట్లు వెల్లడించింది. అయితే, ఘటనపై దర్యాప్తు జరిపి ప్రాథమిక నివేదిక ఇచ్చిన ఎయిర్‌క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో .. పైలట్ డ్రగ్స్ తీసుకోవడాన్ని తీవ్రంగా పరిగణించింది. ఈ ఘటనలో తగిన చర్యలు తీసుకోవాలని డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్‌కు (DGCA) సూచించిన కొన్ని గంటల్లోనే సదరు పైలట్‌ను తొలగిస్తున్నట్లు ఎయిరిండియా ప్రకటించింది.
'ఫుకెట్ ఢిల్లీ విమాన పైలట్‌కు జరిపిన సైకోయాక్టివ్ సబ్‌స్టాన్స్ పరీక్షలో పాజిటివ్‌గా నిర్ధరణ అయ్యింది. ఎయిరిండియా భద్రతా ప్రమాణాలను ఉల్లంఘించినందున పైలట్‌ను విధుల నుంచి తొలగిస్తున్నాం. ఈ నిర్ణయం తక్షణమే అమల్లోకి వస్తుంది'' అని ఎయిరిండియా ఓ ప్రకటన పేర్కొంది. ఇదిలా ఉంటే, ఆగస్టు 4న 145 మందితో ఫుకెట్ నుంచి ఢిల్లీ వస్తున్న ఎయిరిండియా విమానం 36వేల అడుగుల ఎత్తులో ఉండగా అకస్మాత్తుగా 300 అడుగుల కిందకు దిగింది. దీంతో విమానం తీవ్ర కుదుపులకు గురికావడంతో ప్రయాణికులు భయాందోళనకు గురయ్యారు. ఈ ఘటనలో పలువురు గాయపడ్డారు.

## జంతర్ మంతర్‌లో పోలీసుల వైఖరి బాధాకరం

**– జస్టిస్ ఉజ్జల్ భూయాన్**

గత జులై 20న ఢిల్లీలోని జంతర్ మంతర్‌లో ప్రదర్శన నిర్వహిస్తున్న విద్యార్థులు, ప్రదర్శనకారుల పట్ల పోలీసులు అనుసరించిన వైఖరి అత్యంత బాధాకరమని, ఆందోళన కలిగించే విషయమని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భూయాన్ శుక్రవారం పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ భద్రతా వ్యవహారాల శాఖ మాజీ కార్యదర్శి యశోవర్ధన్ ఆజాద్ రచించిన ''పోలీసింగ్ ద రిపబ్లిక్'' అనే పుస్తక విడుదల కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ''భారత పోలీస్ సర్వీసుకు చెందిన యువ అధికారులు నిరసనకారులపై దాడి చేసిన తీరు విస్మయం కలిగించింది. ఇది చూడటానికి ఎంతో బాధ కలిగింది'' అని జస్టిస్ భూయాన్ అన్నారు. పోలీసు అధికారుల్లో నిష్పాక్షికత నశించిపోతున్నట్టుగా కనిపిస్తోంది. నిజంగా ఇది ఆందోళనకరం'' అని ఆయన అన్నారు. అతిగా బలప్రయోగం, మానవ హక్కుల ఉల్లంఘనలకు పాల్పడకుండానే పోలీసులు తమ విధులను నిర్వర్తించవచ్చని భుయాన్ తన ప్రసంగంలో పేర్కొన్నారు. పోలీసు యంత్రాంగం తన విశ్వసనీయతను కాపాడుకోవాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పారు. పోలీసులు రాజ్యాంగానికి బద్ధులైనప్పుడే లాకప్‌లో చిత్రహింసలు, లాకప్ మరణాలు నిలుస్తాయన్నారు. మణిపుర్‌లో జరిగిన హింస మనందరికీ, జాతి మొత్తానికి ఒక గుణపాఠం కావాలన్నారు.





# డేటా సెంటర్లకు తాగు నీరు

ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చేతుల మీదుగా రేపు పాయకరావుపేట వద్ద జరుగనున్న 'జలహారతి' కార్యక్రమం ద్వారా ఉత్తరాంధ్రకు గోదావరి జలాలు విడుదల కాబోతున్నాయి. ఒకవైపు ఇలా పోలవరం కాలువ ద్వారా గోదావరి జలాలు ఉత్తరాంధ్ర ముఖద్వారాన్ని తాకుతుంటే, మరోవైపు ఈ నీటి వినియోగంపై దుష్ప్రచారం పెచ్చుమీరుతున్నది. విశాఖపట్నం నగరవాసులకు దక్కాల్సిన మంచినీటిని ఈ డేటా సెంటర్లు తోడేస్తాయన్నది ఈ ప్రచారం సారాంశం. కానీ, శాసనసభలో ఐటీ మంత్రి లోకేశ్ ఇచ్చిన అధికారిక సమాచారం, క్షేత్రస్థాయి ఇంజనీరింగ్ డేటాను పరిశీలిస్తే, ఈ ఆరోపణలన్నీ అవగాహనా రాహిత్యంతో చేస్తున్నవేనని తెలుస్తుంది. విశాఖపట్నం ప్రజల మున్సిపల్ తాగునీటి సరఫరా వ్యవస్థకు, గూగుల్ డేటా సెంటర్లకు వాడే నీటి వ్యవస్థకు సాంకేతికంగా కానీ, భౌతికంగా కానీ ఎటువంటి సంబంధమూ లేదు. విశాఖపట్నం ప్రజల కోసం కేటాయించిన ఒక్క నీటి చుక్కను కూడా ప్రభుత్వం పరిశ్రమలకు మళ్లించదని మంత్రి లోకేశ్ స్పష్టంగా చెప్పారు.

పోలవరం ఎడమ ప్రధాన కాలువ ద్వారా విశాఖ–అనకాపల్లి ప్రాంతానికి అందుబాటులోకి వచ్చే మొత్తం 23.44 టీఎంసీల నీటిలో ప్రభుత్వం స్పష్టమైన విభజనను అమలు చేస్తోంది. గ్రేటర్ విశాఖపట్నం, పరిసర పట్టణాల్లోని ఇళ్లకు వాడే మంచినీటి కోసం 12 టీఎంసీలు కేటాయించారు. ఈ కోటాను పరిశ్రమలకు మళ్లించడం అసాధ్యం. గూగుల్, అదానీ ఏఐ డేటా సెంటర్ల పూర్తి స్థాయి వినియోగానికి కావలసిన 3.5 టీఎంసీలతో కలుపుకుని, పారిశ్రామిక కారిడార్ అవసరాలకు మొత్తం 4 టీఎంసీలు కేటాయించారు. ఇక అనకాపల్లి, విశాఖ, తూర్పు గోదావరి జిల్లాల పరిధిలోని ఆయకట్టుకు సాగునీరు అందించేందుకు 7.44 టీఎంసీలు కేటాయించారు. ప్రతి ఏడాది సముద్రంలో వృథాగా కలిసే 3,000 టీఎంసీల గోదావరి జలాల నుంచే ఈ కేటాయింపులు జరుగుతున్నాయి తప్ప, రైతుల కోసమో, నగరవాసుల కోసమో కేటాయించిన నీటిని ప్రభుత్వం తీసుకోవడం లేదు.

గూగుల్, అదానీ డేటా సెంటర్ల కోసం నిర్మించే నీటి లైన్లు మిగతా వాటితో పూర్తిగా సంబంధం లేకుండా ఉంటాయి. నగరంలో ఇళ్ళకు నీటిని సరఫరా చేసే మున్సిపల్ పైప్‌లైన్లకు, గ్రేటర్ జీవీఎంసీ నిర్వహించే తాగునీటి రిజర్వాయర్లకు ఈ పారిశ్రామిక పైప్‌లైన్లతో ఎలాంటి కనెక్షన్ ఉండదు. కాబట్టి డేటా సెంటర్లు ఎంత నీటిని వినియోగించినా అది నగరవాసుల తాగునీటి సరఫరాపై ఎటువంటి ప్రభావాన్నీ చూపించదు.

పోలవరం ఎడమ ప్రధాన కాలువ ద్వారా ఈ ప్రాంతానికి నీటిని తెచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం గత రెండేళ్లలో సుమారు రూ.1,050కోట్లు ఖర్చు చేసి, కాలువ నిర్మాణంలో ఉన్న అనేక అడ్డంకులను తొలగించింది. 181.99కి.మీ పొడవైన ఈ ఎడమ ప్రధాన కాలువలో మట్టి తవ్వకం పనులు దాదాపు పూర్తయ్యాయి. కాలువ ద్వారా ఇప్పటికే తూర్పు గోదావరి, పిఠాపురం పరిసర ప్రాంతాలకు నీరు ప్రవహిస్తోంది. అనకాపల్లి వద్దకు చేరుకొనే ఈ జలాల నుంచే ఒకవైపు వ్యవసాయ భూములకు సాగునీరు, మరోవైపు పరిశ్రమలకు ప్రత్యేక పైప్‌లైన్ల ద్వారా నీటి తరలింపు జరుగుతుంది.

ప్రభుత్వం గూగుల్ వంటి పారిశ్రామిక దిగ్గజాలకు ప్రజాధనంతో ఉచితంగా నీటి మౌలిక వసతులను కల్పిస్తోందనే ఆరోపణ పూర్తిగా వాస్తవదూరం. పోలవరం ప్రధాన ప్రాజెక్టు మౌలిక వసతులను ప్రభుత్వం పూర్తి చేస్తున్నప్పటికీ, ఈ కాలువ నుంచి తార్లవాడ, అడవివరం, రాంబిల్లి వంటి డేటా సెంటర్ కారిడార్ క్యాంపస్‌లకు నీటిని తీసుకెళ్లే బల్క్ ఇన్–టేక్, ప్రాజెక్టు అంతర్గత మౌలిక సదుపాయాల వ్యయాన్ని రాష్ట్ర పారిశ్రామిక కేటాయింపుల విధానాలకు, ఆయా సంస్థలతో చేసుకున్న ఒప్పంద నిబంధనలకు అనుగుణంగానే చేపడుతున్నారు. దీని ద్వారా సాధారణ పన్ను చెల్లింపుదారులపైన గానీ, నగర మున్సిపల్ నిధులపైన గానీ ఎలాంటి అనవసర భారమూ పడదు.

ఇక డేటా సెంటర్లు నీటిని తాగేస్తాయన్న ప్రచారం కూడా నిజం కాదు. ఐటీ, పర్యావరణ నిబంధనల ప్రకారం, గూగుల్ వంటి సంస్థలు అత్యంత అధునాతన సాంకేతికతలను ఉపయోగిస్తున్నాయి. వారు వాడే క్లోజ్డ్–లూప్ ఎయిర్–కూలింగ్ టెక్నాలజీల వల్ల ఇతర భారీ పరిశ్రమలతో పోలిస్తే నీటి వాడకం అత్యంత తక్కువ. విశాఖపట్నం ఐటీ కారిడార్ దాని గరిష్ఠ సామర్థ్యమైన 6.5 గిగావాట్లకు చేరుకున్నప్పుడు మాత్రమే డేటా సెంటర్లకు ఏటా 3.0 నుంచి 3.5 టీఎంసీల నీరు అవసరమవుతుంది. ఏటా గోదావరి నుంచి సముద్రంలో వృథాగా కలిసే 3 వేల టీఎంసీల జలాలతో పోలిస్తే ఇది కేవలం 0.1శాతం మాత్రమే.

డేటా సెంటర్ల నిర్మాణంలోని ప్రస్తుత దశలో అతి తక్కువ నీరు సరిపోతుంది. 2028–29 నాటికి ఫేజ్ 1 ప్రారంభ సమయానికి సర్వర్ల కమిషనింగ్ మొదలైనప్పుడే అసలు నీటి వాడకం ప్రారంభమవుతుంది. అంటే, నగరానికి శాశ్వత తాగునీటి పైప్‌లైన్లు పూర్తయిన తర్వాతే డేటా సెంటర్ల వాడకం క్రమంగా పెరుగుతుంది.

మరోపక్క గూగుల్ సంస్థ కూడా 2030 నాటికి వాటర్ పాజిటివ్ కావాలనే లక్ష్యాన్ని నిర్దేశించుకుంది. అంటే, వినియోగించే నీటి కంటే ఎక్కువ నీటిని స్థానిక భూగర్భజలాల పునరుద్ధరణ ద్వారా, రీసైక్లింగ్ ద్వారా, చెరువుల పునరుజ్జీవనం ద్వారా తిరిగి సమాజానికి అందిస్తుందన్నమాట. పరిశ్రమల కోసం కేటాయించిన 4 టీఎంసీల కోటాకు అదనంగా, గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్ ద్వారా శుద్ధి చేసిన వ్యర్థ జలాలను, 100 ఎంఎల్డీ సామర్థ్యంతో ప్రతిపాదించిన సముద్రపు నీటి శుద్ధీకరణ ప్లాంట్లను ప్రత్యామ్నాయ వనరులుగా డాటా సెంటర్లకు ఉపయోగిస్తారు. దీనివల్ల వేసవిలో కూడా నగరానికి అందే మంచి నీటి నిల్వల నుంచి ఒక్క చుక్క నీటిని కూడా పరిశ్రమలకు మళ్లించాల్సిన అవసరం ఉండదు.

విశాఖ తీర ప్రాంతంలో చేపడుతున్న ఆందోళనలు పూర్తిగా రాజకీయ ప్రేరేపితమైనవీ లేదా సమాచార లోపం వల్ల చేస్తున్నవి. విశాఖపట్నంలో ప్రస్తుతం రోజువారీ నీటి డిమాండ్ 480 మిలియన్ లీటర్లు కాగా, సరఫరా 410 మిలియన్ లీటర్లు మాత్రమే. ఈ పాత కొరతను సాకుగా చూపిస్తూ, 'మనం డేటాను తాగలేం' వంటి ఆకర్షణీయమైన నినాదాలతో ప్రజలను భయాందోళనలకు గురిచేస్తున్నారు. అంతా పారదర్శకమైన విధానాల ద్వారాను, స్పష్టమైన చట్టబద్ధమైన కేటాయింపుల మార్గంలోను జరుగుతున్నప్పుడు విపక్షాల అసత్య ప్రచారాలను పక్కన పెట్టాలి. రాష్ట్ర భవిష్యత్తు కోసం ఈ సాంకేతిక విప్లవాన్ని స్వాగతించాలి.



# జలభద్రతకు చెరువుల బాగుసేత

**చెరువులు కేవలం నీటివనరులే కాదు... గ్రామీణ ఆర్థిక, సామాజిక, పర్యావరణ వ్యవస్థకు అవి జీవనాడులు. చెరువులు సాగు, తాగునీటిని అందించడమే కాకుండా, వరదలను నిరోధిస్తాయి. భూగర్భ జలాలు పెరగడానికి తోడ్పడతాయి. పట్టణాల్లో విపరీత ఉష్ణోగ్రతలనూ అవి కొద్దిమేర తగ్గిస్తాయి. ఇంతటి విస్తృత ప్రయోజనాలను అందించే చెరువులు దేశవ్యాప్తంగా ఆక్రమణల గుప్పిట చిక్కి నానాటికీ కుంచించుకుపోతున్నాయి. పూడికతీతకు నోచుకోక నిరుపయోగంగా మిగులుతున్నాయి. ఎడతెగని మురుగునీటి వెల్లువతో అవి కాలుష్య కాసారాలుగా మారిపోతున్నాయి. దానివల్ల చుట్టుపక్కల ప్రాంతాల్లో రకరకాల వ్యాధులు ప్రబలుతున్నాయి. ఇలాంటి దుర్భర పరిస్థితుల్లో జలభద్రత, వ్యవసాయ స్థిరీకరణ, గ్రామీణ జీవనోపాధులకు దన్నునిచ్చేలా చెరువులను పునరుద్ధరించాలన్న తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ సిఫార్సు అవశ్యం అనుసరణీయమైనది. చెరువులు కనుమరుగు కాకుండా**



**కాపాడుకోవాలంటే కమిషన్ సూచించినట్లు ప్రత్యేకంగా చిన్ననీటిపారుదల చట్టం తేవాల్సిన అవసరం ఉంది. అన్ని రాష్ట్రాలు ఈ మేరకు ప్రత్యేక చొరవ తీసుకుంటేనే చెరువులు కలకాలం స్వచ్ఛ జలకళతో విరాజిల్లుతాయి!**

కేంద్ర జలశక్తి శాఖ గణన ప్రకారం ఆసేతుహిమాచలం 24.24 లక్షల జలవనరులు ఉన్నాయి. వాటిలో దాదాపు పదహారుశాతం చెరువులే! మొత్తం నీటివనరుల్లో 97.1శాతానికి గ్రామీణ ప్రాంతాలే నెలవులు. కేంద్ర ప్రభుత్వ సమాచారం మేరకు ఏపీలో కుంటలు, చెరువులు, సరస్సులు, రిజర్వాయర్లు లాంటివన్నీ కలిపి 1.90 లక్షల దాకా లెక్కతేలుతున్నాయి. తెలంగాణలో వాటి సంఖ్య 64వేలు. దేశవ్యాప్తంగా 3.94 లక్షల జలవనరులు వినియోగంలో లేవు. ఏపీలో సుమారు 41వేలు, తెలంగాణలో 12వేలు అదే దుస్థితిలో కొట్టుమిట్టాడుతున్నాయి. వీటికితోడు వేలాది జలవనరులు కబ్జాల పాలయ్యాయి. హైదరాబాద్‌లోనే గడచిన కొన్నేళ్లలో వందలసంఖ్యలో చెరువులు కనుమరుగయ్యాయి. నాలాలూ బక్కచిక్కిపోవడంతో నగరంలో వరద ముప్పునకు గురయ్యే ప్రాంతాలు పాతికేళ్లలో దాదాపు రెట్టింపైనట్లు పరిశీలనలు చెబుతున్నాయి. ఖమ్మం, నల్గొండ, నిజామాబాద్, తిరుపతి, నెల్లూరు, విజయనగరం ఇలా చాలాచోట్ల చెరువులు అసలురూపు కోల్పోవడంతో లోతట్టు ప్రాంతాలు మునుగుతున్నాయి. భూగర్భ జలాలు అడుగంటుతున్నాయి. నీరులేక పంటలు ఎండుతున్నాయి. జలవనరుల ఆక్రమణలపై న్యాయస్థానాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నా అధికారగణంలో చలనం లేకపోవడం సామాజిక సంక్షోభానికి దారితీస్తోంది!

మిషన్ అమృత్ సరోవర్ పథకంలో భాగంగా నిరుడు మార్చి నాటికి గ్రామీణ భారతంలో దాదాపు 69వేల చెరువులను కొత్తగా నిర్మించడమో, పునరుద్ధరించడమో చేశారు. పీఎం కృషి సించాయీ యోజనలో భాగంగానూ ఇటువంటి పనులు చేపడుతున్నారు. అమృత్ 2.0 కింద పట్టణాల్లోనూ చెరువులను చక్కదిద్దుతున్నారు. అయితే, ఒకసారి పనులు చేపట్టి మిన్నకుండిపోకుండా ఏటా వర్షాకాలంలో చెరువుల్లోకి నీరు చేరుతోందో లేదో గమనిస్తుండాలి. వాటిలో మురుగునీరు, ప్రమాదకర రసాయనాలు ఎట్టిపరిస్థితుల్లో కలవకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. కాలానుగుణంగా పూడిక తీయడంతో పాటు శాటిలైట్ మ్యాపింగ్, జియో ఫెన్సింగ్ వంటి వాటి ద్వారా కబ్జాలను ఎప్పటికప్పుడు అరికట్టాలి. జలవనరుల ఆక్రమణదారులను సామాజిక శత్రువులుగా పరిగణించి ఉక్కుపాదం మోపాలి. ఈ మేరకు యంత్రాంగం చిత్తశుద్ధితో పాటుపడితేనే జనభారత జలభద్రతకు భరోసానిచ్చేలా చెరువులు నూతన జవసత్త్వాలను సంతరించుకుంటాయి!

# మెటాకు మరమ్మత్తు!

**సామాజిక మాధ్యమ టెక్ కంపెనీల్లో అగ్రభాగాన వున్న మెటా సంస్థ తనపై న్యాయ స్థానంలో దాఖలైన కేసుల్లో రాజీకొచ్చి 1,800 కోట్ల డాలర్లు చెల్లించటానికి అంగీకరించటం కీలకమైన పరిణామం. దీంతో గత నెల 18న ఓక్‌లాండ్ న్యాయస్థానంలో మొదలైన విచారణ అసంపూర్ణంగా నిలిచి పోయినట్టయింది. అదే జరిగుంటే మెటా చీఫ్ మార్క్ జూకర్‌బర్గ్ కోర్టు బోనెక్కి ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్‌లు పిల్లలకూ, టీనేజర్లకూ హాని కలిగించే విధానాలను అవలంబిస్తున్నట్టు వచ్చిన ఆరోపణలపై సంజాయిషీ ఇచ్చుకోవాల్సి వచ్చేది. న్యాయవాదులు ఒక్కో ఉదంతమే వివరించి, ఆ సంస్థలు పసిమనసుల్ని ఎంత కలుషితం చేశాయో సోదాహరణంగా వివరిస్తూ, నిలదీస్తుంటే ఆయనకు ముచ్చెమటలు పట్టేవి. అమెరికాలోని 48 రాష్ట్రాలు, కొలంబియా జిల్లా, మరో మూడు ప్రాంతాలూ ఈ వ్యాజ్యాలను దాఖలు చేశాయి. ఇంతవరకూ వచ్చిన తీర్పుల్ని చూస్తే కోర్టు వెలుపల కుదిరిన ఈ రాజీ ఒప్పందం పర్యవసానంగా మెటా**




**చెల్లించవలసిన మొత్తం చాలా పెద్దగానే కనబడుతుంది. భద్రత విషయంలో పక్కదోవపట్టించిన కేసులో న్యూమెక్సికో న్యాయస్థానం ఆదేశించిన 37.5 కోట్ల డాలర్ల పరిహారమే ఇంత వరకూ అతి పెద్ద మొత్తం.**

అయితే దాదాపు లక్షన్నర కోట్ల డాలర్ల మార్కెట్ విలువగల మెటా సంస్థ నిరుటి వార్షికాదాయం 20,097 కోట్ల డాలర్లతో పోలిస్తే ఇది చాలా తక్కువ. ఏటా ఈ ఆదాయం 24 శాతం వరకూ పెరుగుతోంది. ఇప్పుడు చెల్లించదల్చుకున్న మొత్తానికి కూడా బోలెడు మెలికలున్నాయి. వచ్చే పదేళ్లకాల వ్యవధిలో ఈ పరిహారం చెల్లిస్తుందట. ఈ వాయిదాలను 15 శాతం డిస్కౌంట్‌తో లెక్కిస్తే ప్రస్తుత విలువ ప్రకారం మెటా సంస్థపై పడే భారం 800 కోట్ల డాలర్లకన్నా తక్కువే ఉంటుందని ఒక ఆర్థిక రంగ నిపుణుడు లెక్కగట్టారు. అత్యధిక జరిమానాలు చెల్లించిన టాప్-20 కంపెనీల జాబితాలో కూడా మెటా ఉండకపోవచ్చన్నది ఆయన విశ్లేషణ. అన్నిటికన్నా వింతైన విషయం-మెటా చెల్లించాల్సిన పరిహారంలో 530 కోట్ల డాలర్ల మొత్తానికి ఉన్న మెలిక. తన ప్రత్యర్థి సంస్థలు టిక్‌టాక్, యూట్యూబ్‌లు సైతం తన మాదిరే టీనేజర్లు యాప్‌లో గడిపే సమ.యాన్ని పరిమితం చేసుకుంటేనే... అవి కూడా ఇంతే మొత్తాన్ని చెల్లిస్తేనే ఈ పరిహారం బాధ్యత నెరవేరుస్తానని చెప్పడం తోకే కుక్కను ఆడించిన చందంగా కనబడుతోంది.

మెటా సంస్థ మాజీ ఉద్యోగులూ, విజిల్‌బ్లోయర్‌లూ దానిపై చేసిన ఆరోపణలు చిన్నవేమీ కాదు. వీరు న్యాయస్థానాల్లోనూ, పార్లమెంటరీ కమిటీల ఎదుటా ఎన్నో అంశాలు ఏకరువు పెట్టారు. తన ఉత్పత్తుల్ని సురక్షితంగా మార్చటానికి అంతర్గతంగా అవకాశాలున్నా... వినియోగదారులు అధిక సమయం గడిపేలా చూసేందుకే సంస్థ ప్రాధాన్యమిచ్చిందని చెప్పారు. లాభార్జనే ముఖ్యమనుకున్నదని వివరించారు. ఇన్‌స్టాగ్రామ్ వల్ల టీనేజ్ బాలికలు తమ శరీరాకృతిపై తీవ్ర ఆందోళన చెందటం, అనోరెక్సియా(ఆకలి చంపుకోవటం) అనే తీవ్ర మానసిక రుగ్మత బారిన పడటం, మానసిక ఒత్తిళ్లకు లోనుకావటం వంటివి సంభవిస్తున్నాయని అంతర్గత సర్వేల్లో బయటపడినా వెల్లడి కానీయలేదన్నది వారి ఆరోపణ. అలాగే 13 యేళ్లలోపు పిల్లల డేటాను వారి తల్లిదండ్రుల అనుమతి లేకుండా సేకరించటమంటే... ఆన్‌లైన్ వేధింపులకూ, నేరగాళ్లు వలవేయటానికి తోడ్పడే వాతావరణంలోకి వారిని నెట్టడమేనని చెప్పారు. టీనేజర్లు ఏమేరకు హానికర విషయాల ప్రభావంలో పడ్డారన్న గణాంకాలను తగ్గించిచూపే ప్రయత్నాలు జరిగాయని సాక్ష్యాధారాలు సమర్పించారు. సంస్థ తీసుకునే భద్రతా చర్యలు అతి స్వల్పమని తెలిపారు. వీటిని ఎత్తిచూపిన సిబ్బందిపై వేధింపులకూ, బెదిరింపులకూ పాల్పడ్డారని కూడా చెప్పారు. ఇవన్నీ న్యాయస్థానంలో నిగ్గుదేలితే సామాజిక మాధ్యమాలు సక్రమంగా వ్యవహరించకతప్పని స్థితి ఏర్పడేది.

అయితే ఈ రాజీ ఒప్పందం పిల్లల ఆన్‌లైన్ భద్రతకు సంబంధించి సరైన చట్టం ఏర్పడని మనలాంటి దేశాలకు నమూనాగా ఉపయోగపడుతుంది. తగిన కట్టుదిట్టాలతో మెరుగైన చట్టం రూపొందించటానికి పనికొస్తుంది. ఇప్పుడు మెటా విషయంలో కుదిరిన ఒప్పందం సామాజిక మాధ్యమాల చరిత్రలో తొలి అడుగే. కాలక్రమంలో ఇది మరింత పదునుదేరితే వాటి ఆగడాలకు కాస్తయినా అడ్డుకట్ట పడుతుంది.

# హిమాలయ 'సునామీ'కి బాధ్యులెవరు?

నేపాల్‌ను విషాదసీమగా మార్చివేసిన మహా విపత్తు అది. హిమాలయ మంచుకొండల మీది హిమనీనదాలు కరిగిపోయాయి. నిటారుకొండలు తమ గర్వాన్ని వీడి కూలిపోయాయి. నదులు వరద జలాలతో పోటెత్తాయి. అనూహ్యమైన జలప్రళయమది. హిమాలయ ప్రాంతాల్లో సంభవించిన ఈ విపత్తు అసాధారణమైనది. విపత్తు దృశ్యాలు భయానకమైనవి. దశాబ్దానికి పైగా అంతర్జాతీయ వాతావరణ విధానంపై కృషి చేస్తున్న నేపాలీ పౌరుడిగా నేను ఈ విపత్తుకు తీవ్రంగా కలత చెందాను. ఆవేదనకు మించిన ఆగ్రహం నన్ను కుదిపివేసింది. ఇటువంటి ప్రళయం విరుచుకుపడవచ్చని శాస్త్రవేత్తలు అనేక సంవత్సరాలుగా హెచ్చరిస్తూనే ఉన్నారు. ప్రపంచ వాతావరణ కార్యాచరణలో జాప్యమే ఈ జల ప్రళయం, సందేహం లేదు. హరితగృహ వాయు ఉద్గారాలను తగ్గించి, భూ తాపాన్ని పరిమితం చేయడమే లక్ష్యంగా ఉన్న ప్రపంచ వాతావరణ కార్యాచరణ విషయంలో ప్రపంచ దేశాల ప్రభుత్వాలు చిత్తశుద్ధితో వ్యవహరిస్తే ఇటువంటి ప్రళయం జరిగేదేనా? ఆగస్టు 26న మంచు, నీరు, బండరాళ్లు, బురదతో కూడిన రాకాసివరద అశేష ప్రజలను కకావికలు చేసింది. లక్షలాది గృహాలను ధ్వంసం చేసింది, మార్కెట్లు, వంతెనలు, రోడ్లు రూపు లేకుండా పోయాయి. ఇటు నేపాల్‌లోను, అటు టిబెట్‌లోను విద్యుదుత్పాదన కేంద్రాలు కొట్టుకుపోయాయి. వందలాదిమంది మరణించగా, జాడలేకుండా పోయినవారు వేల సంఖ్యలో ఉన్నారు. అనూహ్య వేగంతో ఈ విధ్వంసం చోటుచేసుకున్నది. పర్వతాగ్రాలపై మొదలైన విపత్తు క్షణాల్లో దిగువ ప్రాంతాలకు వ్యాపించింది. ఈ విపత్తు ఒక వాస్తవాన్ని స్పష్టంగా ఎత్తిచూపింది: నేపాల్‌కు మరింత బలమైన ముందస్తు విపత్తు హెచ్చరిక వ్యవస్థలు, హిమనీనదాల, అస్థిర కొండవాలుల నిరంతర మెరుగైన పర్యవేక్షణ, నేపాల్, టిబెట్‌లో ఉమ్మడి జలవనరుల పరివాహక ప్రాంతాలు ఉన్నందున ఈ రెండు హిమాలయ ప్రాంతాల మధ్య సరిహద్దు సమాచార మార్పిడి, మరీ ముఖ్యంగా ప్రాకృతిక విపత్తుల సన్నద్ధతలో భారీ ఎత్తున నిధుల వినియోగం అత్యవసరం.

నేపాల్‌లో మెరుపు వరదలు ఒక మౌలిక వాస్తవాన్ని బహిర్గతం చేశాయి: సమస్య ముందస్తు హెచ్చరికల వ్యవస్థ లేకపోవడం కాదు; వాతావరణ సంక్షోభం సృష్టిస్తున్న ప్రమాదాలు ఊహింపదగిన విపత్తులకు భిన్నంగా ఉంటున్నాయి; ఫలితంగా హెచ్చరిక వ్యవస్థలు ఆ అనూహ్య అపాయాల సంభవాన్ని గ్రహించలేకపోతున్నాయి. హిమాలయ పర్వతాల పరివేష్టిత



భోటేకోశి నదీ తీరస్థ ప్రాంతాలను ముంచివేసిన వరదే అందుకొక ఉదాహరణ. బురద, కొండరాళ్లతో ఆకస్మికంగా విరుచుకుపడిన ఆ వరద నది ఎగువ ప్రాంతంలోని హైడ్రాలాజికల్ కేంద్రాలను, నీటి మట్టాల పెరుగుదలను కనిపెట్టి హెచ్చరికలను జారీ చేయక ముందే ధ్వంసం చేసింది. క్రమంగా పెరిగే నీటి మట్టాల పెరుగుదలను కనిపెట్టేందుకు ఆ హెచ్చరిక వ్యవస్థను రూపొందించారు. అయితే ఆగస్టు 26న సంభవించిన రాకాసి వరద ఆ హెచ్చరిక వ్యవస్థను ముందుగానే సమూలంగా ధ్వంసం చేసింది. ఇదెలా జరిగింది? శాస్త్రవేత్తల ప్రాథమిక అంచనా ప్రకారం, ఒక భారీ హిమనీనదం కూలిపోవడం కారణంగా ఇది సంభవించింది. పర్వతాల పై భాగంలో జరిగిన ఈ సంఘటన దిగువ ప్రాంతాలలో హింసాత్మక వరదకు దారితీసింది. ఈ క్రమం తీరుతెన్నులను కచ్చితంగా నిర్ధారించేందుకు ఇంకా అధ్యయనాలు జరుగుతున్నాయి. అంతిమంగా శాస్త్రవేత్తల వివరణ ఏమైనప్పటికీ వేడెక్కిన పర్వత ప్రాంతాలలో ప్రమాదాలు ఎంత త్వరితంగా మహావిపత్తులుగా పరిణమిస్తాయనేదానికి ఈ సంఘటనే తిరుగులేని నిదర్శనం. స్పష్టంగా చెప్పాలంటే విపత్తును పసిగట్టడానికి ఉద్దేశించిన సాధనాలే దానివల్ల పనిచేయకుండా పోయాయి. ఈ వ్యత్యాసం చాలా ముఖ్యమైనది. గతంలో సంభవించిన వరదలను బట్టి రూపొందించిన ముందస్తు హెచ్చరిక వ్యవస్థ భవిష్యత్తులో తీవ్రమైన విపత్తుల ముందు సరిపోనిదిగా మిగలవచ్చు. అంతమాత్రాన ముందస్తు హెచ్చరిక వ్యవస్థలు నిష్ప్రయోజనకరమని భావించనవసరం లేదు. అయితే వాటి పరిమితులను మనం గుర్తించాలి, అంగీకరించాలి.

వాతావరణ అనుసరణ (వాతావరణ మార్పు, దాని ప్రభావాలకు అనుగుణంగా నష్టాన్ని తగ్గించడానికి సర్దుబాటు చేసుకునే ప్రక్రియ)కూ పరిమితులున్నాయి. మౌలిక సదుపాయాలను పటిష్ఠపరచుకోవడం, విపత్తుల నెదుర్కొనే సంసిద్ధతను మెరుగుపరచుకోవడం, జీవనాధారాలకు రక్షణ కల్పించడం మొదలైన చర్యలతో అటువంటి సర్దుబాటుకు నేపాల్ చాలా సంవత్సరాలుగా చురుగ్గా ప్రయత్నిస్తున్నది. అయితే వాతావరణ సంక్షోభానికి చారిత్రకంగా బాధ్యత ఉన్న పారిశ్రామిక సంపన్న దేశాల నుంచి నేపాల్‌కు తగు ఆర్థిక సహాయం లభించనే లేదు. తీవ్రమవుతున్న వాతావరణ ప్రమాదాలను, వినాశనకర వరదలను ఎదుర్కోవడానికి నేపాల్‌కు అంతర్జాతీయ సహకారం అత్యవసరం. ఎందుకంటే హిమాలయ ప్రాంతాల్లో సంభవించే ప్రాకృతిక విపత్తులు జాతీయ సరిహద్దులకు ఆవల ఉద్భవిస్తాయి. కనుక సంబంధిత దేశాల మధ్య సహకారం, సకాలంలో సమాచార మార్పిడి ఉండి తీరాలి.

నేపాల్ ప్రాంతపు హిమాలయాలు వేగంగా మారుతున్నాయి. హిమనీనదాలు క్షీణిస్తున్నాయి. భూతాపం హిమాలయ ప్రాంతాల సుస్థిర పరిస్థితులను వేగంగా మార్చివేస్తోంది. ఈ సంక్షోభ పరిస్థితులు మరింత తీవ్రతరం కాకుండా నివారించడమే మొదటిపని కావాలి. దశాబ్దాలుగా శిలాజ ఇంధనాల ఆధారిత అభివృద్ధి నుంచి అత్యధికంగా ప్రయోజనం పొందిన పారిశ్రామిక సంపన్న దేశాలకు కాలుష్యకారక ఉద్గారాలను వేగంగా తగ్గించాల్సిన ప్రత్యేక బాధ్యత ఉంది. ఆ బాధ్యతను సమర్థంగా నిర్వహించేందుకు అవసరమైన ఆర్థిక వనరులు, సాంకేతికతలు ఆ దేశాలకు సమృద్ధిగా ఉన్నాయి. శిలాజ ఇంధనాల నుంచి పునరుత్పాదక ఇంధనాల వినియోగానికి వారు శీఘ్రగతిన పరివర్తన చెంది తీరాలి. అది ఆవశ్యక న్యాయబద్ధమైన మార్పు. అయితే సంపన్న దేశాలు ఈ మార్పు దిశగా ప్రస్థానించడం లేదన్నది ఒక కఠోర సత్యం.

ఈ పరిస్థితుల నుంచి నేపాల్ విధిగా ఒక పాఠాన్ని నేర్చుకోవాలి. వాతావరణ సంక్షోభానికి కారణమైన ఆర్థికాభివృద్ధి నమూనాను అనుకరించకూడదు. ఒక భిన్నమైన వ్యవస్థను నిర్మించుకునే అవకాశం తనకు ఉందనే వాస్తవాన్ని నేపాల్ గుర్తించాలి. అభివృద్ధి పేరిట సహజ వనరులను విచక్షణారహితంగా ఉపయోగించుకోవడాన్ని నిలిపివేయాలి. ప్రజల జీవనోపాధులకు, పర్యావరణ సమ తౌల్యతకు ప్రాధాన్యమిచ్చే ఆర్థిక వ్యవస్థను నిర్మించుకోవాలి. కాలుష్యకారక వాయువుల ఉద్గారాలలో నేపాల్ వాటా చారిత్రకంగా ఎప్పుడూ 0.1శాతం కంటే తక్కువగా ఉంటోంది. నేపాల్ తలసరి ఉద్గారాలు ప్రపంచంలోనే చాలా తక్కువ. అయినప్పటికీ తాను సృష్టించని, వాతావరణ సంక్షోభానికి ఆ దేశం అధిక మూల్యం చెల్లిస్తోంది. ఇది న్యాయవిరుద్ధం కాదూ? వాతావరణ మార్పుల ఫలితంగా అనివార్యమవుతున్న ఆర్థిక, ఆర్థికేతర నష్టాల నుంచి కోలుకునేందుకు నష్టపరిహార సహాయం అందించాలని నేపాల్, ఇతర అభివృద్ధి చెందుతున్న దేశాలు పదే పదే డిమాండ్ చేస్తున్నాయి. ఇటీవలి మహా విపత్తులో సంభవించిన అపార నష్టం నుంచి కోలుకునేందుకు విధిగా పెద్ద ఎత్తున రుణాలు తీసుకోవల్సిన పరిస్థితిని నేపాల్‌కు కల్పించకూడదు. ఇది సంపన్న దేశాల నైతిక బాధ్యత. ఇప్పటికే అందిస్తున్న అధికారిక అభివృద్ధి సహాయానికి అదనంగా నష్ట పరిహార ఆర్థిక సహాయాన్ని అందించాలి. ఈ అదనపు సహాయాన్ని సులభ షరతులపై ఉదారపూర్వకంగా అందించాలి. సంపన్న దేశాలు ప్రస్తుతం తాము ఉపయోగించుకుంటున్న శిలాజ ఇంధనాల పరిమాణాన్ని యథావిధిగా కొనసాగించిన పక్షంలో, నేపాల్ మొదలైన అభివృద్ధి చెందుతున్న దేశాలకు అవి ఎంత అధిక మొత్తంలో నష్టపరిహార సహాయం అందించినా ప్రయోజనం ఉండదు.

భోటేకోశి నదీ తీరస్థ ప్రాంతాల ప్రజలు హిమాలయాలు వేడెక్కడాన్ని కోరుకోలేదు. మంచు పర్వతాలు వేడెక్కడానికి కారణమైన శిలాజ ఇంధన ఆర్థిక వ్యవస్థను కూడా వారు ఎంచుకోలేదు. తగినంత ఆర్థిక, సాంకేతికత మద్దతు లభిస్తే పరిస్థితులకు అనుగుణంగా మారి తమ భవిష్యత్తును పదిలం చేసుకోగలరు. హిమనీనదాలు కరగడాన్ని నివారించలేకపోయినప్పటికీ అంతర్జాతీయ ఆర్థిక సహకారం, అధునాతన సాంకేతికతల తోడ్పాటుతో వాతావరణ విపత్తులను ముందుగానే పసిగట్టి, వాటి నుంచి సురక్షితంగా లేదా సాధ్యమైనంత తక్కువ నష్టంతో బయటపడగలరు. నష్టపరిహార సహాయం అనేది దాతృత్వం కాదు. తాము చేయని అపరాధానికి భారీగా నష్టపోయిన ప్రజల శ్రేయస్సు పట్ల తమ బాధ్యతగా ఆ సహాయాన్ని పారిశ్రామిక సంపన్న దేశాలు అందించాలి.

# రోడ్డు పక్కన మట్టితోలండి....

**ఆర్ అండ్ బి అధికారులకు విన్నపం**

**యల్లనూరు, సెప్టెంబర్ 05,**

**అనంత జనశక్తి న్యూస్;**



శనిగలగూడూరు నుంచి యల్లనూరుకు వచ్చే ఆర్.అండ్.బీ రోడ్డుకి ఇరువైపులా పెద్ద పెద్ద బూతులు ఏర్పడ్డాయని వాటికి మట్టిని తోలాలంటూ మండల స్థాయి అధికారులు శనివారం ఆర్ అండ్ బి అధికారులకు విన్నవించారు. శనివారం ఎంపీపీ గంగాదేవి అధ్యక్షతన మండల సర్వసభ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో మండలంలోని ప్రజా సమస్యల పై చర్చించాల్సి ఉంటుంది. అయితే ఈ సమావేశానికి ప్రజాప్రతినిధులు ఎవరు హాజరు కాకపోవడంతో అధికారులే రోడ్డు దుస్థితిపై వారు పడుతున్న సమస్యలను విన్నవించుకోవడం విశేషం.

# విద్యార్థుల కష్టాలు తీర్చేందుకే విద్యాచక్రం

**- 7,300 సైకిళ్ల పంపిణీకి రూ.5 కోట్లు ఖర్చు: ఎమ్మెల్యే అమిలినేని**

**కళ్యాణదుర్గం, సెప్టెంబర్ 5:అనంత జనశక్తి న్యూస్**




విద్యార్థులు పుస్తకాల బ్యాగులు మోసుకుంటూ కిలోమీటర్ల కొద్దీ నడిచి పాఠశాలలకు వెళ్తున్న దృశ్యాలను చూసి చలించిపోయానని, వారి కష్టాలను తీర్చేందుకే ప్రేమతో సైకిళ్లు అందిస్తున్నామని కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు అన్నారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఒంటిమిద్ది గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు 'అమిలినేని విద్యాచక్రం' పథకం ద్వారా ఉచిత సైకిళ్లను ఆయన పంపిణీ చేశారు.ఎస్సార్సీ సంస్థ సహకారంతో సుమారు రూ.5 కోట్ల వ్యయంతో కళ్యాణదుర్గం నియోజకవర్గంలోని 9, 10 తరగతులు, ఇంటర్మీడియట్ చదువుతున్న విద్యార్థులకు 7,300 సైకిళ్లు అందిస్తున్నామని ఎమ్మెల్యే తెలిపారు. ఈ సైకిళ్ల పంపిణీ వెనుక ఎస్సార్సీ సంస్థతో పాటు అందులో పనిచేస్తున్న సుమారు 7,000 మంది కృషి ఉందన్నారు.ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్‌కు ఎమ్మెల్యే ఘన నివాళులు అర్పించారు. విద్యార్థులు కష్టపడి చదివి డీఎస్సీలో ఉద్యోగాలు సాధిస్తే వారిని అవమానించడం సరికాదన్నారు. గతంలో 'అమ్మఒడి' పేరుతో కొంతమందికే సహాయం అందించారని, కూటమి ప్రభుత్వం మాత్రం చదువుతున్న ప్రతి విద్యార్థి కుటుంబానికి 'తల్లికి వందనం' ద్వారా అండగా నిలుస్తోందన్నారు.

**రైతుల సమస్యలపై వెంటనే స్పందన**

హానిమిరెడ్డిపల్లి వద్ద తక్కువ వోల్టేజీ సమస్యపై రైతులు చేస్తున్న ఆందోళనను చూసి అక్కడికి వెళ్లి వారి సమస్యలను తెలుసుకున్నానని ఎమ్మెల్యే తెలిపారు. అక్కడ ప్రతిపక్షానికి చెందిన నాయకులు కూడా రైతులతో కలిసి ధర్నాలో ఉన్నప్పటికీ, రాజకీయాలకు అతీతంగా రైతుల సమస్య పరిష్కారమే లక్ష్యంగా విద్యుత్ అధికారులతో మాట్లాడి వారంలో సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చినట్లు చెప్పారు. దీనిపై రాష్ట్రవ్యాప్తంగా అభినందనలు రావడం సంతోషంగా ఉందన్నారు.గత ప్రభుత్వ హయాంలో పలు విద్యుత్ ఉపకేంద్రాల నిర్మాణం పూర్తికాకపోవడంతోనే కొన్ని ప్రాంతాల్లో తక్కువ వోల్టేజీ సమస్యలు తలెత్తుతున్నాయని, వాటి నిర్మాణానికి ఇప్పటికే ప్రణాళికలు సిద్ధం చేశామని చెప్పారు.

**ప్రతి ఇంటికీ కుళాయి**

రూ.179 కోట్లతో ఇంటింటికీ కుళాయి పథకాన్ని ప్రారంభించామని, ప్రతి ఇంటికీ కుళాయి ఏర్పాటు చేసి తాగునీటిని అందిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. మహిళలు నీటి కోసం ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. బీటీపీ ప్రాజెక్టును పూర్తి చేసి కళ్యాణదుర్గం ప్రాంతాన్ని సస్యశ్యామలం చేస్తామని అన్నారు. 2028 నాటికి ప్రాజెక్టును పూర్తి చేసే లక్ష్యంతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సాగునీటి ప్రణాళికను రూపొందించారని, బీటీపీకి నీళ్లు అందించే భగీరథుడిగా ముఖ్యమంత్రి నిలుస్తారని పేర్కొన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ సహకారంతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్ రాష్ట్ర అభివృద్ధికి బాటలు వేస్తున్నారని ఎమ్మెల్యే తెలిపారు. పరిశ్రమలు తీసుకువచ్చి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. నియోజకవర్గంలో సుమారు 3 వేల కిలోమీటర్ల మేర రహదారుల అవసరం ఉందని, వాటిని దశలవారీగా మంజూరు చేయిస్తున్నామని, అన్ని రహదారుల నిర్మాణానికి సుమారు ఎనిమిదేళ్ల సమయం పట్టే అవకాశం ఉందన్నారు.పాఠశాలలు దేవాలయాలతో సమానమని, అలాంటి పవిత్ర ప్రదేశాల్లో అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే హెచ్చరించారు. కార్యక్రమంలో విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు, టీడీపీ నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# మైనార్టీలతో మమేకం



**- సమస్యల పరిష్కారానికి చిలకం చొరవ....**

**ధర్మవరం సెప్టెంబర్ 5 అనంత జనశక్తి న్యూస్ :**

ధర్మవరం ప్రజా సమస్యలను క్షేత్రస్థాయిలో తెలుసుకుని పరిష్కరించడమే లక్ష్యంగా జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్ రెడ్డి ధర్మవరం పట్టణంలోని 28వ వార్డులో పర్యటించారు. ముస్లిం మైనార్టీల ఆహ్వానం మేరకు నవగ్రహాల భూమి పూజ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన.. అనంతరం మసీదులోని చిన్నచిన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మాటలకే పరిమితం కాకుండా.. సమస్య ఉన్న చోటకే వెళ్లి తెలుసుకోవడం అనే విధంగా వార్డులో పర్యటిస్తూ స్థానిక ప్రజలను కలుసుకున్నారు. ఒక్కొక్కరిని ఆప్యాయంగా పలకరిస్తూ వారి సమస్యలను నేరుగా అడిగి తెలుసుకున్నారు.

నీటి సమస్యపై తక్షణ స్పందన....

వార్డులో ప్రధానంగా నీటి సరఫరా సక్రమంగా జరగడం లేదని స్థానికులు చిలకం మధుసూదన్ రెడ్డి దృష్టికి తీసుకువచ్చారు. సమస్యను విన్న ఆయన వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడి నీటి సరఫరా సమస్యను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

మసీదు స్థలంలో విద్యుత్ స్తంభం.. పరిష్కారానికి చొరవ...

అదేవిధంగా మసీదు స్థలంలో అడ్డుగా ఉన్న విద్యుత్ స్తంభం సమస్యను కూడా ఆయన గుర్తించారు. దీనిపై విద్యుత్ శాఖ ఏఈ నాగభూషణ్‌తో మాట్లాడి, ప్రజలకు ఇబ్బంది కలగకుండా స్తంభాన్ని కొంత పక్కకు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

చేనేత కార్మికుల సమస్యలపై ఆరా.....

వార్డులోని చేనేత కార్మికులను కూడా చిలకం కలుసుకుని వారి ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. చేనేత రంగంపై ఆధారపడి జీవిస్తున్న కార్మికుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంతో పాటు, వారి ఇబ్బందులను త్వరలోనే పరిష్కరించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ప్రజల మధ్యకు వెళ్లి సమస్యలను తెలుసుకోవడం.. సాధ్యమైనంత వరకు అక్కడికక్కడే పరిష్కార మార్గాలను చూపించడం ద్వారా చిలకం మధుసూదన్ రెడ్డి తన పర్యటనలో ప్రజలతో మమేకమయ్యారు.

# దేశ భవిష్యత్తు తరగతి గదుల్లోనే నిర్మితమవుతుంది

**- రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్**

**- రాజమహేంద్రవరంలోని ఆనం కళాకేంద్రంలో నిర్వహించిన ఉపాధ్యాయ దినోత్సవ వేడుకల్లో ముఖ్య అతిథిగా పాల్గొన్న మంత్రికందుల దుర్గేష్**

**రాజమహేంద్రవరం సెప్టెంబర్ 05,**

**అనంత జనశక్తి న్యూస్**

విద్యా వ్యవస్థ పురోగతిలో ప్రభుత్వం, ఉపాధ్యాయులతో పాటు తల్లిదండ్రులు, సమాజం భాగస్వాములు కావాలని మంత్రి కందుల దుర్గేష్ పిలుపునిచ్చారు. రాజమహేంద్రవరంలోని ఆనం కళాకేంద్రంలో శనివారం నిర్వహించిన ఉపాధ్యాయ దినోత్సవ వేడుకల్లో రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా భారత మాజీ రాష్ట్రపతి, తత్వవేత్త డా. సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. జిల్లాలోని ఉపాధ్యాయులందరికీ ఈ సందర్భంగా మంత్రి దుర్గేష్ శుభాకాంక్షలు తెలిపారు.అనంతరం మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ... డా. సర్వేపల్లి రాధాకృష్ణన్ ఉపాధ్యాయుడిగా తన ప్రస్థానాన్ని రాజమహేంద్రవరం ఆర్ట్స్ కళాశాల నుంచే ప్రారంభించారని, అటువంటి చారిత్రక నగరిలో ఈ వేడుకలు జరుపుకోవడం ఎంతో సముచితమని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం 1వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ విద్యార్థుల వరకు ఉచిత యూనిఫారాలు, నాణ్యమైన మధ్యాహ్న భోజనాన్ని అందిస్తోందన్నారు. గతంలో మౌలిక సదుపాయాల లేమి వల్లే పాఠశాలల్లో డ్రాపౌట్లు పెరిగాయని, ఈ సమస్య పరిష్కారానికి ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తూ పూర్తిస్థాయిలో టాయిలెట్లు, మరుగుదొడ్ల నిర్మాణం చేపడుతోందన్నారు. ఇటీవల నిడదవోలు నియోజకవర్గంలో నెస్లే కంపెనీ సహకారంతో సీఎస్ఆర్ నిధులతో బయో టాయిలెట్లు నిర్మించామని, దీనివల్ల హాజరు శాతం గణనీయంగా పెరిగిందని వెల్లడించారు. కుటుంబంలో ఎంతమంది పిల్లలు ఉంటే అంతమందికి 'తల్లికి వందనం' పథకం కింద ఏటా రూ. 15,000 ఆర్థిక సాయం అందిస్తున్నామన్నారు. అంతేగాక స్టూడెంట్ కిట్స్, మధ్యాహ్న భోజనం వంటి కార్యక్రమాల అమల్లో తూర్పుగోదావరి జిల్లా అగ్రస్థానంలో ఉందన్నారు. విద్యాశాఖలో విప్లవాత్మక మార్పులు తీసుకొస్తున్న విద్యాశాఖ మంత్రి శ్రీ నారా లోకేష్‌కు, రాష్ట్ర ప్రభుత్వానికి మంత్రి ధన్యవాదాలు తెలిపారు."దేశ భవిష్యత్తు తరగతి గదుల్లోనే నిర్మితమవుతుంది" అన్న మాజీ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ మాటలను గుర్తుచేస్తూ, విద్యార్థి సంపూర్ణ వ్యక్తిత్వ వికాసం తరగతి గదిలోనే ప్రారంభమవుతుందన్నారు.విద్యారంగ అభివృద్ధికి ప్రభుత్వం తరపున అవసరమైన సహకారం పూర్తిస్థాయిలో అందిస్తామని మంత్రి దుర్గేష్ హామీ ఇచ్చారు.కార్యక్రమం చివరలో సమాజ నిర్మాణంలో కీలక పాత్ర పోషిస్తున్న పలువురు ఉత్తమ ఉపాధ్యాయులను మంత్రి కందుల దుర్గేష్ ఘనంగా సత్కరించారు.



# ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు



**- గురువు సేవలు వెలకట్టలేనివి..**

**- విద్యార్థులకు కరస్పాండెంట్ నిర్మలా జయచంద్రారెడ్డి సందేశం....**

**ధర్మవరం సెప్టెంబర్ 5 అనంత జనశక్తి న్యూస్ :**

ధర్మవరం పట్టణంలోని కాకతీయ విద్యానికేతన్‌లో శుక్రవారం ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ శెట్టిపి నిర్మలా జయచంద్రారెడ్డి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 5న డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని ఉపాధ్యాయ దినోత్సవంగా నిర్వహించుకుంటామని ఆమె విద్యార్థులకు వివరించారు. దేశానికి ఆయన అందించిన విశిష్ట సేవలు, విద్యారంగానికి చేసిన కృషిని ఈ సందర్భంగా గుర్తుచేశారు. "మన జీవితంలో గురువుకు ఉన్న స్థానం ఎంతో గొప్పది. విద్యార్థులను జ్ఞానవంతులుగా, ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడంలో గురువుల కృషి వెలకట్టలేనిది" అని ఆమె పేర్కొన్నారు. సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని తెలిపారు. అనంతరం ఉపాధ్యాయులు, విద్యార్థులు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ సేవలను స్మరించుకున్నారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు సూర్యప్రకాష్ రెడ్డి, పద్మ, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయినులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయులకు అసలైన గౌరవం తీసుకొచ్చిన వ్యక్తి.. మంత్రి నారా లోకేషే



**- గురుపూజోత్సవం సందర్భంగా ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్**

**- ఆర్ట్స్ కళాశాలలో ఘనంగా గురుపూజోత్సవ కార్యక్రమం**

**- కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే దగ్గుపాటి, ఎంపీ అంబికా, ఎమ్మెల్సీ రాంభూపాల్ రెడ్డి, జిల్లా కలెక్టర్ ఆనంద్**

**- 67మంది ఉత్తమ గురువులకు సన్మానం చేసిన ఎమ్మెల్యే, ఎంపీ, కలెక్టర్**

**- ఉపాధ్యాయులను అవమానించిన చరిత్ర జగన్ ది..ఎమ్మెల్యే దగ్గుపాటి**

**అనంతపురం సెప్టెంబర్ 05, అనంత జనశక్తి న్యూస్**

గత ఐదేళ్లలో ఉపాధ్యాయులు అవమానాలకు గురైతే.. వారికి తిరిగి గౌరవాన్ని, గుర్తింపును తెచ్చింది.. మంత్రి నారా లోకేష్ అని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అన్నారు. అనంతపురం ఆర్ట్స్ కళాశాలలో జరిగిన గురుపూజోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్, ఎమ్మెల్సీ రాంభూపాల్ రెడ్డి, ఆర్టీసీ రీజినల్ ఛైర్మన్ పూల నాగరాజు, ఎస్సీ కమిషన్ మెంబర్ వెంకటప్ప, లేబర్ కమిషన్ ఛైర్మన్ రమేష్‌నాయుడు, ఆర్జేడీ, డీఈఓ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ముందుగా విద్యార్థులు, ఉపాధ్యాయులు ఎమ్మెల్యే, ఎంపీకి ఘన స్వాగతం పలికారు. అనంతరం వారు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం 67మంది ఉపాధ్యాయులకు సన్మానం చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ మాట్లాడుతూ సర్వేపల్లి రాధాకృష్ణ ఉపాధ్యాయుడిగా పని చేసిన చరిత్ర ఆర్ట్స్ కళాశాలకు ఉందన్నారు. అలాంటి చోట గురుపూజోత్సవంలో పాల్గొనడం తన అదృష్టంగా భావిస్తున్నట్టు తెలిపారు. ఉపాధ్యాయులంటేనే సమాజంలో ఒక గౌరవం——అంటే అమ్మా నాన్నల తర్వాత ఒక గౌరవం తీసుకొచ్చే వ్యక్తి అని పేర్కొన్నారు. ఐఏఎస్ గానీ, ఒక చిన్న స్టూడెంట్ గానీ, సుప్రీంకోర్టు జడ్జి గానీ, పొలిటీషియన్ గానీ ఎవరైనా ఉపాధ్యాయుడి శిష్యుడేనన్నారు. గత ప్రభుత్వంలో టీచర్స్ కంటే గౌరవం ఉండేది కాదని.. మద్యం షాపుల ముందు, అలాగే బాత్రూమ్‌ల ముందు నిలబెట్టించి, ఫోటోలు కొట్టి పంపించిన రోజులు ఎవరూ మర్చిపోలేరన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ ఉపాధ్యాయులకు ఒక గుర్తింపు తీసుకొచ్చారన్నారు. విద్యా వ్యవస్థను బలోపేతం చేశారన్నారు. ఉపాధ్యాయులకు సముచిత స్థానం ఇచ్చారన్నారు. టీచర్స్ కి, స్టూడెంట్ కి ఒక అనుసంధానంగా, పేరెంట్స్ కి ఒక అనుసంధానంగా మెగా పిటిఎంలు నిర్వహిస్తున్నారన్నారు.

మెగా డీఎస్సీ ద్వారా 16,347 ఉద్యోగాలు కేవలం 148 రోజుల్లోనే భర్తీ చేస్తే.. వైసీపీ నాయకులు మాత్రం వారిని అవమానించేలా మాట్లాడుతున్నారన్నారు. వారిని రోడ్డెక్కేలా చేశారన్నారు. గతంలో మధ్యాహ్న భోజనం పాఠశాలల్లోనే ఉండేదని.. కానీ ఇప్పుడు ఇంటర్మీడియట్ విద్యార్థులకు కూడా సన్న బియ్యంతో మధ్యాహ్న భోజనం పెడుతున్నారన్నారు. మంత్రి నారా లోకేష్ ప్రోత్సాహంతో ఉపాధ్యాయులు గత ఏడాది కాలంలో బాగా పని చేసిన కారణంగా.. ఒక్క అనంతపురం జిల్లాలోనే దాదాపు 4వేల మంది ప్రైవేటు విద్యాసంస్థల నుంచి ప్రభుత్వ బడుల్లో చేరారన్నారు. అనంతపురం అర్బన్ నియోజకవర్గంలో గత 30 ఏళ్ల నుంచి కొన్ని పాఠశాలలు కేవలం 7వ తరగతి వరకే ఉండేవని.. అలాంటి స్కూల్స్ ని మంత్రి నారా లోకేష్ సహకారంతో అప్‌గ్రేడ్ చేశామని.. దాని వలన దాదాపు 84 ఉపాధ్యాయులు అదనంగా వచ్చారని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ తెలిపారు.

# సర్వేపల్లి విద్యార్థులకు ఆదర్శం.

**- ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల నందు ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు.**

**ధర్మవరం సెప్టెంబర్ 5, అనంత జనశక్తి న్యూస్:**

సత్య సాయి జిల్లా ధర్మవరం నందు గల ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ వై. ప్రశాంతి ఆధ్వర్యంలో కన్నుల పండుగగా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను వైభవంగా నిర్వహించారు .నేటి సమాజంలో ఉపాధ్యాయుని యొక్క పాత్ర , విద్యార్థులను తీర్చిదిద్దడంలో మన కళాశాల అధ్యాపకులు చేస్తున్న కృషిని కొనియాడారు.డా,, సర్వేపల్లి రాధాకృష్ణ యొక్క జీవిత విశేషాలను అధ్యాపకులు విద్యార్థులకు వివరించారు . కళాశాల విద్యార్థులు ఉత్సాహంగా కళాశాల ప్రిన్సిపాల్ ఆధ్వర్యంలో అధ్యాపకులను ఘనంగా సన్మానించుకున్నారు. ఈ కార్యక్రమం ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ పి. జస్వంత్ కుమార్ సమక్షంలో నిర్వహించడం జరిగింది. కార్యక్రమంలో అధ్యాపకులు కళాశాల సిబ్బంది పాల్గొనడం జరిగింది.



# పల్లేపల్లెకు కేతిరెడ్డి సాయి....

**- పార్టీలకు అతీతంగా స్వాగతం పలికిన పల్లెవాసులు**

**యల్లనూరు, సెప్టెంబర్ 05,అనంత జనశక్తి న్యూస్ ;**

మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి తనయుడు కేతిరెడ్డి సాయి ప్రతాప్ రెడ్డి మండలంలోని పలు గ్రామాలలో శనివారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లోని కేతిరెడ్డి కుటుంబీకుల అభిమానులు, శ్రేయోభిలాషులు, కార్యకర్తలు భారీ ఎత్తున ఆయనకు స్వాగతం పలికారు. ఆయా గ్రామాలలో కేతిరెడ్డి కుటుంబంతో పరిచయం ఉన్న ప్రతి వ్యక్తి పార్టీలకు అతితంగా సాయి ప్రతాపరెడ్డిని ఇంటికి పిలిచి స్వాగతం పలికారు. మండలంలోని కల్లూరు, దుగ్గపల్లి, వెంకటాంపల్లి, మల్లా గుండ్ల తో పాటు పలు గ్రామాల్లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా సాయి ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ మండల వ్యాప్తంగా ప్రతి ఊరిలో ప్రతి వీధిలో తమ కుటుంబానికి ఎంతో ఆత్మీయత ఉందని, నాన్న కేతిరెడ్డి పెద్దారెడ్డి తాడిపత్రి ఎమ్మెల్యే అయిన తర్వాత ఈ పల్లెలప వైపు చూడలేకపోయారని ఇక భవిష్యత్తులో మా కుటుంబ ఆత్మీయులకు అందుబాటులో ఉంటూ వారి సాధక బాధల్లో భాగస్వామిగా ఉండాలన్న ఉద్దేశంతో తాను పల్లె పల్లెకు ఆత్మీయుల పలకరింపు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. అయితే తన కుటుంబం పై ఇంతటి ప్రేమాప్యయతలు చూపిస్తున్న ప్రతి ఒకరికి రుణపడి ఉంటామన్నారు.



## జూటూరు రమణయ్య ను పరామర్శించిన చిలకం మధుసూదన్ రెడ్డి



**ధర్మవరం సెప్టెంబర్ 5, అనంత జనశక్తి న్యూస్:**

పట్టణంలోని శివానగర్‌కు చెందిన జనసేన పార్టీ నాయకులు జూటూరు వెంకటేష్ తండ్రి, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు జూటూరు రమణయ్య కొద్దికాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకున్న జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలక మధుసూదన్ రెడ్డి వారి స్వగృహానికి వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా రమణయ్య ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

## సీఎం చంద్రబాబు నేతృత్వంలో ప్రజలకు మెరుగైన పాలన



- **సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రజా గ్రీవెన్స్**
- **ప్రజల నుంచి అర్జీలు స్వీకరించిన పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి**

**పుట్టపర్తి సెప్టెంబర్ 05, అనంత జనశక్తి న్యూస్**

ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ప్రజలకు మెరుగైన పాలన అందిస్తూ, ప్రజా సమస్యల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని పుట్టపర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే శ్రీమతి పల్లె సింధూర రెడ్డి అన్నారు.అనంతపురంలోని పుట్టపర్తి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం నిర్వహించిన ప్రజా గ్రీవెన్స్ కార్యక్రమంలో ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి ప్రజల నుంచి వివిధ సమస్యలకు సంబంధించిన అర్జీలను స్వీకరించారు. నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని, వాటికి పరిష్కారం చూపించడమే ప్రజా గ్రీవెన్స్ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమన్నారు. ప్రజలు తమ సమస్యలను స్వేచ్ఛగా తన దృష్టికి తీసుకురావచ్చని, అర్హత ఉన్న ప్రతి సమస్యను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు. ప్రజలకు అందుబాటులో ఉండే పాలనను అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేస్తున్నారని ఎమ్మెల్యే పేర్కొన్నారు.ప్రజల నుంచి అందిన ప్రతి అర్జీని పరిశీలించి, సంబంధిత శాఖల అధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, సంక్షేమ పథకాలు, ప్రభుత్వ సేవలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా కృషి చేస్తామని పల్లె సింధూర రెడ్డి తెలిపారు.

## గురువు పేరున అన్నదానం



**రాయదుర్గం, సెప్టెంబర్ 5, అనంతజనశక్తి న్యూస్**

ఉపాధ్యాయ దినోత్సవ సందర్భంగా రాష్ట్ర బిజెపి ఉపాధ్యక్షులు, మాజీ శాసనసభ్యులు, రాష్ట్ర ఓబీసీ మోర్చా ఇంచార్జ్ కాపు రామచంద్రారెడ్డి తన చిన్ననాటి గురువు పేరున శాంతినగర్ లోని జమ్మి చెట్టు వద్ద అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.శనివారం పట్టణంలో ని శాంతి నగర్ లో గల హిందూ స్మశానవాటికయందు తన చిన్ననాటి గురువైన పక్కీరప్ప సమాధి వద్దకు వెళ్లి పూలతో అలంకరించి ఘన నివాళులర్పించారు. నివాళులు అర్పించిన వారిలో అనంతపురం జిల్లా ఉపాధ్యక్షులు శ్రీ బోయ వన్నూరు స్వామి, రాయదుర్గం రూరల్ మండల అధ్యక్షులు శ్రీ నాగరాజు, మాజీ జిల్లా ఉపాధ్యక్షులు శ్రీ రాళ్ల తిమ్మారెడ్డి,మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ శ్రీ శ్రీనివాస్ యాదవ్, మాజీ కౌన్సిలర్లు శ్రీ వన్నూరప్ప, శ్రీ డిష్ గోవింద్,మాజీ కౌన్సిలర్ షబ్బీర్,శ్రీ బోర్వెల్ నాగిరెడ్డి, డాక్టర్ మల్లికార్జున, డాక్టర్ శివరుద్ర,డాక్టర్ బద్రీనాథ్,శ్రీ ఏటూరి మహేష్,శ్రీ జకాతి కృష్ణ , శ్రీ కసందుల కుమార్ , వాల్మీకి పవన్ , శ్రీనివాస్ , శ్రీ బుజ్జి, తిప్పయ్య స్వామి, మల్లాపురం సత్తిరెడ్డి, దుర్గప్ప తదితరులు ఉన్నారు.

## ప్రభుత్వానికి తనీఖీ చేసిన జిల్లా వైద్యాధికారి

**యాడికి, సెప్టెంబర్ 5, అనంత జనశక్తి న్యూస్ :**

మండల కేంద్రంలో ఉన్న ప్రభుత్వాసుపత్రి ని శనివారం జిల్లా వైద్య అధికారి వెంకటేశ్వర్లు తనిఖీ చేశారు.యాడికి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆయుష్మాన్ భారత్ హెల్త్ అకౌంట్ కార్యక్రమం ద్వారా ఎలక్ట్రానిక్ హెల్త్ రికార్డ్స్ అమలు పైలట్ ప్రాజెక్టు గురించి వైద్యాధికారులు పరమేశ్వర్ ,సాయి సుమంత్ రెడ్డిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పౌరుల నమోదు, వైద్య చరిత్రను నమోదు చేసి, దీర్ఘకాలిక సమస్యలను ఎలక్ట్రానిక్ ఆరోగ్య రికార్డుల ను పరిశీలించారు. పైలట్ ప్రాజెక్టు పురోగతిని , ప్రాథమిక స్థాయిలో డిజిటల్ ఆరోగ్య సేవల అమలును మరింత బలోపేతం చేసే అంశాలపై చర్చించారు. వార్డులో ఉన్న బాలింతను కలిసి తనకు అందుతున్న వైద్య సేవలు గురించి ఆరా తీశారు. ల్యాబ్లో రికార్డును ,మందులు రికార్డ్ లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ మనోజ్ కుమార్, ఇంచార్జ్ జిల్లా మలేరియా అధికారి అనంతపూర్, డాక్టర్ పరమేశ్వర్, డాక్టర్ సాయి సుమంత్ రెడ్డి , సిబ్బంది పాల్గొన్నారు.




# ప్రభుత్వ పాఠశాలల్లో ఘనంగా గురుపూజోత్సవం

- **పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యే లక్ష్యం: మంత్రి నారాయణ**
- **మంత్రి కల్పించిన అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థాయికి ఎదగాలి: ఎంపీ వేమిరెడ్డి**

**నెల్లూరు సెప్టెంబర్ 05,అనంత జనశక్తి న్యూస్**



నెల్లూరు సిటీ నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల్లో గురుపూజోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. డీఎస్ఆర్, ఆర్ఎస్ఆర్ హైస్కూళ్లలో జరిగిన కార్యక్రమాల్లో రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ,ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి,రాష్ట్ర వక్ఫ్‌బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉత్తమ సేవలు అందిస్తున్న ఉపాధ్యాయులను మంత్రి, ఎంపీ ఘనంగా సన్మానించి సత్కరించారు.మంత్రి నారాయణ, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిలపై పూలవర్షం కురిపించిన విద్యార్థులు ఘన స్వాగతం పలికి కృతజ్ఞతలు తెలిపారు. పాఠశాలల్లో కల్పిస్తున్న ఆధునిక సౌకర్యాలను పరిశీలించిన నేతలు విద్యార్థులతో ముచ్చటించి వారి విద్యాభ్యాసం, లక్ష్యాలను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ చిన్నస్థాయి నుంచి ఎదిగి ఉపాధ్యాయుడిగా సేవలందించి,రాష్ట్రపతి స్థాయికి ఎదిగిన డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ అందరికీ ఆదర్శనీయులని అన్నారు. ఆయన జన్మదినాన్ని పురస్కరించుకుని ప్రతి ఏడాది సెప్టెంబర్ 5న గురుపూజోత్సవాన్ని నిర్వహించుకుంటున్నామని తెలిపారు.విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను గుర్తించి, వారిని ప్రోత్సహించి ఉన్నత శిఖరాలకు చేర్చాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు.ఒక మంచి ఉపాధ్యాయుడు ఒక విద్యార్థి భవిష్యత్తునే కాదు ఒక కుటుంబ భవిష్యత్తును కూడా మార్చగలడని పేర్కొన్నారు.విద్యారంగంలో యువనేత నారా లోకేష్ విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుడుతున్నారని తెలిపారు. అందుకు అనుగుణంగా డీఎస్ఆర్,ఆర్ఎస్ఆర్ పాఠశాలలను అన్ని హంగులతో ఆధునీకరించామని చెప్పారు.నెల్లూరు సిటీలోని అన్ని ప్రభుత్వ హైస్కూళ్లను దశలవారీగా ఆధునీకరిస్తున్నామని వెల్లడించారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య, మెరుగైన వాతావరణం, ఆధునిక సౌకర్యాలు అందించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు.ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని చదువుల్లో రాణించి ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ డీఎస్ఆర్ పాఠశాలను అద్భుతంగా తీర్చిదిద్దారని ప్రశంసించారు. మంత్రి నారాయణ కల్పించిన సౌకర్యాలు, అవకాశాలను విద్యార్థులు పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. "బాగా చదివి ఉన్నత స్థాయికి ఎదిగి, తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు, పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు.కార్యక్రమంలో నెల్లూరు మేయర్ దేవరకొండ సుజాత, కమిషనర్ నందన్, డీఈఓ బాలాజీరావు, ఎంఈఓ తిరుపాల్, డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ యాదవ్, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ తాళ్లపాక అనూరాధ, మాజీ జెడ్పీటీసీ విజేతారెడ్డి, కార్పొరేటర్ కిన్నెర మాల్యాద్రి, టీడీపీ నగర అధ్యక్షుడు మామిడాల మధు,టీడీపీ నేతలు ఆనం రంగమయూర్ రెడ్డి,అన్నంగి ప్రసాద్, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

# నేత్రదానం మరో జీవితానికి వెలుగుదానం

- **కాకతీయ హైస్కూల్‌లో జాతీయ నేత్రదాన పక్షోత్సవాల సందర్భంగా అవగాహన.....**

**ధర్మవరం సెప్టెంబర్ 5 అనంత జనశక్తి న్యూస్ :**



ధర్మవరం మరణానంతరం నేత్రదానం చేయడం ద్వారా చూపు కోల్పోయిన వారికి వెలుగును అందించవచ్చని జిల్లా అంధత్వ నివారణ అధికారి డాక్టర్ అనురాధ తెలిపారు. 41వ జాతీయ నేత్రదాన పక్షోత్సవాలను పురస్కరించుకుని లక్ష్మీ చెన్నకేశవపురం పట్టణ ఆరోగ్య కేంద్రం పరిధిలోని కాకతీయ హైస్కూల్‌లో విద్యార్థులకు నేత్రదానం, కంటి ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

ఆప్టోమెట్రి క్ ఆఫీసర్ ఉరుకుందప్ప ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి డాక్టర్ అనురాధ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కళ్ల ప్రాముఖ్యత, కంటి ఆరోగ్య పరిరక్షణతో పాటు నేత్రదానం వల్ల కలిగే ప్రయోజనాలను విద్యార్థులకు వివరించారు. ఒక వ్యక్తి మరణానంతరం దానం చేసిన కళ్ల ద్వారా మరో వ్యక్తి జీవితంలో వెలుగులు నింపవచ్చని పేర్కొన్నారు.

**కంటి ఆరోగ్యంపై జాగ్రత్త అవసరం....**

డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేటర్ ఆఫీసర్ విజయ్ కుమార్ మాట్లాడుతూ కంటి ఆరోగ్యానికి సమతుల్య ఆహారం, పోషకాహారం తీసుకోవడం అవసరమన్నారు. మొబైల్ ఫోన్లు, కంప్యూటర్లు తదితర స్క్రీన్ల వినియోగంలో తగిన జాగ్రత్తలు పాటించాలని విద్యార్థులకు సూచించారు.

**వ్యాసరచన పోటీ.....**

నేత్రదానం ప్రాముఖ్యతపై విద్యార్థులకు వ్యాసరచన పోటీ నిర్వహించారు. ప్రతిభ కనబరిచిన ముగ్గురు విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ ఆదిశేషు, డాక్టర్ జయంత్ కుమార్, వి. జయ్ కుమార్, మలేరియా అసిస్టెంట్ శ్రీనివాసులు, కమ్యూనిటీ ఆర్గనైజర్ లక్ష్మీనారాయణ, పాఠశాల ప్రిన్సిపల్, వైస్ ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు, సిబ్బంది, ఆశా వర్కర్ అరుణ తదితరులు పాల్గొన్నారు. "మరణానంతరం నేత్రదానం చేసి.. మరొకరికి చూపును ప్రసాదిద్దాం" అనే సందేశాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని అధికారులు పిలుపునిచ్చారు.

## దేశం గర్వించదగ్గ వ్యక్తి భారతరత్న సర్వేపల్లి రాధాకృష్ణన్



- **సమాజానికి ఉపాధ్యాయులే ఆదర్శంగా నిలవాలి**
- **విద్యార్థులను ఉత్తమ భావి భారత పౌరులుగా తీర్చిదిద్దే బాధ్యత గురువులదే**
- **సత్యసాయి జిల్లా పుట్టపర్తి మంగళకర కళాశాలలో నిర్వహించిన గురుపూజోత్సవం 2026 సందర్భంగా జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ పురస్కార మహోత్సవ కార్యక్రమంలో ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంభూపాల్ రెడ్డి, మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి,జిల్లా కలెక్టర్ శ్యాంప్రసాద్**

**పుట్టపర్తి సెప్టెంబర్ 05, అనంత జనశక్తి న్యూస్**

దేశ భవిష్యత్తును నిర్మించడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంభూపాల్ రెడ్డి, మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి, జిల్లా కలెక్టర్ శ్యాంప్రసాద్ పేర్కొన్నారు. శనివారం పుట్టపర్తిలోని మంగళకర కళాశాలలో నిర్వహించిన సత్యసాయి జిల్లా గురుపూజోత్సవం-2026 ఉత్తమ ఉపాధ్యాయ పురస్కార మహోత్సవం ఘనంగా జరిగింది.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, భారతరత్న డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ దేశం గర్వించదగ్గ మహనీయుడని, ఆయన జయంతిని ఉపాధ్యాయ దినోత్సవంగా జరుపుకోవడం ఉపాధ్యాయ వృత్తి గొప్పతనానికి నిదర్శనమన్నారు. సమాజాభివృద్ధిలో ఉపాధ్యాయులు ఆదర్శంగా నిలవాలని సూచించారు.విద్యార్థులకు కేవలం విద్యాబోధన చేయడమే కాకుండా నైతిక విలువలు, క్రమశిక్షణ, సామాజిక బాధ్యత, దేశభక్తి వంటి మంచి లక్షణాలను పెంపొందించాలని అన్నారు. విద్యార్థులను ఉత్తమ భావి భారత పౌరులుగా తీర్చిదిద్దే బాధ్యత గురువులపై ఉందని పేర్కొన్నారు.ఆంధ్రప్రదేశ్ విద్యావ్యవస్థలో విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ విప్లవాత్మకమైన మార్పులు తీసుకొచ్చారని వారు తెలిపారు. ఆధునిక విద్యా విధానాలు, సాంకేతిక పరిజ్ఞానం, మౌలిక వసతుల అభివృద్ధి ద్వారా విద్యార్థులకు మెరుగైన విద్య అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఈ మార్పులను సద్వినియోగం చేసుకొని విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దాలని ఉపాధ్యాయులకు సూచించారు.ఈ సందర్భంగా సత్యసాయి జిల్లా వ్యాప్తంగా ఎంపికైన 54 మంది ఉత్తమ ఉపాధ్యాయులకు ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలు, అవార్డులు, మెమెంటోలు అందజేశారు. అనంతరం ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంభూపాల్ రెడ్డి, మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి, జిల్లా కలెక్టర్ శ్యాంప్రసాద్, ఆర్జెడీ శ్యాముల్, డీఈఓ కిష్టప్ప తదితరులు ఉత్తమ ఉపాధ్యాయులను శాలువాలతో ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో కూటమి ప్రజాప్రతినిధులు లక్ష్మీనారాయణ ,కాలే నాయక్,పత్తి చంద్రశేఖర్ ,పర్వీన్ భాను ,యశోద రాయుడు,శ్రీనివాసులు ,వెంగమేష్ చౌదరి ,మార్కెట్ యార్డ్ చైర్మన్ పూల శివప్రసాద్, సామకోటి ఆదినారాయణ ,రిటైర్డ్ హెచ్ఎం లక్ష్మన్న, విద్యాశాఖ అధికారులు అశోక్ కుమార్ ,జయచంద్ర,చంద్రశేఖర్ ,ఆర్ చంద్రశేఖర్ ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# గురువే దైవం.. గురువే మార్గదర్శి



- **లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా గురుపూజోత్సవం....**
- **మూడు దశాబ్దాలుగా విద్యాసేవలో....**
- **కొనసాగుతున్న ఉపాధ్యాయులకు ఘన సత్కారం....**

**ధర్మవరం సెప్టెంబర్ 5, అనంత జనశక్తి న్యూస్ :**

**అక్షరం నేర్పిన గురువులను స్మరించుకుంటూ.. వారి సేవలను గౌరవిస్తూ ధర్మవరంలో జాతీయ ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. లయన్స్ క్లబ్-316 జే , ధర్మవరం ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన గురుపూజోత్సవ కార్యక్రమం ఆత్మీయ వాతావరణంలో సాగింది.**

**కార్యక్రమానికి లయన్స్ క్లబ్ అధ్యక్షుడు, గవ్వల రాధాకృష్ణ, అసిస్టెంట్ సెక్రటరీ డాక్టర్ శ్రీరాములు, ట్రెజరర్ గొండెల విజయకుమార్ హాజరయ్యారు. సెప్టెంబర్ 5న డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని ఉపాధ్యాయ దినోత్సవంగా జరుపుకోవడం ద్వారా దేశానికి విద్యావేత్తల పట్ల ఉన్న గౌరవం ప్రతిబింబిస్తుందని వారు పేర్కొన్నారు."ఉపాధ్యాయుడి చేతిలోని చాక్.. విద్యార్థి భవిష్యత్తుకు బ్లూప్రింట్" అని పేర్కొంటూ, ఉపాధ్యాయులు కేవలం పాఠాలు బోధించేవారు కాదని.. విద్యార్థుల జీవితాలకు దిశానిర్దేశం చేసే మార్గదర్శకులని అన్నారు. సర్వేపల్లి రాధాకృష్ణన్ ఆశయాలను ఆదర్శంగా తీసుకుని నిబద్ధత, క్రమశిక్షణ, సేవాభావంతో విద్యార్థుల్లో విలువలను పెంపొందించాలని పిలుపునిచ్చారు.**

**సేవకు సన్మానం.. గురువులకు గౌరవం...**

**విద్యారంగంలో 30 ఏళ్లకు పైగా సేవలందించిన ఐదుగురు ఉపాధ్యాయులను లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. తెలుగు ఉపాధ్యాయురాలు గొండెల సుమలత, పి.డి. జి. రఘునాథశాస్త్రి, ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎంలు కే. చిన్నమ్మ, ఎన్. నారాయణస్వామి, కే జీ బీ వీ పాఠశాల టీచర్ గా సేవలందించిన బి. ప్రభావతిని సత్కరించారు.**

**ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ప్రతినిధులు పి. వెంకటస్వామి, షావలి, జి. మోహన్‌రాజ్, లక్ష్మీనారాయణ, వి. శివప్రసాద్, హెచ్.ఎన్.ఇ. రామిరెడ్డి, ఎ. రమేష్‌బాబు, వి. నాగేంద్ర, పండిట్ గొండెల వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.**

# గ్రామీణ ప్రజలకు పూర్తి స్థాయి తాగు నీటి భద్రత దిశగా పవన్ కళ్యాణ్ అడుగులు

- తాగు నీటి వ్యవస్థల బలోపేతానికి ఉన్న అన్ని అవకాశాలు సద్వినియోగంపై దృష్టి
- రాష్ట్రవ్యాప్తంగా యుద్ధప్రాతిపదికన ఫిల్టర్ బెడ్ల పునరుద్ధరణ పనులు
- లక్షలాది మందికి స్వచ్ఛమైన, సురక్షితమైన తాగునీరు
- ఇప్పటికే రూ. 26,000 కోట్లతో జేజేఎం-అమరజీవి జలధారల పనులు
- గత ప్రభుత్వ హయాంలో నిర్లక్ష్యానికి గురైన గ్రామీణ తాగు నీటి పథకాలు
- రంగు మారిన నీరు, నాణ్యతలేని నీటి సరఫరాతో ఇబ్బందులుపడిన ప్రజలకు ఉపశమనం
- సమస్య తీవ్రత, స్థానిక అవసరాల ఆధారంగా పనులకు ప్రాధాన్యత
- ఉప ముఖ్యమంత్రివర్యుల ఆదేశాలతో వేగవంతంగా అమలవుతున్న పునరుద్ధరణ చర్యలు
- గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి ఇంటికీ నాణ్యమైన తాగునీరు అందించడమే లక్ష్యమన్న ఉప ముఖ్యమంత్రివర్యులు



Halvi Village, Kowthalam Mandal, Kurnool District

అమరావతి సెప్టెంబర్ 05 అనంత జనశక్తి న్యూస్

గ్రామీణ ప్రాంత ప్రజలకు స్వచ్ఛమైన, సురక్షితమైన తాగు నీరు అందించాలనే లక్ష్యంతో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా శాఖల మంత్రి పవన్ కళ్యాణ్ విస్తృత స్థాయి కార్యచరణకు శ్రీకారం చుట్టారు. రాష్ట్రవ్యాప్తంగా గ్రామీణ తాగునీటి పథకాల పునరుద్ధరణ చర్యలు చేపట్టారు. ఇందుకోసం ప్రత్యేకంగా రూ. 35 కోట్ల నిధులు కేటాయించి, దాదాపు 370 గ్రామాల పరిధిలోని సమగ్ర రక్షిత మంచినీటి పథకాల్లో పాడైన 340 ఫిల్టర్ బెడ్లు పునరుద్ధరించారు. తద్వారా సుమారు 25 లక్షల మందికి నాణ్యమైన తాగునీటి సరఫరా చేస్తున్నారు. జల్ జీవన్ మిషన్ 2.0 మార్గదర్శకాలకు అనుగుణంగా జిల్లా పరిషత్, మండల పరిషత్ నిధులతో గ్రామీణ తాగునీటి వ్యవస్థల నిర్వహణ, సంరక్షణ చర్యలు చేపడుతున్నారు

**గ్రామీణ తాగునీటి వ్యవస్థ బలోపేతం దిశగా ఎన్నో కార్యక్రమాలు**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రవ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాల్లో తాగు నీటి వ్యవస్థలను బలోపేతం చేయడానికి అవసరమైన అన్ని అవకాశాలను వినియోగించుకుంటూ పవన్ కళ్యాణ్ ప్రణాళికలు ముందుకు తీసుకువెళ్తున్నారు. జల్ జీవన్ మిషన్అమరజీవి జలధారల ద్వారా దాదాపు రూ. 26,000 కోట్ల విలువైన పనులు ముందుకు తీసుకువెళ్తున్నారు. చిత్తూరు, ప్రకాశం, పల్నాడు, ఉభయ గోదావరి జిల్లాల పరిధిలో రూ. 7,910 కోట్లతో చేపట్టిన మెగా వాటర్ గ్రిడ్ పథకాల ద్వారా వచ్చే 30 ఏళ్లలో 1.21 కోట్ల మంది ప్రజల తాగునీటి అవసరాలు తీర్చనున్నారు. మరో పది మల్టీవిలేజ్ స్కీం పథకాలకు రూ. 9,355 కోట్లు మంజూరు చేశారు. అత్యంత తీవ్ర నీటి ఎద్దడి కలిగిన 3 వేల గ్రామాలను గుర్తించి, రూ. 1,814 కోట్లతో సింగిల్ విలేజ్ వాటర్ స్కీంల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. వీటితోపాటు గత ప్రభుత్వం అరకొర పనులు చేసి వదిలివెళ్లిన పులివెందుల, డోన్, ఉద్దానం తదితర తాగునీటి పథకాల పనులు పూర్తి చేస్తున్నారు. వీటితో పాటు పవన్ కళ్యాణ్ చొరవతో 7,439 గ్రామీణ తాగునీటి పనుల క్రమబద్దీకరణ, విస్తరణ నిమిత్తం రూ. 4,054 కోట్ల కేటాయింపులకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది.పవన్ కళ్యాణ్ గ్రామీణ తాగునీటి సరఫరా విభాగం బాధ్యతలు చేపట్టిన క్షణం నుంచి ప్రతి ఇంటికీ నాణ్యమైన తాగునీరు చేరాలన్న లక్ష్యాన్ని ముందుకు తీసుకువెళ్తున్నారు. గ్రామాల్లో ఫిల్టర్ బెడ్ల సమస్యలు ఉన్న విషయం ఆయన దృష్టికి వచ్చింది. గత ప్రభుత్వం ఐదేళ్ల కాలంలో గ్రామీణ తాగునీటి పథకాలను పూర్తిగా నిర్లక్ష్యం చేయడంతో ఫిల్టర్ బెడ్లు దెబ్బతిని, నీటి నాణ్యత తగ్గిపోవడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అనేక ప్రాంతాల్లో రంగు మారిన నీరు సరఫరా కావడం, శుద్ధి వ్యవస్థలు సక్రమంగా పని చేయకపోవడం వంటి సమస్యలు తీవ్రంగా ప్రభావం చూపాయి. గ్రామాల్లో సైతం ప్రజలు తాగునీటి అవసరాలు తీర్చుకునేందుకు డబ్బు వెచ్చించాల్సి వచ్చేది. ఈ పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని పవన్ కళ్యాణ్ గ్రామీణ నీటి సరఫరా వ్యవస్థల సమగ్ర పరిశీలనకు ఆదేశాలు జారీ చేశారు. సమస్య తీవ్రత, స్థానిక అవసరాలు మరియు ప్రజల నుంచి అందిన ఫిర్యాదుల ఆధారంగా ప్రాధాన్యత క్రమంలో పునరుద్ధరణ పనులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఉప ముఖ్యమంత్రివర్యుల ఆదేశాలనుసారం ఆర్.డబ్ల్యూ.ఎస్. అధికారులు రాష్ట్రవ్యాప్తంగా యుద్ధప్రాతిపదికన ఫిల్టర్ బెడ్ల పునరుద్ధరణ, మరమ్మతులు చేపట్టారు. ఫిల్టర్ బెడ్లు పూర్తిగా దెబ్బతిని, రంగు మారిన నీరు సరఫరా అవుతున్న గ్రామాలను గుర్తించి ఈ పునరుద్ధరణ ప్రక్రియను చేపట్టారు. నీటి శుద్ధి వ్యవస్థలో ఫిల్టర్ బెడ్లు అత్యంత కీలకమైన భాగం. నీటిలో సూక్ష్మ మలినాల తొలగింపునకు ఉపయోగపడతాయి. నాణ్యమైన తాగునీటి సరఫరాకు ఫిల్టర్ బెడ్ల సమర్థ నిర్వహణ అవసరమన్న అంశాన్ని గుర్తించి పవన్ కళ్యాణ్ ఈ ప్రక్రియను ముందుకు తీసుకువెళ్తున్నారు.గుడివాడ గ్రామీణ తాగునీటి సమస్యకు తక్షణ పరిష్కారం కృష్ణా జిల్లా, కంకిపాడు వేదికగా పల్లెపండుగ కార్యక్రమాన్ని ప్రారంభించేందుకు పవన్ కళ్యాణ్ వెళ్లిన సందర్భంలో ఆ వేదికపైన గుడివాడ శాసన సభ్యులు తమ నియోజకవర్గ గ్రామీణ ప్రాంతంలో ప్రజలు తాగునీటి సరఫరాలో నాణ్యతా లోపాల కారణంగా ఎదుర్కొంటున్న ఇబ్బందులు వివరించారు. ఈ అంశంపై తక్షణం స్పందించిన ఉప ముఖ్యమంత్రివర్యులు ఆ నియోజకవర్గంలో తాగునీటి నాణ్యతపై క్షేత్రస్థాయి సర్వేకు ఆదేశాలు ఇచ్చారు. 44 గ్రామాల తాగునీటి అవసరాలు తీర్చే 40 ఫిల్టర్ బెడ్లు దెబ్బతిన్నట్లు గుర్తించి, రూ. 3.80 కోట్లతో వాటి పునరుద్ధరణ ప్రక్రియ తక్షణం పూర్తి చేశారు.అంతేకాదు వలివర్తిపాడు, మల్లాయపాలెం గ్రామాల్లో జరుగుతున్న నీటి శుద్ధి పనులను స్వయంగా క్షేత్రస్థాయికి వెళ్లి పరిశీలించారు.విజయనగరం గొర్ల గ్రామంలో అతిసారం ప్రబలినప్పుడు ఆ ప్రాంత పర్యటనలో భాగంగా తాగునీటి సరఫరాలో లోపాలను గుర్తించి, తక్షణ మరమ్మతులకు ఆదేశాలు ఇచ్చారు. దేశంలో ఉన్న ప్రతి ఒక్కరికీ రోజుకు 55 లీటర్ల స్వచ్ఛమైన తాగునీరు సరఫరా చేయాలన్న ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ జల్ జీవన్ మిషన్ లక్ష్యాలకు అనుగుణంగా, ప్రతి గ్రామానికీ సురక్షితమైన తాగునీరు అందించే లక్ష్యంతో ముఖ్యమంత్రి నట నారా చంద్రబాబు నాయుడు సహకారంతో రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ముందుకు వెళ్తున్నట్టు పవన్ కళ్యాణ్ అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు.



Halvi Village, Kowthalam Mandal, Kurnool District

# విజన్ లో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం



యాడికి, సెప్టెంబర్ 5, అనంత జనశక్తి న్యూస్

మండల కేంద్రంలో ఉన్న విజన్ విద్యా సంస్థల యందు సర్వేపల్లి రాధాకృష్ణన్ జన్మదినం ను పురస్కరించుకొని ఉపాధ్యాయ దినోత్సవం ను విజన్ ఉపాధ్యాయ బృందం విద్యార్థుల సమక్షంలో శనివారం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా మొదట రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా విజన్ కరస్పాండెంట్ విశ్వనాథ్ ఆయన జీవిత చరిత్రను చెబుతూ ఆయన రాష్ట్రపతి స్థానంలో కంటే ఉపాధ్యాయ వృత్తిలో ఎక్కువ సంతృప్తి లభిస్తుందన్నారు. ఉపాధ్యాయ వృత్తి అన్ని వృత్తుల్లో ఉన్నవారికి నాంది పలికే ఏకైక వృత్తి అని, ఏ వృత్తిలో ఉన్నవారికైనా ఖచ్చితంగా గురువు ఉంటారని ,మనకు మొదటి గురువు అమ్మ, తల్లి వడి లోనే మొదటి విద్యాభ్యాసం జరుగుతుందని, తర్వాత గురువు నాన్న అని ,ఆయనజీవిత విషయాలను,గమ్యాలను ఏర్పరుస్తారని తదుపరి గురువు ఉపాధ్యాయుడు అని, విద్యార్థుల భవిష్యత్తు కొరకు అనునిత్యం నేర్చుకుంటూ,నేర్పిస్తూ వారి బంగారు భవితకు బాటలు వేస్తారని తెలిపారు.ఈ కార్యక్రమంలో విజన్ ఉపాధ్యాయ బృందం , విద్యార్థులు పాల్గొన్నారు

# ధనలక్ష్మిపురం నారాయణ లో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు



నెల్లూరు సెప్టెంబర్ 05 అనంత జనశక్తి న్యూస్

నగరంలోని ధనలక్ష్మిపురం నందుగల నారాయణ రత్నం సి బి ఎస్ ఈ స్కూల్ లో శనివారం ఉపాధ్యాయ దినోత్సవం వేడుకలు ఘనంగా జరిగాయి ఈ వేడుకలకు నారాయణ స్కూల్స్ ఏజీఎం రవి వర్మ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రవివర్మ, ప్రిన్సిపాల్ మోపిదేవి నాగమణి మాజీ భారత రాష్ట్రపతి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ భారత రాష్ట్రపతిగా సేవలందించిన డాక్టర్ రాధాకృష్ణన్ పుట్టినరోజును ఉపాధ్యాయ దినోత్సవంగా జరుపుకోవడం గొప్ప విషయం అన్నారు. ఉపాధ్యాయ వృత్తిలో ఉంటూ రాష్ట్రపతి స్థాయికి ఎదిగిన రాధాకృష్ణన్ చిరస్మరణియుడని నేటి యువత ఆయనను ఆదర్శంగా తీసుకొని ముందుకు నడవాలని విద్యార్థులకు సూచించారు. అనంతరం పలువురు ఉత్తమ సేవలందించిన ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించి సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు విద్యార్థులు సిబ్బంది పాల్గొన్నారు.

# అప్పుల బాధ తాళలేక.. గోదావరిలోకి దూకిన కుటుంబం

అప్పుల బాధ తాళలేక ఓ కుటుంబం గోదావరి నదిలోకి దూకి ఆత్మహత్యకు యత్నించిన ఘటన పశ్చిమగోదావరి జిల్లా యలమంచిలి మండలం చించినాడ బ్రిడ్జి వద్ద చోటుచేసుకుంది. తణుకుకు చెందిన నంబూరు శ్రీనివాస్, పద్మిని దంపతులు స్థానికంగా కిరాణా, పాల వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తుంటారు. వ్యాపారం అంతంతమాత్రంగానే సాగుతుండటం, అప్పుల ఒత్తిడి పెరగడంతో.. కుమారుడు (16), కుమార్తె (12)తో కలిసి దంపతులు శనివారం తెల్లవారుజామున చించినాడ బ్రిడ్జి పైనుంచి నదిలోకి దూకారు. ఈ ఘటనలో పద్మినిని జాలర్లు రక్షించగా.. శ్రీనివాస్‌తోపాటు ఇద్దరు పిల్లలు గల్లంతయ్యారు. అపస్మారక స్థితిలోకి చేరిన పద్మినిని ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. గల్లంతైన వారి కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

శ్రీనివాస్ సొంతూరు భీమవరంలోని మత్స్యపురి కాగా.. 20 ఏళ్ల క్రితం తణుకు వచ్చి స్థిరపడ్డారని స్థానికులు తెలిపారు. కుమారుడు పాలిటెక్నిక్ మొదటి సంవత్సరం, కుమార్తె స్థానిక ప్రైవేట్ పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్నారు. ఇదిలా ఉండగా.. ఇటీవలే తణుకు మండలం వేల్పూరుకు చెందిన దంపతులు అదే ప్రాంతంలో గోదావరిలోకి దూకిన ఘటనలో భర్త మృతి చెందగా, భార్య ఆచూకీ నేటికీ లభ్యం కాలేదు. పది రోజుల వ్యవధిలో మరో కుటుంబం అదే ప్రాంతంలో నదిలోకి దూకడంతో స్థానికంగా విషాదం నెలకొంది.

# శ్రీ సత్యసాయి జిల్లాలో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం

- 54 మందికి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలు ప్రదానం
- పాల్గొన్న జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్, ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంభూపాల్ రెడ్డి,మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి



పుట్టపర్తి, సెప్టెంబర్ 05 అనంత జనశక్తి న్యూస్

మాజీ రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని శ్రీ సత్యసాయి జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో జగరాజుపల్లిలోని మంగళకర ఎడ్యుకేషన్ ఇన్స్టిట్యూషన్స్‌లో జిల్లా స్థాయి ఉపాధ్యాయ దినోత్సవం మరియు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుల ప్రదానోత్సవం గురువారం అత్యంత వైభవంగా జరిగింది. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... సమాజంలో మరే ఇతర వృత్తికీ లేని అత్యున్నత గౌరవం, ప్రాధాన్యత ఉపాధ్యాయులకు ఉన్నాయని పేర్కొన్నారు. తల్లిదండ్రుల తర్వాత విద్యార్థుల జీవితాల్లో వెలుగులు నింపి, వారి భవిష్యత్తును తీర్చిదిద్దడంలో గురువులదే ప్రధాన పాత్ర అని కొనియాడారు.డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చూపిన బాటలో నడుస్తూ, విద్యార్థులను భావి భారత ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఉపాధ్యాయుడు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంభూపాల్ రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, నిరుద్యోగుల కోసం ఏటా పారదర్శక పద్ధతిలో డీఎస్సీ (DSC) నియామకాలు చేపడుతోందని తెలిపారు. ఆదర్శవంతమైన విద్యార్థులను తయారు చేయాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి మాట్లాడుతూ.. 'తల్లికి వందనం' ద్వారా కుటుంబంలో ఎంతమంది పిల్లలు చదువుతుంటే వారందరికీ ఆర్థిక సాయం అందిస్తున్నామని, అలాగే 'డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం' ద్వారా పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన, పౌష్టికాహారాన్ని అందిస్తున్నామని వివరించారు.కేవలం పాఠ్యాంశాలే కాకుండా విలువల కూడిన విద్యను పిల్లలకు అందించడంలో ఉపాధ్యాయులు కీలక పాత్ర పోషించాలన్నారు. 54 మందికి సత్కారం...

విద్యాబోధనలో విశేష ప్రతిభ కనబరిచిన జిల్లాలోని వివిధ పాఠశాలల నుంచి ఎంపిక చేసిన 54 మంది ఉత్తమ ఉపాధ్యాయులకు వేదికపై ప్రముఖుల చేతుల మీదుగా పురస్కారాలను ప్రదానం చేసి, శాలువా మరియు జ్ఞాపికలతో ఘనంగా సత్కరించారు.ఈ కార్యక్రమంలో ఆర్‌జేడీ కె. శామ్యూల్, డీఈఓ జి. కృష్ణప్పలతో పాటు విద్యాశాఖ అధికారులు,ఉపాధ్యాయులు,కూటమి ప్రజా ప్రతినిధులు లక్ష్మీనారాయణ,కాలే నాయక్,పత్తి చంద్రశేఖర్ ,పర్వీన్ భాను ,యశోద రాయుడు,శ్రీనివాసులు ,వెంగమేష్ చౌదరి, మార్కెట్ యార్డ్ చైర్మన్ పూల శివప్రసాద్,సామకోటి ఆదినారాయణ ,రిటైర్డ్ హెచ్ఎం లక్ష్మన్న, విద్యాశాఖ అధికారులు అశోక్ కుమార్ ,జయచంద్ర,చంద్రశేఖర్ ,ఆర్ చంద్రశేఖర్ ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు తదితరులుపెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# నిడదవోలు నియోజకవర్గంలో రూ. 1.77 కోట్ల అభివృద్ధి పనులకు మంత్రి కందుల దుర్గేష్ శంకుస్థాపన

- మున్సిపల్ పరిధిలోని 5, 8, 9, 10 వార్డులు, ఇందిరానగర్‌లో పలు మౌలిక వసతుల పనులకు శ్రీకారం
- ఉపాధ్యాయ దినోత్సవ వరాలపై హర్షం.. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌లకు ఉద్యోగుల ధన్యవాదాలు – మంత్రి దుర్గేష్‌ను కలిసి అభినందనలు

నిడదవోలు సెప్టెంబర్ 05 అనంత జనశక్తి న్యూస్

నిడదవోలు పట్టణ రూపురేఖలు మార్చడమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని మంత్రి కందుల దుర్గేష్ వెల్లడించారు. శనివారం నిడదవోలు



పట్టణ మున్సిపల్ పరిధిలోని పలు వార్డులలో రూ. 1.77 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న వివిధ అభివృద్ధి సంక్షేమ పనులకు రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రివర్యులు కందుల దుర్గేష్ శంకుస్థాపనలు చేశారు.తొలుత 5వ వార్డు పరిధిలోని గాంధీ విగ్రహం జంక్షన్ నుండి రైల్వే ఫీడర్ రోడ్డు వరకు 300 మీటర్ల పొడవైన సి.సి. రోడ్డు నిర్మాణానికి 'గోదావరి పుష్కరాల గ్రాంట్స్ - 2027' కింద రూ. 1 కోటి నిధులతో మంత్రి దుర్గేష్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ.. రైల్వే స్టేషన్‌ను చిన్న కాశీరేవుకు అనుసంధానించే ఏకైక ప్రధాన రహదారి ఇది అని పేర్కొన్నారు. రాబోయే పుష్కరాల సమయంలో చిన్న కాశీరేవు ఘాట్‌కు వచ్చే భక్తులకు రవాణా పరంగా ఇది ఎంతో సౌకర్యవంతంగా ఉండటంతో పాటు, కొత్తగా నిర్మించిన ఆర్‌ఓబీ ని చేరుకునేం దుకు ప్రధాన మార్గంగా ఉపయోగపడుతుందని వివరించారు.అనంతరం 8, 9, 10 వార్డుల పరిధిలో లూథరన్ చర్చి నుండి చర్చిపేట సచివాలయం వరకు, అలాగే ఆర్‌వీఆర్‌ఎస్ అపార్ట్‌మెంట్ నుండి టౌన్‌హాల్ రోడ్డు వరకు 439 మీటర్ల పొడవైన సి.సి. డ్రెయిన్ నిర్మాణ పనులకు ఎస్సీ సబ్ ప్లాన్ నిధుల ద్వారా మంత్రి దుర్గేష్ శంకుస్థాపన చేశారు. ప్రస్తుతం ఉన్న డ్రెయిన్ శిథిలావస్థకు చేరి సన్నగా ఉండడం వల్ల గృహ వ్యర్థ నీరు నిలిచిపోతోందని, ఈ కొత్త డ్రెయిన్‌తో ఆ సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని మంత్రి దుర్గేష్ పేర్కొన్నారు.ఆ తర్వాత ఇందిరానగర్‌లోని సాయి బాబా గుడి వద్ద నుండి 386 మీటర్ల పొడవైన సి.సి. మరియు ఆర్‌సిసి డ్రెయిన్‌ను నిర్మించి మాలకోడు అవుట్‌లెట్ డ్రెయిన్‌కు అనుసంధానించే పనులకు శ్రీకారం చుట్టారు. ఎస్సీ సబ్ ప్లాన్ నిధుల ద్వారా చేపట్టిన ఈ పనులతో మురుగునీటి సమస్య పూర్తిగా తొలగిపోతుందని మంత్రి దుర్గేష్ ఆశాభావం వ్యక్తం చేశారు.అదే విధంగా మున్సిపాలిటీ సాధారణ నిధుల నుంచి రూ.7.70 లక్షల అంచనా వ్యయంతో 5వ వార్డులోని శ్రీ రాజరాజేశ్వరి సమేత గోలింగేశ్వర స్వామి ఆలయం నుంచి శ్రీ వరసిద్ధి వినాయక స్వామి ఆలయం వరకు చేపడుతున్న నూతన డ్రైనేజీ నిర్మాణ పనులకు రాష్ట్ర మంత్రి శ్రీ కందుల దుర్గేష్ గారు శంకుస్థాపన చేశారు.

## పర్యావరణ పరిరక్షణ - హరితాంధ్రప్రదేశ్ నిర్మాణంలో భాగంగా కొబ్బరి మొక్కలు నాటే కార్యక్రమం:

హరితాంధ్రప్రదేశ్ నిర్మాణంలో భాగంగా కోస్టల్ బ్యాంక్ వారి సీఎస్ఆర్ నిధులతో 16వ వార్డు గాంధీనగర్ లైన్స్ ఐ హాస్పిటల్ మార్గంలో గల మున్సిపల్ ఖాళీ స్థలంలో కొబ్బరి మొక్కలు నాటే పర్యావరణ పరిరక్షణ కార్యక్రమానికి మంత్రి కందుల దుర్గేష్ శ్రీకారం చుట్టారు.

## ముఖ్యమంత్రికి, ఉపముఖ్యమంత్రికి ఉద్యోగుల ప్రత్యేక కృతజ్ఞతలు

ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఉద్యోగ, ఉపాధ్యాయ వర్గాలకు తీపి కబురు అందించిన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కు ఉద్యోగ సంఘాల ప్రతినిధులు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.12వ పీఆర్సీ నియామకానికి ఆమోదం తెలపడం, ఈ అక్టోబరు నెల నుంచి రెండు డీఏ లను విడుదల చేయడానికి నిర్ణయించడం, 2022 నాటి సరెండర్ లీవ్‌ల మొత్తాన్ని రాబోయే సంక్రాంతికి ఉద్యోగుల ఖాతాల్లో జమ చేస్తామని ప్రకటించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. అలాగే పెన్షనర్లకు అడిషనల్ క్వాంటం ఆఫ్ పెన్షన్‌ను 10-15 శాతానికి పెంచడం, ఎంప్లాయీస్ హెల్త్ ఇన్సూరెన్స్‌కు ప్రతినెలా క్రమం తప్పకుండా నిధులు జమ చేసేలా చారిత్రాత్మక నిర్ణయం తీసుకున్నందుకు ఉద్యోగులు మంత్రి కందుల దుర్గేష్‌ను మర్యాదపూర్వకంగా కలసి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

# ఓటర్ల జాబితా పరిశీలనలో అధికారి నిద్ర!



**- కాశీపట్నంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ ఓటర్ల తుది ప్రచురణపై గ్రామసభ**
**- సభ మధ్యలో ప్రత్యేక అధికారి కునుకు..స్థానికుల్లో చర్చ**

**అనంతగిరి సెప్టెంబర్ 05 అనంత జనశక్తి న్యూస్**

అనంతగిరి మండలం కాశీపట్నం గ్రామపంచాయతీ కేంద్రంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ ఓటర్ల తుది ప్రచురణపై శనివారం గ్రామసభ నిర్వహించారు. గ్రామపంచాయతీ ప్రత్యేక అధికారి ప్రభాకర్ అధ్యక్షతన మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఈ సభ కొనసాగింది.ఈ సందర్భంగా ప్రత్యేక అధికారి ప్రభాకర్ మాట్లాడుతూ ఓటర్ల జాబితాలో నమోదైన పేర్ల ఆధారంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ ఓటర్లను గుర్తించడంతో పాటు, జాబితాలో ఏవైనా తప్పులు ఉంటే వాటిని గుర్తించి సరిచేసుకునేందుకు గ్రామసభ ఏర్పాటు చేసినట్లు తెలిపారు.అనంతరం గ్రామసభ సమక్షంలో గ్రామ సచివాలయ డీఏ కృష్ణ ఓటర్ల జాబితాలోని పేర్లను చదివి వినిపించారు. గ్రామస్తులు, ప్రజాప్రతినిధులు జాబితాను పరిశీలించారు. తప్పులు లేదా అభ్యంతరాలు ఉంటే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు.

**సభ మధ్యలో ప్రత్యేక అధికారి కునుకు!**

గ్రామసభ కొనసాగుతున్న సమయంలో సభకు అధ్యక్షత వహిస్తున్న ప్రత్యేక అధికారి ప్రభాకర్ తన కుర్చీలో కాసేపు నిద్రిస్తూ సేదతీరడం చర్చనీయాంశంగా మారింది. ఓటర్ల జాబితా వంటి కీలక అంశంపై నిర్వహిస్తున్న గ్రామసభలో సభాధ్యక్షుడే నిద్రించడం పట్ల పలువురు స్థానికులు విస్మయం వ్యక్తం చేశారు. ప్రజల ఓటు హక్కుకు సంబంధించిన కీలకమైన కార్యక్రమంలో అధికారులు మరింత బాధ్యతాయుతంగా వ్యవహరించాలని పలువురు అభిప్రాయపడ్డారు.ఈ కార్యక్రమంలో గ్రామ సచివాలయ సెక్రటరీ వై. శ్రీ. సంతోష్, వీఆర్వో ఎల్‌బీ అనిల్, మహిళా పోలీస్ శ్రీదేవి, వీఆర్ఏలు ఎస్. సన్యాసిరావు, డి. రవి, టీడీపీ నాయకులు రాళ్లపూడి ఎర్రిబాబు, సిరగం బాలుగొప్ప, వెంకటేష్, సారవాణిపాలెం క్లస్టర్ పీసా కమిటీ కార్యదర్శి కాకర సింగులు, కాశీపట్నం క్లస్టర్ పీసా కమిటీ ఉపాధ్యక్షుడు కంటపైడి రాజు, వైసీపీ ప్రజాప్రతినిధులు చేపల సన్యాసిరావు, బొప్పాది అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు. అలాగే సీతంపేట గ్రామ పెద్దలు రాకోటి సింగప్ప, ఎంగిలి జమ్మరాజు, పంచాయతీ పరిధిలోని వివిధ గ్రామాల ప్రజలు, వివిధ పార్టీల ప్రజాప్రతినిధులు, సచివాలయ అధికారులు, సిబ్బంది పాల్గొని గ్రామ సభను విజయవంతం చేశారు.

# గురువులే... విద్యార్థుల భవిష్యత్ కు బాటలు వేసే మార్గదర్శకులు...!!



**-సర్వేపల్లి ట్యుటోరియల్స్‌లో ఘనంగా గురుపూజోత్సవం**

**శ్రీ సత్య సాయి జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 5, అనంత జనశక్తి న్యూస్:**

గురువులను గౌరవించడం భారతీయ సంస్కృతిలో అంతర్భాగమని, విద్యార్థుల జీవితాలను తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని పలువురు వక్తలు పేర్కొన్నారు. సర్వేపల్లి ట్యుటోరియల్స్‌లో గురుపూజోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తమ ఉపాధ్యాయులకు పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు.కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు గురుపూజోత్సవం ప్రాధాన్యతను వివరిస్తూ ప్రసంగించారు. క్షేత్రస్థాయిలో విద్యార్థుల ప్రతిభను గుర్తించి, వారికి సరైన దిశానిర్దేశం చేస్తూ త్రికరణ శుద్ధితో విద్యాబోధన అందించే ఉపాధ్యాయుల సేవలు అభినందనీయమని వక్తలు కొనియాడారు. గురువుల బోధన కేవలం పాఠ్యాంశాలకే పరిమితం కాకుండా విద్యార్థుల్లో క్రమశిక్షణ, నైతిక విలువలు, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించేలా ఉండాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు తమ గురువుల పట్ల ఉన్న అభిమానాన్ని వ్యక్తం చేస్తూ, తమ జీవితాల్లో ఉపాధ్యాయుల మార్గదర్శకత్వం ఎంతో విలువైనదని తెలిపారు. అనంతరం ఉపాధ్యాయులు కూడా విద్యార్థులకు విలువైన సూచనలు చేస్తూ, ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని కష్టపడి చదివి మంచి భవిష్యత్తును నిర్మించుకోవాలని ఆకాంక్షించారు.కార్యక్రమంలో ట్యుటోరియల్స్ కరస్పాండెంట్లు బిల్లే. జయశంకర్, బాలచంద్ర పాల్గొని ఉపాధ్యాయులకు గురుపూజోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. అలాగే ఇంగ్లీష్ ఉపాధ్యాయుడు శ్రీనివాసులు, తెలుగు ఉపాధ్యాయురాలు వసుధ, వసంతలక్ష్మి, బి.అపర్ణ, చంద్రశేఖర్ రెడ్డి, అనిల్ కుమార్ పాటు విద్యార్థినీ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు. గురువుల పట్ల గౌరవాభిమానాలను చాటుతూ నిర్వహించిన ఈ వేడుకలు ఆహ్లాదకర వాతావరణంలో ముగిశాయి.

# పినకోట బాలుర పాఠశాల విద్యార్థులకు 'సూపర్-50'లో చోటు

**- ముగ్గురు విద్యార్థుల ప్రతిభకు అభినందనలు..**
**హెచ్‌ఎంలకు ఘన సన్మానం**

**అనంతగిరి,సెప్టెంబర్ 05 అనంత జనశక్తి న్యూస్**

**అనంతగిరి మండల పరిధిలోని పినకోట బాలుర పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు ప్రతిష్టాత్మక 'సూపర్-50' కార్యక్రమానికి ఎంపికయ్యారు. విద్యార్థులు సాధించిన ఈ ఘనతపై పాఠశాల ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా పినకోట బాలుర పాఠశాలలో ప్రత్యేక అభినందన సభ నిర్వ హించారు.కార్యక్రమానికి స్థానిక పంచాయతీ సర్పంచ్ ఎస్. గణేష్, ఉపసర్పంచ్ జే. గం గు లు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.సూపర్-50కి ఎంపికైన విద్యార్థులను వారు అభి నందించారు.విద్యార్థుల విజయానికి కృషి చేసిన ప్రధానోపాధ్యాయులను సర్పంచ్, ఉప సర్పంచ్‌లు శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. విద్యార్థులకు మార్గనిర్దేశం చేస్తూ వారి భవిష్యత్తుకు బాటలు వేస్తున్న ఉపాధ్యాయ బృందాన్ని ఈ సందర్భంగా ప్రత్యే కంగా అభి నందించారు.పాఠశాల కీర్తిని పెంచేలా ప్రతిభ కనబరిచిన విద్యార్థులు రాబోయే రోజుల్లో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సర్పంచ్, ఉపసర్పంచ్ ఆకాంక్షించారు. విద్యార్థుల విజయానికి సహకరించిన ఉపాధ్యాయులు, తల్లిదండ్రులకు వారు కృతజ్ఞతలు తెలిపారు.**



# ఉపాధ్యాయులు విద్యార్థులకు సహ ప్రయాణికులు, సహ అభ్యాసకులుగా మారాలి

**- ఎస్కేయూలో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు**

**అనంతపురము, సెప్టెంబర్ 5:**
**అనంత జనశక్తి న్యూస్**

భారత మాజీ రాష్ట్రపతి, ప్రముఖ విద్యావేత్త డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు.విశ్వవిద్యాలయ ఉపాధ్యాయుల సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి సంఘం అధ్యక్షుడు ప్రొఫెసర్ చిట్టా సురేష్‌కుమార్ అధ్యక్షత వహించారు.ముఖ్య అతిథిగా విశ్వవిద్యాలయ ఉపకులపతి ప్రొఫెసర్ ఎన్.వి.ఆర్. జ్యోతి కుమార్, అతిథులుగా రెక్టర్ ప్రొఫెసర్ బి. అనిత, ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ డి. ఆంజనేయులు, రిజిస్ట్రార్ డాక్టర్ ఈ. రమేష్ బాబు పాల్గొన్నారు. సెప్టెంబర్‌లో పదవీ విరమణ చేసిన గణాంక శాస్త్ర విభాగం ప్రొఫెసర్ కె. పుష్పాంజలిని ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా వీసీ ప్రొఫెసర్ ఎన్.వి.ఆర్. జ్యోతి కుమార్ మాట్లాడుతూ, మారుతున్న కాలానికి అనుగుణంగా ఉపాధ్యాయులు తమ పాత్రను పునర్నిర్వచించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. విద్యార్థులకు కేవలం బోధకులుగా కాకుండా సహ ప్రయాణికులు, సహ అభ్యాసకులుగా వ్యవహరించాలని సూచించారు.ప్రస్తుతం దేశంలో యువత కీలక శక్తిగా ఎదుగుతోందని, విద్యార్థుల అవసరాలు, ఆలోచనా విధానం, మానసిక పరిస్థితులను ఉపాధ్యాయులు అర్థం చేసుకోవాలని అన్నారు. విద్యా అర్హతలు, పరిశ్రమల అవసరాల మధ్య ఉన్న అంతరాన్ని తగ్గించడంలో ఉన్నత విద్యా సంస్థలు కీలక పాత్ర పోషించాల్సి ఉందన్నారు.



**టీచర్ వర్సెస్ ఏఐ కాదు.. టీచర్ విత్ ఏఐ**

కృత్రిమ మేధస్సు విస్తరిస్తున్న ప్రస్తుత పరిస్థితుల్లో ఉపాధ్యాయుల పాత్ర మరింత కీలకమవుతుందని వీసీ పేర్కొన్నారు. "టీచర్ వర్సెస్ ఏఐ కాదు.. టీచర్ విత్ ఏఐ" అనే ఆలోచనతో సాంకేతికతను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ఉపాధ్యాయులు నిరంతరం నేర్చుకునే అభ్యాసకులుగా, విద్యార్థులకు సానుభూతితో కూడిన స్నేహితులుగా, విద్యా వ్యవస్థకు బాధ్యతాయుతమైన నాయకులుగా ఎదగాలని పిలుపునిచ్చారు.ప్రస్తుత తరం విద్యార్థులపై డిజిటల్ మాధ్యమాలు, సామాజిక మాధ్యమాలు చూపుతున్న ప్రభావాన్ని ఉపాధ్యాయులు అర్థం చేసుకోవాలని అన్నారు. సంప్రదాయ బోధనా విధానాలకు మాత్రమే పరిమితం కాకుండా విద్యను మానవ వికాసం, భావోద్వేగ పరిరక్షణ, వాస్తవ జీవిత అనుభవాలతో అనుసంధానించాలని సూచించారు.విద్యార్థులు స్వతంత్రంగా ఆలోచించేలా, తమ లక్ష్యాలను తామే నిర్దేశించుకునేలా ప్రోత్సహించాలని, అందుకు అనుగుణమైన బోధనా విధానాలను మరింతగా అమలు చేయాల్సిన అవసరం ఉందన్నారు.

**ఎస్కేయూ పూర్వ వైభవాన్ని పునరుద్ధరిద్దాం**

శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో అనుభవజ్ఞులైన, ప్రతిభావంతులైన అనేక మంది ఉపాధ్యాయులు ఉన్నారని వీసీ తెలిపారు. వారి సహకారం, నిబద్ధతతో ఎస్కేయూ ఘనమైన వారసత్వాన్ని మరింత ముందుకు తీసుకెళ్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు. త్వరలో నియామక ప్రక్రియ ద్వారా విశ్వవిద్యాలయంలో చేరనున్న యువ ఉపాధ్యాయులతో పాటు ప్రస్తుతం సేవలందిస్తున్న ప్రతి ఒక్కరూ ఇతరులకు ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. ఎస్కేయూ పూర్వ వైభవాన్ని పునరుద్ధరించేందుకు అందరూ కలిసికట్టుగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.

**ప్రొఫెసర్ పుష్పాంజలికి ఘన సన్మానం**

పదవీ విరమణ చేసిన గణాంక శాస్త్ర విభాగం ప్రొఫెసర్ కె. పుష్పాంజలిని విశ్వవిద్యాలయ ఉపాధ్యాయుల సంఘం, అధ్యాపకులు ఘనంగా సన్మానించారు. విశ్వవిద్యాలయానికి ఆమె అందించిన విద్యా సేవలను, విద్యార్థుల అభివృద్ధికి చేసిన కృషిని కొనియాడారు. వీసీ ప్రొఫెసర్ ఎన్.వి.ఆర్. జ్యోతి కుమార్, రెక్టర్ ప్రొఫెసర్ బి. అనిత, ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ డి. ఆంజనేయులు, రిజిస్ట్రార్ డాక్టర్ ఈ. రమేష్‌బాబు తదితరులు ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు. శాలువాలు, పుష్పగుచ్ఛాలు, జ్ఞాపికలతో సత్కరించారు.అనంతరం విశ్వవిద్యాలయ ఇంజినీరింగ్ కళాశాల, విద్యా కళాశాలలో నిర్వహించిన ఉపాధ్యాయ దినోత్సవ కార్యక్రమాల్లోనూ వీసీ పాల్గొని అధ్యాపకులు, బోధనా సిబ్బందికి శుభాకాంక్షలు తెలిపారు.కార్యక్రమంలో విశ్వవిద్యాలయ ప్రజా సంబంధాల అధికారి డాక్టర్ బి. సత్యనారాయణ అతిథులను ఆహ్వానించగా, సంఘం కార్యదర్శి ఎం.వి. శ్రీనివాసన్ వందన సమర్పణ చేశారు. జాతీయ గీతంతో కార్యక్రమం ముగిసింది.

# గురువులను గౌరవించడం నా అదృష్టంగా బావిస్తున్న..ఎమ్మెల్యే అమిలినేని

**- విద్యార్థులను మంచి పౌరులుగా తీర్చిదిద్దే బాధ్యత గురువులదే..**
**- అక్టోబర్ 1 నుంచి 2DA లు, 12వ పీఆర్సీ ఏర్పాటుకు కూటమి ప్రభుత్వం అంగీకారం**
**- ప్రస్తుతం 37.31% రాబోయే రెండు DA ల మొత్తం 40.04 శాతం**
**- ఎస్సార్సీ సహకారంతో 5 కోట్ల రూపాయలతో 7300 సైకిళ్లు విద్యార్థులకు కానుకగా అందిస్తున్నాం**
**- ఘనంగా భారతరత్న, మాజీ రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ 218 జయంతి వేడుకలు**
**- రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన రాఘవేంద్ర గుప్త చిత్రపటానికి పూలమాల సమర్పించి, శ్రద్ధాంజలి ఘటించిన ఎమ్మెల్యే, ఉపాధ్యాయులు**
**- అంగరంగ వైభవంగా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు**
**- 2650 మంది ఉపాధ్యాయ దంపతులకు పట్టువస్త్రాలు అందజేసిన ఎమ్మెల్యే అమిలినేని**
**- ప్రజావేదికలో వేడుకలకు వేలాదిగా తరలివచ్చిన ఉపాధ్యాయ కుటుంబాలు, టీడీపీ నాయకులు**
**- 20మంది విశ్రాంత ఉపాధ్యాయులను పట్టువస్త్రాలు, శాలువా, జ్ఞాపికతో ఘనంగా**



**సన్మానించిన ఎమ్మెల్యే**

**కళ్యాణదుర్గం సెప్టెంబర్ 05 అనంత జనశక్తి న్యూస్**

గురువులను గౌరవించడం మా తల్లిదండ్రుల నుంచే మాకు వచ్చిందని అలాంటిది నేడు ఇంతమంది గురువులను గౌరవించి వారికి పట్టువస్త్రాలు అందించడం నా అదృష్టంగా బావిస్తున్నానని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు పేర్కొన్నారు..నేడు భారతరత్న, మాజీ రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ గారి 218వ జయంతి సందర్బంగా నిర్వహించుకునే ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు అంగరంగ వైభవంగా నిర్వహించి కళ్యాణదుర్గం నియోజకవర్గంలో ఉన్న ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలల ఉపాధయులను వారి దంపతులను దాదాపు 2650 మందికి పట్టువస్త్రాలు అందించగా 20 మంది విశ్రాంత ఉపాధ్యాయులకు పట్టువస్త్రాలు, జ్ఞాపికతో ఘనంగా సన్మానించారు.. కార్యక్రమానికి వేలమంది ఉపాధ్యాయ కుటుంబాలతో పాటు తెలుగుదేశం పార్టీ నాయకులు తరలివచ్చారు..ఈ సందర్బంగా ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు మాట్లాడుతూ ఏ విద్యార్థి అయిన మంచి విద్యను అభ్యసించి అత్యున్నత స్థాయి ఐఏఎస్, ఐపీఎస్ లతో పాటు ఉన్నత ఉద్యోగాలు సాధించేందుకు గురువులు అందించే అత్యుత్తమ విద్యా బోదన, గురువులు అందించే వ్యక్తిత్వమే వారికి మార్గదర్శనం అవుతాయని, అలాంటి గురువులకు విద్యా శాఖమంత్రి నారా లోకేష్ ఉన్నత స్థాయి అందించారని, కేవలం 45 రోజుల్లోనే ఉపాధ్యాయ సంఘాలతో సమన్వయం చేసుకుని ఎలాంటి వివాదాలు కానీ కోర్టు కేసులు కానీ లేకుండా 16,500 ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేసిన ఘనత ఆయనకే దక్కిందని కళ్యాణదుర్గం ప్రాంతంలో కూడా ఎంతో మంది పేద విద్యార్థులకు కోచింగ్ తీసుకోవాలంటే ఇబ్బంది పడతారనే ఉద్దేశ్యంతోనే 1200 విద్యార్థులకు ఉచిత కోచింగ్, మెటీరియల్ తో పాటు భోజన వసతి కూడా కల్పించామని తెలిపారు.రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కి ఉపాధ్యాయుల పట్ల ఉన్న గౌరవంతో ప్రతి సారి పీఆర్సీ, డీఏలు అందించారని అందులో భాగంగానే ఉద్యోగ సంఘాల నాయకులతో జరిపిన చర్చలు కూడా సఫలం అవడంతో నేడు ఉపాధ్యాయులకు వచ్చే నెల అక్టోబర్ 1న 2డీఏలు, 12వ పీఆర్సీ ఏర్పాటుకు అంగీకారం తెలిపిందన్నారు..ప్రస్తుతం 37.31 శాతం డీఏ ఇస్తుండగా రాబోయే రెండు డీఏలతో అది 40.04 శాతం కానుందని, పెంచిన ప్రతి సారి చంద్రబాబు నాయుడు పెంచారు తప్ప మరొకరు పెంచలేదని అది ఉపాధ్యాయుల పట్ల ముఖ్యమంత్రికి ఉన్న చిత్తశుద్ధి అని పేర్కొన్నారు..చుక్క నీరు కూడా దొరకని ప్రకాశం జిల్లాకు వెలిగొండ ప్రాజెక్టు 5300కోట్లు ఖర్చు చేసి నీటిని అందించిన అపర భగీరథుడు చంద్రబాబు నాయుడుని ఆయనకు ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తోడుగా నిలుస్తున్నారని అంతే కాకుండా మన కళ్యాణదుర్గం ప్రాంతం గురించి కూడా చంద్రబాబు నాయుడుకి పూర్తిగా తెలుసు కాబట్టే ఈనాడు మన బీటీపీ ప్రాజెక్టును 2028 నాటికి పూర్తి చేస్తామని ఇరిగేషన్ క్యాలెండర్ కూడా ఇచ్చారని తెలిపారు..నేను ఈ కార్యక్రమం ఏదో ఎన్నికల కోసమో మరొక దానికోసమో చేయడం లేదు మన ప్రాంతం చాలా పేద ప్రాంతం అలాంటి ప్రాంతానికి ఉపాధ్యాయుల సేవలు కూడా అవసరమని గుర్తించి మీ సేవలు, మీ సహకారం ఎప్పుడు ఉండాలనే ఇది చేస్తున్నా..ఎస్సార్సీ ట్రస్ట్ లో నేను ఒక సభ్యుడు చైర్మన్ రాజగోపాల్, వెంకటేష్, మహీధర్, యశ్వంత్ తో పాటు 7000 మంది కష్టంతోనే ఇంత పెద్ద ఎత్తున విద్యార్థులకు కానుకగా 5 కోట్ల రూపాయలతో 7300 సైకిళ్లు అందిస్తున్నాం.సైకిళ్లు తీసుకున్న విద్యార్థుల ఆనందం చూస్తుంటే చాలా సంతోషం వేస్తోందని అన్నారు..టెట్ గురించి చూసుకోవడానికి మా యువ నాయకులు నారా లోకేష్ చూస్తారాని మేము కూడా మిమ్మల్ని దృష్టిలో ఉంచుకుని ఇదే విషయాన్ని ముఖ్యమంత్రి, మంత్రి దృష్టికి తీసుకెళతామని తెలిపారు..అలాగే ఈ పాఠశాలలో కూడా సరైన భవనాలు కానీ, టాయిలెట్లు కానీ లేవని ఒక్కొక్కటి అభివృద్ధి చేసేందుకు కొంచెం సమయం పడుతుందని, శెట్టూరు ఎస్సీ హాస్టల్ లో గోడ కూలి విద్యార్థి మరణించడం బాదాకారం అలాంటివి తిరిగి పునరావృతం కాకుండా చూస్తామని తెలిపారు..

# రైతుల న్యాయపరమైన సమస్యలను పరిష్కరించాలి..

**- కేంద్ర మంత్రికి విన్నవించిన రైతులు విలేకరుల సమావేశంలో భూ యజమానులు ..**

**గాండ్లపెంట, సెప్టెంబర్,5, అనంత జనశక్తి న్యూస్,**

తమిళనాడు ప్రాంతంలో చిరకాలంగా ఉన్నటువంటి రైతుల న్యాయపరమైన సమస్యలను పరిష్కరించాలని మండలంలోని మడుగు వారి గొంది రెవిన్యూ గ్రామంలో సాగు చేస్తున్న భూ యజమానులు కోరుతున్నారు. ఈ సందర్భంగా భూ యజమానులు శనివారం ఏర్పాటుచేసిన పాత్రికేయుల సమావేశంలో మాట్లాడారు. ముఖ్యంగా తమిళనాడు మాజీ పార్లమెంటు సభ్యుడు నరసింహన్ నేతృత్వంలో రెండు రోజుల క్రితం తమిళనాడులోని తెలుగు రైతులు ఎదుర్కొంటున్న న్యాయపరమైన సమస్యలపై పలువురు రైతులు కేంద్ర రవాణా శాఖ మంత్రి నితిన్ గట్కరినీ కలిసి వినతి పత్రం అందజేశారు. వినతి పత్రం అందజేసిన వారిలో రైతులు రవీంద్రనాథ్ రెడ్డి, అరుణ్ రాజన్, మురళి, శ్రీనివాస్ రెడ్డి తదితరులు నరసింహన్ నేతృత్వంలో కేంద్ర మంత్రిని కలిసి రైతులకు సంబంధించిన పలు సమస్యలపై ప్రస్తావించామన్నారు. ముఖ్యంగా ఎస్ టి ఆర్ ఆర్ సర్వీస్ రోడ్డును మంజూరు చేసిన నితిన్ గట్కరిని నరసింహన్ అభినందిస్తూనే ఈ ప్రాంతంలో నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. తమిళనాడు ప్రాంతంలోని హోసూర్ వద్ద కేంద్ర ప్రభుత్వం నిర్మిస్తున్న సాటిలైట్, టౌన్ రింగ్ రోడ్డు వెంట సర్వీస్ రోడ్డు నిర్మించడానికి మాజీ పార్లమెంట్ సభ్యుడు నరసింహ స్వాగతించారు. ఇప్పుడు ప్రజల ఆకాంక్ష మేరకు రహదారి నిర్మాణానికి చొరవ చూపిన, ప్రధానమంత్రి మోడీ,కేంద్ర రవాణా శాఖ మంత్రి, నితిన్ గట్కరిలకు అభినందనలు తెలియజేశారు. ముఖ్యంగా హోసూరు ప్రాంతంలోని ఎస్ టి ఆర్ ఆర్ ప్రభావితమైన రైతులు వెంకట మునియప్ప, రవీంద్రనాథ్ రెడ్డి, మురళి, శ్రీనివాస్ రెడ్డి తదితరులు రవాణా అనుసంధానం, వ్యవసాయ భూములు, రాకపోకల సమస్యలపై కేంద్ర మంత్రి దృష్టికి మాజీ పార్లమెంట్ సభ్యుడు నరసింహ నేతృత్వంలో తీసుకెళ్లినట్లు విలేకరులతో తెలిపారు. అంతేకాకుండా ఇక్కడ సర్వీస్ రోడ్డు వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతుల సమస్యలను కేంద్రం దృష్టికి తీసుకెళ్లి వాటిని పరిష్కరిస్తామని కేంద్రమంత్రి హామీ ఇచ్చినట్లు తెలిపారు. అంతేకాకుండా ఇక్కడ స్థానిక ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను పరిగణలోకి తీసుకొని సర్వీస్ రోడ్డు ఏర్పాటు చేస్తామని కేంద్రమంత్రి నితిన్ గట్కరి ప్రతినిధి బృందానికి హామీ ఇచ్చారన్నారు. అక్కడి రైతులకు కేంద్ర ప్రభుత్వం న్యాయం కల్పించడంతోపాటు, మౌలిక వసతులు కొనసాగించడం, అభివృద్ధి జరగాలన్నారు. అంతేకాకుండా పరిహారం సమస్యను అత్యంత త్వరగా పరిష్కరించేందుకు తమిళనాడు, కేంద్ర ప్రభుత్వాలు కలిసి పని చేయాలని నారసింహన్ కేంద్ర మంత్రికి విజ్ఞప్తి చేసిన విషయాన్ని రైతు నేతృత్వ బృందం తెలియజేసింది..



# ముగిసిన శ్రావణ మాసం పూజలు

**భక్తులతో హోరెత్తిన దేవాలయాలు**

**ఆమడగూరు సెప్టెంబర్ 05 అనంత జనశక్తి న్యూస్**

మండల పరిధిలోని తుమ్మల కొండ శ్రీ వెంకటేశ్వర స్వామి శ్రీ చౌడేశ్వరీ దేవి ఏ కొత్తపల్లి, శ్రీ కోదండరామస్వామి అభయాంజనేయ స్వామి బాయపల్లి వీరాంజనేయ స్వామి బిల్లురు శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి జె కే పల్లి శిరిడి సాయిబాబా మహమ్మదాబాద్ వీరాంజనేయ స్వామి అమడగూరు పంచముఖ ఆంజనేయ స్వామి మామిడి మాకులపల్లి వీరాంజనేయ స్వామి ఆలయంలో శ్రావణ మాసం నాలుగవ శనివారం సందర్భంగా మండల ప్రజలు ఘనంగా పూజలు నిర్వహించారు పూజారులు స్వాముల వారికి నూతన వస్త్రాలు ధరించి అర్చనలు అభిషేకాలు నిర్వహించారు మామిడి మాకుల పల్లి గుండువారిపల్లి గ్రామ ప్రజలు దేవాలయం కు విచ్చేసిన భక్తులకు గ్రామస్తులు ఆధ్వర్యంలో పలువురు అన్నదాన కార్యక్రమంలు భారీగా నిర్వహించారు



# గొర్రెల దొంగలు అరెస్ట్



- ఆరు గొర్రె పిల్లలు, కారు, కత్తి స్వాధీనం

**రాప్తాడు, సెప్టెంబరు 5 అనంత జనశక్తి న్యూస్**

రాప్తాడు పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిన గొర్రెల దొంగతనం కేసులను పోలీసులు ఛేదించారు. ఈ కేసులో ఇద్దరు నిందితులను శనివారం అరెస్టు చేసి, వారి వద్ద నుంచి దొంగిలించిన ఆరు గొర్రె పిల్లలు, దొంగతనానికి ఉపయోగించిన కారు, కత్తిని స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల వివరాల మేరకు.. ఈ నెల 2న లింగనపల్లి గ్రామ పొలిమేరలో, రాప్తాడు మండలం జన్మభూమినగర్ వద్ద గొర్రెల దొంగతనాలు జరిగాయి. దీనిపై రాప్తాడు పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. దర్యాప్తులో అనంతపురం పట్టణంలోని చంద్రబాబునాయుడు కొట్టాలకు చెందిన సాకే శ్రీ సాయి (21), తండ్రి శరత్‌బాబు, కుమ్మెత రవికుమార్‌రెడ్డి (28), తండ్రి లేట్ వీరారెడ్డిలను నిందితులుగా గుర్తించారు.

ఈ మేరకు శనివారం ఇద్దరినీ పోలీసులు అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి దొంగిలించిన ఆరు గొర్రె పిల్లలతో పాటు దొంగతనానికి ఉపయోగించిన కారును, కత్తిని స్వాధీనం చేసుకున్నారు. అనంతరం నిందితులను రిమాండ్ నిమిత్తం కోర్టుకు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

**ప్రధాన నిందితుడి కోసం గాలింపు**

ఈ కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న ధనుంజయ కోసం పోలీసులు ముమ్మరంగా గాలిస్తున్నారు. ధనుంజయ తన ద్విచక్ర వాహనానికి పోలీస్ స్టిక్కర్ వేసుకుని, తాను పోలీసునని ప్రజలు నమ్మే విధంగా వ్యవహరిస్తున్నట్లు పోలీసుల దర్యాప్తులో వెల్లడైనట్లు తెలిపారు. అతడిని త్వరలోనే పట్టుకుంటామని పోలీసులు వెల్లడించారు.

**నిందితులకు నేర చరిత్ర**

అరెస్టయిన ఇద్దరు నిందితులు గతంలోనూ దొంగతనం కేసుల్లో నిందితులుగా ఉన్నారని, వారికి నేర చరిత్ర ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు. కేసును ఛేదించడంలో కీలకంగా పనిచేసిన పోలీసు సిబ్బందిని సీఐ అభినందించారు.

# స్థానిక సంస్థల ఎన్నికల కోసం ఓటర్ల గాలింపు చర్య



**ఆమడగూరు సెప్టెంబర్ 05 అనంత జనశక్తి న్యూస్**

మండల పరిధిలోని గుండువారిపల్లి పంచాయతీ గ్రామంలో శనివారం, ఎంపీడీవో శకుంతల ఆధ్వర్యంలో రాబోవు స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియ కోసం ఏసీ ఎస్టీ బీసీ మైనార్టీ ఓసి కులాల జాబితా ప్రకారం తుది ప్రక్రియ పంపాలని ముఖ్య ఉద్దేశంతో గ్రామసభ నిర్వహించినట్లు ఎంపీడీవో శకుంతల పేర్కొన్నారు తమ పేరు పైన ఐడి కార్డు పేరుకు సంబంధం లేకుండా ఇతర కులాల వారీగా పేరు నమోదు అయినట్లు అయితే వాటిని రికవరీ చేసి సరిదిద్దే కార్యక్రమం జరుగుతుందని గ్రామస్తులు వీటన్నింటిని గమనించి మీ యొక్క సచివాలయాల్లో సంప్రదించాలని మీ పేరు మీ కులము ఓటర్ కార్డు పై సక్రమంగా ఉండే విధంగా తగు చర్యలు తీసుకోవాలని వారు పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మండల కన్వీనర్ గోపాల్ రెడ్డి రాజారెడ్డి ఈఓ ఆర్ డి రాజశేఖర్ పంచాయతీ సెక్రటరీలు వెంకటేష్ నరేంద్ర చంద్ర శేఖర్ మండల ప్రజా పరిషత్ సిబ్బంది గుండువారిపల్లి పంచాయతీ ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు

# సరియా జలపాతంలో యువకుడు మృతి

- సరదా పర్యటన విషాదాంతం.. బీటెక్ విద్యార్థి దుర్మరణం
- సాయంత్రం 5 గంటలకు మృతదేహం లభ్యం..
- ఘటనపై పోలీసులకు సమాచారం



**అనంతగిరి సెప్టెంబర్ 05 అనంత జనశక్తి న్యూస్**

అనంతగిరి మండలంలోని ప్రముఖ పర్యాటక ప్రాంతమైన సరియా జలపాతం మరో యువకుడిని బలితీసుకుంది. విశాఖపట్నానికి చెందిన తాండ్ర ఫణికుమార్ (19) జలపాతంలో పడి మృతి చెందాడు.వివరాల ప్రకారం.. ఫణికుమార్ దువ్వాడ ప్రాంతంలోని విజ్ఞాన్ కళాశాలలో బీటెక్ మూడో సంవత్సరం చదువుతున్నాడు. తన స్నేహితులతో కలిసి సరదాగా గడిపేందుకు సరియా జలపాతానికి వచ్చిన సమయంలో ప్రమాదవశాత్తు జలపాతంలో పడిపోయినట్లు సమాచారం. దీంతో ఫణికుమార్ మృత్యువాత పడ్డాడు.విషయం తెలుసుకున్న జీనాబాడు పంచాయతీ టీడీపీ గ్రామ శాఖ అధ్యక్షుడు జి. సురేష్, జనసేన పంచాయతీ పార్టీ అధ్యక్షుడు లింగబోయిన జమ్మ రాజు హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకున్నారు. స్థానికుల సహాయంతో జలపాతంలో గాలింపు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో సాయంత్రం ఐదు గంటల సమయంలో ఫణికుమార్ మృతదేహం లభ్యమైనట్లు వారు తెలిపారు. ఘటనపై అనంతగిరి ఎస్ఐ శంకరరావుకు సమాచారం అందించినట్లు పేర్కొన్నారు. ఫణికుమార్‌తో పాటు రేవంత్, వై. చైతన్య, ఎస్. శ్రీకాంత్, టి. రోహిత్, ఎస్. రామేశ్వరం తదితర స్నేహితులు సరియా జలపాతానికి వచ్చినట్లు తెలిసింది. ఈ ఘటనతో స్నేహితులు, కుటుంబ సభ్యుల్లో విషాదం నెలకొంది.

**ప్రమాదాల నివారణకు భద్రతా చర్యలు చేపట్టాలి**

సరియా జలపాతం వద్ద గతంలోనూ ప్రమాదాలు చోటుచేసుకున్న నేపథ్యంలో పర్యాటకుల భద్రతపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు. ప్రమాదకర ప్రాంతాలను గుర్తించి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయడంతో పాటు, పర్యాటకుల భద్రతకు అవసరమైన చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

# గుప్తా విద్యా సంస్థల నందు ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం



**అగళి సెప్టెంబర్ 05,అనంత జనశక్తి న్యూస్**

మండల కేంద్రంలో గుప్తా విద్యా సంస్థల నందు సర్వేపల్లి రాధాకృష్ణన్ జన్మదినంను పురస్కరించుకొని గుప్తా విద్యా సంస్థల ఉపాధ్యాయ బృందం విద్యార్థుల సమక్షంలో ఉపాధ్యాయ దినోత్సవంను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ ఉపాధ్యాయ దినోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిలుగా గుప్తా విద్యా సంస్థల కార్యదర్శి శ్రీనివాస్ మూర్తి, కో ఆర్డినేటర్ శివప్ప పాల్గొన్నారు. ఈ సందర్భంగా గుప్తా విద్యా సంస్థల కార్యదర్శి శ్రీనివాస్ మూర్తి మాట్లాడుతూ సర్వేపల్లి రాధాకృష్ణన్ రాష్ట్రపతి స్థానంలో కంటే ఉపాధ్యాయ వృత్తిలో ఎక్కువ సంతృప్తి లభిస్తుందన్నారు. ఉపాధ్యాయ వృత్తి అన్ని వృత్తుల్లో ఉన్నవారికి నాంది పలికే ఏకైక వృత్తి అని కొనియాడారు, గుప్తా విద్యా సంస్థల కో ఆర్డినేటర్ శివప్ప మాట్లాడుతూ ఏ వృత్తిలో ఉన్నవారికైనా ఖచ్చితంగా గురువు ఉంటారని ,మనకు మొదటి గురువు అమ్మ, తల్లి వడిలోనే మొదటి విద్యాభ్యాసం జరుగుతుందని, తర్వాత గురువు నాన్న అని,ఆయనజీవిత విషయాలను,గమ్యాలను ఏర్పరుస్తారని తదుపరి గురువు ఉపాధ్యాయుడు అని, విద్యార్థుల భవిష్యత్తు కొరకు అనునిత్యం నేర్చుకుంటూ,నేర్పిస్తూ వారి బంగారు భవితకు బాటలు వేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రఘురాం, హెడ్ మాస్టర్ గిరిజ, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు

# నవంబర్ 27 అంతర్జాతీయ బాల్య వివాహాల నిర్మూలన దినోత్సవం

**- - ఫలించిన భారత్ పోరాటం**

బాల్య వివాహాల నిర్మూలన కోసం భారత్ చేస్తున్న పోరాటం ఎట్టకేలకు ఫలించింది. మొత్తానికి భారత్ పోరాటానికి అంతర్జాతీయ స్థాయిలో కీలక గుర్తింపు లభించింది. నవంబర్ 27న 'బాల్య, ముందస్తు, బలవంతపు వివాహాల నిర్మూలన అంతర్జాతీయ దినోత్సవం'గా ఐక్యరాజ్యసమితి ప్రకటించింది. బాల్య వివాహాలకు వ్యతిరేకంగా భారత్‌లో కొనసాగుతున్న ఉద్యమానికి ఇది ప్రపంచవ్యాప్త మద్దతుగా భావిస్తున్నారు. జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్ సంస్థ 2023 నుంచి 'చైల్డ్ మ్యారేజ్ ఫ్రీ ఇండియా' ప్రచారాన్ని నిర్వహిస్తున్నాయి. బాల్య వివాహాలను అరికట్టేందుకు ప్రజల్లో అవగాహన కల్పించడం, ప్రభుత్వాలు, సమాజాన్ని కార్యాచరణ వైపు నడిపించడం ఈ ప్రచారం ప్రధాన లక్ష్యంగా కొనసాగుతోంది.

బాల్య వివాహాల నిర్మూలన కోసం ప్రత్యేక అంతర్జాతీయ దినోత్సవాన్ని ఏర్పాటు చేయాలని జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్ వ్యవస్థాపకుడు భువన్ రిభు ఐక్యరాజ్యసమితికి ప్రతిపాదించారు. ఆ ప్రతిపాదనపై సియెర్రా లియోన్ సెప్టెంబర్ 4న ఐక్యరాజ్యసమితిలో తీర్మానాన్ని ప్రవేశపెట్టింది. అనంతరం ఆ తీర్మానానికి ఆమోదం లభించింది. నవంబర్ 27 తేదీకి భారత్‌కు ప్రత్యేక ప్రాధాన్యం ఉంది. 2024 నవంబర్ 27న భారత ప్రభుత్వం 'బాల్ వివాహ్ ముక్త్ భారత్' ప్రచారాన్ని ప్రారంభించింది. అదే రోజును ఇప్పుడు ఐక్యరాజ్యసమితి అంతర్జాతీయ దినోత్సవంగా గుర్తించడం విశేషం.

ఐక్యరాజ్యసమితి తీర్మానాన్ని స్వాగతించిన భువన్ రిభు.. ఇది ప్రతి భారతీయుడికి గర్వకారణమైన రోజని అన్నారు. తీర్మానం ఆమోదించే సమయంలో ఐక్యరాజ్యసమితికి ఆహ్వానించిన ఏకైక పౌర సమాజ ప్రతినిధి తానేనని తెలిపారు. 2024 నవంబర్ 27న బాల్య వివాహాలకు వ్యతిరేకంగా భారత్‌లో చేపట్టిన ప్రచారంలో 25 కోట్ల మందికి పైగా ప్రజలు ప్రతిజ్ఞ చేశారని రిభు పేర్కొన్నారు. పిల్లలు, స్థానిక సమాజాల నుంచి ప్రారంభమైన ఈ ఉద్యమానికి ప్రభుత్వం మద్దతు ఇచ్చి విస్తరించిందని చెప్పారు. బాల్య వివాహాల నిర్మూలన కోసం ప్రపంచవ్యాప్తంగా ప్రభుత్వాలు నిర్ణయాత్మక నాయకత్వం వహించాల్సిన సమయం వచ్చిందని ఆయన అన్నారు. 2030 నాటికి బాల్య వివాహాలను పూర్తిగా అంతం చేయడంతో పాటు ప్రతి చిన్నారికి విద్య, రక్షణ, అభివృద్ధి అవకాశాలు కల్పించాలని పిలుపునిచ్చారు.



**భారత్‌లో తగ్గుతున్న బాల్య వివాహాలు**

దేశంలో బాల్య వివాహాల శాతం క్రమంగా తగ్గుతున్నట్లు జాతీయ స్థాయి గణాంకాలు వెల్లడిస్తున్నాయి. 201921 నేషనల్ ఫ్యామిలీ హెల్త్ సర్వే ప్రకారం.. 2024 ఏళ్ల వయసున్న మహిళల్లో 23.3 శాతం మంది 18 ఏళ్లలోపే వివాహం చేసుకున్నారు. అదే NFHS6 (202324)లో ఈ శాతం 20.1కి తగ్గింది. బాల్య వివాహాల నిర్మూలనలో దేశంలో జరుగుతున్న ప్రయత్నాల ప్రభావాన్ని ఈ గణాంకాలు ప్రతిబింబిస్తున్నాయని భావిస్తున్నారు.

**2026 నాటికి 10 శాతం తగ్గించడమే లక్ష్యం**

భారత ప్రభుత్వం 2026 నాటికి దేశంలో బాల్య వివాహాల ప్రాబల్యాన్ని 10 శాతం తగ్గించాలని లక్ష్యంగా పెట్టుకుంది. ప్రపంచవ్యాప్తంగా 2030 నాటికి బాల్య వివాహాలను నిర్మూలించాలన్న లక్ష్యం ఐక్యరాజ్యసమితి సస్టెనబుల్ డెవలప్‌మెంట్ గోల్ 5 (లింగ సమానత్వం)లోని టార్గెట్ 5.3తో అనుసంధానమై ఉంది. బాల్య, ముందస్తు, బలవంతపు వివాహాలతో పాటు అన్ని రకాల హానికరమైన ఆచారాలను నిర్మూలించడం ఈ లక్ష్యంలో భాగం.

# ఒకేసారి రెండు డీఏలు

(మొదటి పేజీ తరువాయి)

సీఎం చంద్రబాబుతో ఉద్యోగ సంఘాల సమావేశం మంచి వాతావరణంలో జరిగిందని సూర్యనారాయణ తెలిపారు. పీఆర్సీతో పాటు రెండు డీఏలు, ఒక ఏడాది సరెండర్ లీవ్‌లు, రిటైరైనవారికి అడిషనల్ క్వాంటం ఆఫ్ పెన్షన్ రీస్టోరేషన్, ఈహెచ్ఎస్ బకాయిలు ప్రతి నెలా ఒకటో తేదీన ట్రస్ట్‌కి చెల్లింపు తదితర సమస్యల పరిష్కారానికి సీఎం హామీ ఇచ్చారన్నారు. ఉద్యోగుల పట్ల సానుకూలంగా ఉండాలని తాము కోరామని సూర్యనారాయణ తెలిపారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దృష్ట్యా ఐఆర్ విషయంపై కొంత సమయం ఇవ్వాలని సీఎం చెప్పారన్నారు.అనంతరం ఏపీ ఎన్జీవో రాష్ట్ర అధ్యక్షుడు విద్యాసాగర్ మాట్లాడుతూ సానుకూల వాతావరణంలో సీఎంతో చర్చలు జరిగాయన్నారు. పొరుగు సేవల సిబ్బందిని ప్రభుత్వ పథకాల్లో లబ్ధిదారులుగా చేర్చాలని, గ్రామ సచివాలయ సిబ్బందికి నోషనల్ ఇక్రిమెంట్ ఇవ్వాలని కోరామన్నారు. సీఎం ప్రకటనపై ఉద్యోగ సంఘాల నేతలు సంతృప్తి వ్యక్తం చేశారు.




# భారీగా సన్నబడ్డ పప్పు యాదవ్

**అమరావతి సెప్టెంబర్ 05 అనంత జనశక్తి న్యూస్**

పప్పు యాదవ్.. స్వతంత్ర ఎంపీ. బీహార్‌లోని పూర్నియా లోక్‌సభ నియోజకవర్గం నుంచి ఇండిపెండెంట్‌గా గెలుపొందారు. కాంగ్రెస్‌తో కలిసి తిరుగుతుంటారు. అయితే పప్పు యాదవ్ గురించి ఇప్పుడెందుకు అంటారా? అయితే ఈ వార్త చదవాల్సిందే. పప్పు యాదవ్.. ఎంత పెద్ద భారీకాయమో చూసినోళ్లందరికీ తెలిసిందే. సరిగ్గా నడవడం కూడా చేతకాని స్థితిలో భారీ స్థూలకాయం కలిగి ఉంటారు. అలాంటిది ఇప్పుడు గుర్తుపట్టలేనంతగా మారిపోయారు. భారీకాయం నుంచి స్లిమ్‌గా మారిపోయారు. ప్రస్తుతం సోషల్ మీడియాలో ట్రెండింగ్ అవుతున్న వీడియో చూస్తే.. ఎవరికైనా డౌట్ వస్తుంది. పప్పు యాదవేనా? లేదంటే ఇంకెవరైనానా అన్న అనుమానం కలుగుతుంది. అంతగా సన్నబడ్డారు. వీడియో చూసిన వాళ్లంతా నోరెళ్లబెడుతున్నారు. ఇంతగా ఎలా సన్నబడ్డారంటూ నెటిజన్లు చర్చించుకుంటున్నారు. శనివారం సీజేపీ కార్యకర్త నిషు ఆజాద్‌కు సంబంధించిన కేసుపై పప్పు యాదవ్ మీడియాతో మాట్లాడారు. అయితే ఆయన చేసిన వ్యాఖ్యల కంటే.. ఆయనలో కనిపించిన భారీ బరువు తగ్గుదలే నెటిజన్ల దృష్టిని ఆకర్షించింది. శారీరక మార్పుపై సోషల్ మీడియాలో పలువురు చర్చించుకుంటున్నారు. ఆయనను గుర్తుపట్టలేకపోయామని కొందరు యూజర్లు పేర్కొన్నారు. ఇంకొందరు ఇందులో పప్పు యాదవ్ ఎక్కడున్నారంటూ వ్యాఖ్యానించారు.




ఇది ఫేక్ న్యూస్ అని కొట్టిపారేశారు. అయితే పప్పు యాదవ్ బరువు తగ్గడానికి కారణం ఏమిటన్న దానిపై ఆయన నుంచి గానీ, ఆయన కార్యాలయం నుంచి గానీ ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. దీంతో సోషల్ మీడియాలో విస్తృతంగా చర్చ జరుగుతోంది. ఈ మార్పుపై పప్పు యాదవ్ స్వయంగా స్పందిస్తారా లేదా అన్నది ఆసక్తికరంగా మారింది.

# కాంగ్రెస్ సంబరాలు దేని కోసం?

(మొదటి పేజీ తరువాయి)

కుంభకోణాల మయంగా మారిన ప్రభుత్వం కాంగ్రెస్ అంటూ మాజీ మంత్రి విమర్శించారు. రేవంత్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తే.. కేసీఆర్ రాజీనామా చేయాలంటున్నారని మండిపడ్డారు. రాజీనామా చేయాల్సింది కేసీఆర్ కాదు రేవంత్ రెడ్డి అని అన్నారు. అసెంబ్లీలో అనుసరించాల్సిన వ్యూహంపై బీఆర్ఎస్ఎల్పీలో అధినేత కేసీఆర్ దిశానిర్దేశం చేస్తారని హరీశ్ రావు వెల్లడించారు.

# వికలాంగులు, ఓసీ, బీసీ కోటాల్లోనూ అక్రమాలు

- స్పోర్ట్స్ కోటానే కాదు మరిన్ని అక్రమాలు
- డీఎస్సీపై పేర్ని నాని సంచలన వ్యాఖ్యలు

**అమరావతి సెప్టెంబర్ 05 అనంత జనశక్తి న్యూస్**

డీఎస్సీ నియామకాల్లో అక్రమాలు జరుగుతున్నాయని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, మాజీ మంత్రి పేర్ని నాని తీవ్ర ఆరోపణలు చేశారు. ఏ రంగంలో దొంగలు ఉన్నా జరిగే నష్టం కంటే.. గురువుల్లో అక్రమాలకు పాల్పడేవారు ఉంటే నష్టం మరింత ఎక్కువగా ఉంటుందని అన్నారు. ఉపాధ్యాయుల్లో అక్రమాలు జరిగితే భవిష్యత్తు సమాజానికే ప్రమాదమని వ్యాఖ్యానించారు. విద్యాశాఖను మంత్రి నారా లోకేష్ కావాలనే తీసుకున్నారని, విద్యావ్యవస్థలో అక్రమాలకు పాల్పడే వారిని ప్రోత్సహించారని పేర్ని నాని ఆరోపించారు. స్కామ్‌లు చేసి డబ్బులు సంపాదించేందుకే విద్యాశాఖను తీసుకున్నారని విమర్శించారు. ఉపాధ్యాయులు ఎన్నికల విధుల్లో పాల్గొంటారనే కారణంతో తమకు అనుకూలమైన వారిని టీచర్లుగా నియమించారని ఆరోపించారు.

అన్ని శాఖల్లోనూ లోకేష్ పెత్తనం కొనసాగుతోందని, రాష్ట్రంలో సంపాదించిన డబ్బును విదేశాల్లో దాచుకుంటున్నారని పేర్ని నాని ఆరోపించారు. లోకేష్ నెలకోసారి విదేశాలకు ఎందుకు వెళ్తున్నారని ప్రశ్నించారు. తనతో చర్చకు వస్తానని సవాల్ చేసిన లోకేష్.. తాను ఆధారాలతో వస్తుంటే చర్చ నుంచి తప్పించుకుంటున్నారని విమర్శించారు. డీఎస్సీ స్కామ్‌కు సంబంధించిన సాక్ష్యాలు, ఆధారాలు ఒక్కొక్కటిగా బయటకు వస్తున్నాయని పేర్ని నాని అన్నారు. నిన్నటి వరకు ప్రగల్భాలు పలికిన లోకేష్ ఇప్పుడు ఎక్కడ ఉన్నారని ప్రశ్నించారు. 'డీఎస్సీ అంటే టీడీపీ' అని గతంలో చెప్పారని, ఇప్పుడు జరుగుతున్న పరిణామాలే మీ డీఎస్సీనా అని నిలదీశారు. స్పోర్ట్స్ కోటాలోనే కాకుండా వికలాంగుల కోటాలోనూ అక్రమాలు జరిగాయని ఆరోపించారు. ఓసీ, బీసీ కేటగిరీల్లోనూ అవకతవకలు చోటుచేసుకున్నాయని చెప్పారు. దొంగ సర్టిఫికెట్లు సృష్టించి ఉద్యోగాలు ఇచ్చారని, పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించని వారికి కూడా ఉద్యోగాలు ఎలా ఇచ్చారని ప్రశ్నించారు.

**పదుల సంఖ్యలో ఫేక్ టీచర్లు?**

ఒక్కరు, ఇద్దరు కాకుండా పదుల సంఖ్యలో నకిలీ ఉపాధ్యాయులు బయటపడుతున్నారని పేర్ని నాని పేర్కొన్నారు. ఈ వ్యవహారంపై ఇక చర్చలతో కాలయాపన చేయకుండా సమగ్ర విచారణ జరగాల్సిందేనని డిమాండ్ చేశారు. ఆధారాలతో అక్రమాలు బయటపడిన తర్వాత కూడా చర్చలు ఎందుకని ప్రశ్నించారు.



అంతేకాదు.. విద్యాశాఖ మంత్రి లోకేష్ తక్షణమే రాజీనామా చేయాలని పేర్ని నాని డిమాండ్ చేశారు. డీఎస్సీ వ్యవహారంపై సీబీఐ విచారణకు ఆదేశించాలని కోరారు. చర్చల అంకం ముగిసిందని, ఇక విచారణ జరగాల్సిందేనని స్పష్టం చేశారు. లోకేష్ రాజీనామా, సీబీఐ విచారణ.. ఈ రెండు డిమాండ్లు నెరవేరే వరకు తమ ఉద్యమం ఆగదని పేర్ని నాని హెచ్చరించారు.

# ప్రిన్సిపల్ రవికుమార్‌కు రాష్ట్రస్థాయి ఉత్తమ పురస్కారం



- ఉపాధ్యాయ దినోత్సవ వేడుకల్లో పురస్కారం అందజేత
- విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకే నా అంకితభావం
- ఉత్తమ అవార్డు గ్రహీత,ప్రిన్సిపల్ రవికుమార్

**నాగార్జునసాగర్,సెప్టెంబర్ 5 అనంత జనశక్తి న్యూస్**

ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం కొడంగల్‌లో నిర్వహించిన అధికారిక వేడుకల్లో నాగార్జునసాగర్ మహాత్మ జ్యోతిబాపూలే బీసీ గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ రవికుమార్ రాష్ట్రస్థాయి ఉత్తమ ప్రిన్సిపాల్ అవార్డును అందుకున్నారు,మహాత్మ జ్యోతిబా పూలే బీసీ గురుకుల విద్యాలయాల సంస్థ విభాగం నుంచి రాష్ట్రవ్యాప్తంగా మొత్తం పది మంది ప్రిన్సిపల్ లు ఈ ఉత్తమ అవార్డుకు ఎంపిక కాగా, అందులో సాగర్ బీసీ గురుకుల విద్యాలయ ప్రిన్సిపల్ రవికుమార్ ఒకరుగా నిలిచారు,కొడంగల్‌లో జరిగిన కార్యక్రమంలో విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ యోగితా రాణా మరియు మహాత్మ జ్యోతిబాపూలే గురుకుల విద్యాలయాల సంస్థ కార్యదర్శి సైదులు చేతుల మీదుగా ఆయన ఈ పురస్కారాన్ని ఘనంగా అందుకున్నారు,విద్యా రంగంలో ప్రిన్సిపల్ రవికుమార్ ప్రతిభను గుర్తించి రాష్ట్రస్థాయి అవార్డు వరించడం పట్ల ఆర్సీఓ స్వప్నతో పాటు పాఠశాల ఉపాధ్యాయులు,సిబ్బంది హర్షం వ్యక్తం చేస్తూ ప్రత్యేక అభినందనలు తెలిపారు.ఈ సందర్భంగా ప్రిన్సిపల్ రవికుమార్ మాట్లాడుతూ ఈ ఉపాధ్యాయ దినోత్సవం తన జీవితంలో ఎంతో ప్రత్యేకమైనదని పేర్కొన్నారు,పిల్లల జీవితాల్లో వెలుగులు నింపేందుకు భవిష్యత్తులో రెట్టింపు ఉత్సాహంతో పనిచేయడానికి ఈ పురస్కారం ఎంతగానో దోహదపడుతుందని తెలిపారు,అనంతరం ఉమ్మడి నల్గొండ జిల్లా ఆర్సీఓ స్వప్న మరియు నల్గొండ జిల్లా డీసీఓ సంధ్యలకు తన హృదయ పూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు.

# ఓటర్ల ధృవ పత్రాల పరిశీలన వేగవంతం చేయాలి



- మేడ్చల్ జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి.

**హైదరాబాద్ సెప్టెంబర్ 05 అనంత జనశక్తి న్యూస్**

ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ 2026లో నోటీసుల జారీ అనంతరం సంబంధిత ఓటర్ల నుండి స్వీకరిస్తున్న ధ్రువపత్రాల పరిశీలన ప్రక్రియ వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి స్పష్టం చేశారు.శనివారం మేడ్చల్ జిల్లాలోని అంతాయిపల్లి, ఉప్పరపల్లి గ్రామంలోని పోలింగ్ స్టేషన్ లను ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ 2026లో భాగంగా ఆయన సందర్శించారు. ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ-2026లో హియరింగ్ ప్రక్రియ వేగవంతం చేయాలని కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి తెలిపారు. ఈ క్రమంలో జిల్లాలో మ్యాప్పింగ్ జరగకుండా ఉన్న ఓటర్లు, ఓటర కార్డ్ లో ఉన్న వ్యత్యాసల కేటగిరీల ఓటర్లకు జారీ చేసిన నోటీసులకు సంబంధించి ఓటర్లు అందిస్తున్న ధ్రువపత్రాల విచారణ వేగవంతం చేయాలన్నారు.అర్హత గల ప్రతి ఒక్కరు ఓటరు జాబితాలో ఉండేలా చూడాలని తెలిపారు. జాబితాలో గల ఓటర్లు తమ వివరాలను సమర్పించేలా రాజకీయ పార్టీలు బూత్ స్థాయి ఏజెంట్ల ద్వారా చర్యలు తీసుకోవాలన్నారు. ఎస్.ఐ.ఆర్.-2026 ప్రక్రియను పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించేందుకు సహకరించాలని కలెక్టర్ తెలిపారు. కొత్తగా నమోదు చేసుకునే ఓటర్లు ఫారం -6, చిరునామా మార్పు కోసం ఫారం - 7 , మరణించిన/శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు తరలిపోయిన ఓటర్లు ఫారం - 8 ఓటర్లకు అందచేసి, అవగాహన కల్పిస్తూ ఈ ప్రక్రియను తొందరగా పూర్తి చేయాలని ఆదేశించారు.ధ్రువపత్రాలను ధృవీకరించిన అనంతరము సంబందిత పత్రాలను అప్లోడ్ చేయాలని అన్నారు.ఈ కార్యక్రమంలో కీసర ఆర్డిఓ వెంకటరెడ్డి, ఏఈఆర్ఓ మధుసూదన్ రెడ్డి ,బిఎల్ఓలు,సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# ఘనంగా ఎస్ఐ రఘుబాబు పుట్టినరోజు వేడుకలు

- కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపిన ఏఎస్ఐలు,సిబ్బంది

**నాగార్జునసాగర్ సెప్టెంబర్ 5 అనంత జనశక్తి న్యూస్**

నాగార్జునసాగర్ ప్రాజెక్ట్ స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ ఎస్ఐ రఘుబాబు పుట్టినరోజు వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు,స్థానిక పైలాన్ కాలనీ పిల్లర్ వద్ద ఎస్పీఎఫ్ ఏఎస్ఐ పుల్లయ్య ఆధ్వర్యంలో ఈ వేడుకలను అత్యంత ఉత్సాహంగా నిర్వహించారు

ఈ సందర్భంగా ఏఎస్ఐలు పుల్లయ్య, మహమూద్ అలీలు ఎస్ఐ రఘుబాబును ఘనంగా సత్కరించి, కేక్ కట్ చేసి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు.విధి నిర్వహణలో నిబద్ధతతో పనిచేస్తూ అందరి మన్ననలు పొందుతున్న రఘుబాబు మరిన్ని పుట్టినరోజులు జరుపుకోవాలని,ఉత్తమ భవిష్యత్తు ఉండాలని ఆకాంక్షించారు,అనంతరం ఈ వేడుకల్లో భాగంగా ఘనంగా స్వీట్లు పంచుకుని సంతోషం పంచుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పీఎఫ్ సిబ్బంది అందరికీ ప్రత్యేకంగా భోజనం వసతి కార్యక్రమాలను కూడా ఘనంగా నిర్వహించారు,ఈ కార్యక్రమంలో పలువురు ఎస్పీఎఫ్ సిబ్బంది,పాల్గొని ఎస్సైకి పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు.



# సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి

- ప్రతి గణేష్ మండపంలో సైబర్ అవగాహన పోస్టర్లు ఏర్పాటు చేయాలి: కలెక్టర్ ఖుష్బూ గుప్తా, ఎస్పీ జానకి

**మహబూబ్‌నగర్, సెప్టెంబర్ 5 ,అనంత జనశక్తి న్యూస్**

సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా సూచించారు. శనివారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో వినాయక చవితి ఉత్సవాల నిర్వహణపై జరిగిన జిల్లా స్థాయి శాంతి కమిటీ సమావేశంలో జిల్లా ఎస్పీ దరావత్ జానకితో కలిసి ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఆధ్వర్యంలో రూపొందించిన వినాయక చవితి ప్రత్యేక సైబర్ అవగాహన పోస్టర్‌ను కలెక్టర్, ఎస్పీ ఆవిష్కరించారు. సైబర్ నేరాలపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని కలెక్టర్ పేర్కొన్నారు.జిల్లా ఎస్పీ దరావత్ జానకి మాట్లాడుతూ సైబర్ నేరగాళ్లు రోజురోజుకూ కొత్త పద్ధతుల్లో మోసాలకు పాల్పడుతున్నారని తెలిపారు. అపరిచిత లింకులు, అనుమానాస్పద ఫోన్ కాల్స్, మెసేజ్‌లు, నకిలీ ప్రకటనలు, ఇతర ఆన్‌లైన్ మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

వినాయక చవితి సందర్భంగా గణేష్ మండపాలను పెద్ద సంఖ్యలో భక్తులు సందర్శించే అవకాశం ఉన్నందున, ఈ వేదికలను సైబర్ నేరాలపై అవగాహన కల్పించేందుకు వినియోగించుకోవాలని ఎస్పీ సూచించారు. తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో విడుదల చేసిన సైబర్ భద్రతా సూచనల పోస్టర్లను జిల్లాలోని ప్రతి గణేష్ మండపంలో ఏర్పాటు చేయాలని ఉత్సవ కమిటీ నిర్వాహకులను కోరారు.

ప్రతి మండపంలో పోస్టర్లు ఏర్పాటు చేయడం ద్వారా భక్తులకు సైబర్ మోసాలపై అవగాహన పెరిగి, ఆన్‌లైన్ మోసాలకు గురికాకుండా అవసరమైన జాగ్రత్తలు తీసుకునే అవకాశం ఉంటుందని ఎస్పీ తెలిపారు. ఎవరైనా సైబర్ మోసానికి గురైతే వెంటనే ఆలస్యం చేయకుండా 1930 టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు.

**కలెక్టర్ కార్యాలయంలో మొక్కలు నాటిన కలెక్టర్, ఎస్పీ:**

అనంతరం జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా, జిల్లా ఎస్పీ జానకి, ఇతర అధికారులు కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలో పర్యావరణ పరిరక్షణలో భాగంగా మొక్కలు నాటారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. మొక్కలు నాటడమే కాకుండా వాటిని సంరక్షించడం కూడా ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. పచ్చదనం పెంపొందించడం ద్వారా పరిశుభ్రమైన, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని భవిష్యత్ తరాలకు అందించవచ్చని తెలిపారు. ప్రతి ఒక్కరూ తమ పరిసరాల్లో మొక్కలు నాటి వాటి సంరక్షణకు బాధ్యత తీసుకోవాలని పిలుపునిచ్చారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్, డీఆర్ఓ ఏ.నిర్మలతో పాటు కలెక్టర్ కార్యాలయ సిబ్బంది కూడా మొక్కలు నాటారు.

వినాయక చవితి ఉత్సవాలను శాంతియుతంగా నిర్వహించడంతో పాటు ప్రజల భద్రత, సైబర్ భద్రత, పర్యావరణ పరిరక్షణపై ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని కలెక్టర్, ఎస్పీ కోరారు."శాంతియుత వినాయక చవితి - సైబర్ సురక్షిత సమాజం - పచ్చని పర్యావరణం" లక్ష్యంగా అన్ని శాఖలు, ఉత్సవ కమిటీలు, ప్రజలు సమన్వయంతో పనిచేయాలని వారు పిలుపునిచ్చారు.



# సంబరాలు చేసుకోవడం తప్ప ప్రజలకు ఏమి అభివృద్ధి చేశారో చెప్పాలి

- ఇచ్చిన హామీలు అమలు చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం సంబరాలు చేసుకోవడం మా....
- కాంగ్రెస్ 1000 రోజుల విఫల పాలనపై బీఆర్ఎస్ నిరసన
- యువతకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్
- మాన్ సాన్ పల్లి చౌరస్తాలో ధూమ్‌ధామ్ కార్యక్రమం
- తెలంగాణ రాష్ట్ర యువ నాయకుడు పట్లోళ్ల కౌశిక్ రెడ్డి

**మహేశ్వరం,సెప్టెంబర్ 05,(అనంత జన శక్తి )**



సంబరాలు చేసుకోవడం తప్ప ప్రజలకు ఏమి అభివృద్ధి చేశారో చెప్పాలని తెలంగాణ రాష్ట్ర యువ నాయకుడు పట్లోళ్ల కౌశిక్ రెడ్డి అన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 1000 రోజులు పూర్తవుతున్నా ఎన్నికల సమయంలో యువతకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా మోసం చేస్తోందని ఆరోపిస్తూ బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో మహేశ్వరం మండలంలో భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు. మాజీ మంత్రి, డిప్యూటీ ఫ్లోర్ లీడర్, మహేశ్వరం నియోజకవర్గ శాసనసభ్యురాలు పి. సబితా ఇంద్రారెడ్డి ఆదేశాల మేరకు, యూత్ డిక్లరేషన్ పేరుతో కాంగ్రెస్ ఇచ్చిన హామీల అమలులో వైఫల్యాన్ని నిరసిస్తూ ఈ కార్యక్రమాన్ని చేపట్టారు.మహేశ్వరం మండల పరిధిలోని మాన్ సాన్ పల్లి చౌరస్తాలో మండల బీఆర్ఎస్ పార్టీ యూత్ అధ్యక్షుడు మర్యాద రాఘవేందర్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర యువ నాయకుడు పట్లోళ్ల కౌశిక్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వివిధ గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో తరలివచ్చిన బీఆర్ఎస్ యువ నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ నిరసన తెలిపారు. అనంతరం ధూమ్‌ధామ్ కార్యక్రమంతో తమ నిరసనను వ్యక్తం చేశారు.

**హామీలు ఎక్కడ? అమలు ఎప్పుడు?**

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి ముందు యువతకు ఇచ్చిన యూత్ డిక్లరేషన్‌లో 2 లక్షల ఉద్యోగాలు, నెలకు రూ.4 వేల నిరుద్యోగ భృతి, విద్యార్థులకు స్కూటీలు, ఫీజు రీయింబర్స్‌మెంట్, విద్యా భరోసా కార్డులు వంటి హామీలు ఇచ్చిందని బీఆర్ఎస్ నాయకులు గుర్తు చేశారు. ప్రభుత్వం 1000 రోజుల పాలన పూర్తి చేసుకున్నా ఈ హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయలేదని వారు విమర్శించారు. "ఎన్నికల ముందు హామీలు.. అధికారంలోకి వచ్చాక మౌనం.. యువతను మోసం చేయడమే కాంగ్రెస్ పాలనకు నిదర్శనం" అని బీఆర్ఎస్ నాయకులు మండిపడ్డారు. యువత, నిరుద్యోగులు, విద్యార్థుల సమస్యలపై ప్రభుత్వం తక్షణమే స్పందించి ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు.

**420 హామీల అమలుపై నిలదీత**

కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని ఆరోపిస్తూ బీఆర్ఎస్ నాయకులు "1000 రోజుల పాలన.. 420 హామీల మోసం" అంటూ నినాదాలు చేశారు. యువత భవిష్యత్తుతో చెలగాటమాడే విధానాలను విడనాడి, ఉద్యోగాల భర్తీ, నిరుద్యోగ భృతి, విద్యార్థుల సంక్షేమంపై ప్రభుత్వం స్పష్టమైన కార్యాచరణ ప్రకటించాలని కోరారు.ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ.. "యువతకు ఇచ్చిన హామీలను కాగితాలకే పరిమితం చేస్తే ప్రజాక్షేత్రంలో ప్రశ్నిస్తాం.. హక్కుల కోసం పోరాడుతాం" అని స్పష్టం చేశారు. యువత భవిష్యత్తు కోసం బీఆర్ఎస్ నిరంతరం పోరాడుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో మహేశ్వరం మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు, మహేశ్వరం మండల పీఏసీఎస్ చైర్మన్, వైస్ చైర్మన్, డైరెక్టర్లు, మాజీ కోఆప్షన్ సభ్యులు, సీనియర్ నాయకులు, సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, వివిధ విభాగాల అధ్యక్షులు, కార్యవర్గ సభ్యులు, యువ నాయకులు, బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రశాంత వినాయక చవితికి పకడ్బందీ ఏర్పాట్లు

- అన్ని శాఖలు సమన్వయంతో ముందస్తు చర్యలు పూర్తి చేయాలి: కలెక్టర్ ఖుష్బూ గుప్తా
- నిబంధనలు పాటిస్తూ ఉత్సవాలు నిర్వహించాలి: ఎస్పీ జానకి

**మహబూబ్‌నగర్, సెప్టెంబర్ 5 , అనంత జనశక్తి న్యూస్**



వినాయక చవితి ఉత్సవాలను ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా సురక్షితంగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, ఉత్సవ కమిటీలు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా ఆదేశించారు.

శనివారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన జిల్లా స్థాయి శాంతి కమిటీ సమావేశంలో కలెక్టర్ ఖుష్బూ గుప్తా, జిల్లా ఎస్పీ దరావత్ జానకితో కలిసి పాల్గొన్నారు. వినాయక చవితి ఉత్సవాలు, నిమజ్జన కార్యక్రమాల సందర్భంగా చేపట్టాల్సిన భద్రత, పారిశుధ్యం, విద్యుత్, వైద్య, అగ్నిమాపక, తాగునీరు, ట్రాఫిక్ నియంత్రణ తదితర ఏర్పాట్లపై సమగ్రంగా సమీక్షించారు.

మహబూబ్‌నగర్‌లో ప్రతి ఏడాది సుమారు 350 గణేష్ మండపాలు ఏర్పాటు చేస్తున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు కలెక్టర్‌కు తెలిపారు. మండపాలకు ఉచిత విద్యుత్ కనెక్షన్లు, నిమజ్జన పాయింట్ల వద్ద క్రేన్లు, తగినంత లైటింగ్, గజ ఈతగాళ్లను ఏర్పాటు చేయాలని వారు కోరారు.

అనంతరం సంబంధిత శాఖల అధికారులకు కలెక్టర్ పలు ఆదేశాలు జారీ చేశారు. శోభాయాత్ర మార్గాల్లో తక్కువ ఎత్తులో ఉన్న విద్యుత్ తీగలను సరిచేయాలని, రహదారుల్లోని గుంతలను పూడ్చి అవసరమైన మరమ్మతులు చేపట్టాలని, విగ్రహాల తరలింపునకు అవసరమైన వాహనాలను ముందుగానే సిద్ధం చేయాలని విద్యుత్, ఆర్‌అండ్‌బీ, రవాణా శాఖ అధికారులను ఆదేశించారు.

గణేష్ మండపాల వద్ద తొమ్మిది రోజుల పాటు నిరంతర పారిశుధ్య చర్యలు చేపట్టి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని మున్సిపల్ అధికారులకు సూచించారు. మండపాలకు విద్యుత్ కనెక్షన్లు సక్రమంగా అందేలా చర్యలు తీసుకోవాలని విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. అగ్ని ప్రమాదాల నివారణకు మండపాల నిర్వాహకులు అగ్నిమాపక పరికరాలు, ఇసుక బకెట్లు, కార్బన్ డయాక్సైడ్ ఎక్స్‌టింగ్విషర్లు అందుబాటులో ఉంచేలా చూడాలని తెలిపారు. మండపాలను పోలీసులు, మున్సిపల్, విద్యుత్ శాఖ అధికారులు ముందుగానే తనిఖీ చేసి నిర్వాహకులకు భద్రతా సూచనలు ఇవ్వాలని ఆదేశించారు.

**నిమజ్జన పాయింట్ల వద్ద వైద్య సదుపాయాలు :**

**నిమజ్జన పాయింట్ల వద్ద ఫస్ట్ ఎయిడ్ కేంద్రాలు, అత్యవసర వైద్య సేవలు, తగిన సంఖ్యలో అంబులెన్స్‌లను ఏర్పాటు చేయాలని వైద్య ఆరోగ్య శాఖ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. అంబులెన్స్‌లు జనసమ్మర్థంలో చిక్కుకోకుండా వ్యూహాత్మక ప్రాంతాల్లో ముందుగానే సిద్ధంగా ఉంచాలని సూచించారు.**

**వర్షా భావ పరిస్థితుల కారణంగా నీటి లభ్యత తగ్గిన నేపథ్యంలో చిన్న విగ్రహాల నిమజ్జనం కోసం ప్రతి గ్రామ పంచాయతీలో కృత్రిమ నిమజ్జన కొలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. తాత్కాలికంగా ప్లాస్టిక్ షీట్లతో కొలనులు ఏర్పాటు చేయడంతో పాటు మున్సిపాలిటీ పరిధిలో అవసరమైన ప్రాంతాలను గుర్తించి మూడు నుంచి నాలుగు కృత్రిమ నిమజ్జన కొలనులు ఏర్పాటు చేయాలని సూచించారు.**

**దీంతో సహజ నీటి వనరులపై ఒత్తిడి, కాలుష్యం తగ్గడంతో పాటు ప్రజలకు, ముఖ్యంగా పిల్లలకు సురక్షితమైన నిమజ్జన సౌకర్యం అందుబాటులోకి వస్తుందని కలెక్టర్ తెలిపారు.**

**నిమజ్జన పాయింట్ల వద్ద తగిన సంఖ్యలో గజ ఈతగాళ్లను షిఫ్టుల వారీగా అందుబాటులో ఉంచాలని మత్స్యశాఖ అధికారులను ఆదేశించారు. గ్రామీణ, మున్సిపల్ ప్రాంతాల్లోని గణేష్ మండపాల వద్ద పంచాయతీలు, గ్రామీణ నీటి సరఫరా విభాగం సహకారంతో తాగునీటి సౌకర్యం కల్పించాలని పంచాయతీరాజ్ అధికారులకు సూచించారు. నిమజ్జన శోభాయాత్ర మార్గాల్లో నీటి పైప్‌లైన్లు, ఇతర నిర్మాణాలు అడ్డంకిగా లేకుండా ముందస్తుగా పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. శోభాయాత్ర మార్గాలు, నిమజ్జన పాయింట్ల వద్ద భక్తులకు తాగునీరు అందించేలా స్పష్టమైన ప్రణాళిక రూపొందించాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు.**

**నిమజ్జన కార్యక్రమం సందర్భంగా మద్యం దుకాణాలను మూసివేసేలా చర్యలు తీసుకోవాలని ఎక్సైజ్ అధికారులను ఆదేశించిన కలెక్టర్, ఇందుకు సంబంధించిన ప్రతిపాదనలను వెంటనే సమర్పించాలని సూచించారు. ఈ సమావేశంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి. హరిప్రియ, అసిస్టెంట్ కలెక్టర్ (అండర్ ట్రైనీ) సాయి శివాని, డీఆర్ఓ ఏ.నిర్మల, అదనపు ఎస్పీ ఎన్.బి. రత్నం, జిల్లా అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు, వీహెచ్‌పీ ప్రతినిధులు, గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.**

## నిబంధనలు పాటిస్తూ ఉత్సవాలు నిర్వహించాలి: ఎస్పీ దరావత్ జానకి

**గణేష్ ఉత్సవాలను ప్రతి ఒక్కరూ సంతోషంగా, ప్రశాంతంగా జరుపుకోవాలని జిల్లా ఎస్పీ జానకి కోరారు. నిర్వాహకులు, ప్రజలు, అధికారులు, పోలీసులు పరస్పరం సహకరించుకోవాలని సూచించారు.**

**వర్షా భావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని మట్టి విగ్రహాలను ప్రోత్సహించాలని, భారీ విగ్రహాలకు బదులుగా చిన్న విగ్రహాలు, మట్టి విగ్రహాలకు ప్రాధాన్యత ఇవ్వాలని ఎస్పీ సూచించారు. డీజేలు, అధిక శబ్ద కాలుష్యంపై నిర్వాహకులు బాధ్యతగా వ్యవహరించాలని తెలిపారు. శబ్ద కాలుష్య నియంత్రణ నిబంధనలపై మండపాల నిర్వాహకులకు ప్రత్యేకంగా అవగాహన కల్పిస్తామని చెప్పారు. గణేష్ మండపాల నిర్వాహకులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి పోలీస్ శాఖ తరపున భద్రతా సూచనలు, నిబంధనలను వివరించనున్నట్లు వెల్లడించారు. ముస్లిం, ఇతర మైనారిటీ వర్గాల జనాభా ఉన్న మిశ్రమ ప్రాంతాల్లో గణేష్ మండపాలు ఏర్పాటు చేసేటప్పుడు అన్ని వర్గాల ప్రజల మనోభావాలను గౌరవించాలని ఎస్పీ సూచించారు. మండపాల ఏర్పాటు పేరుతో రహదారులను పూర్తిగా మూసివేసి ప్రజల రాకపోకలకు ఇబ్బంది కలిగించరాదని స్పష్టం చేశారు. ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో వార్డు అధికారులు, మున్సిపల్ సిబ్బంది, పోలీసులు, గణేష్ మండపాల నిర్వాహకులతో వాట్సాప్ గ్రూపులు ఏర్పాటు చేసి సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.**

**గణేష్ ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించేందుకు పోలీస్ శాఖ పూర్తి సహకారం అందిస్తుందని, ప్రజలు, ఉత్సవ కమిటీలు, నిర్వాహకులు కూడా పోలీసులకు సహకరించాలని ఎస్పీ కోరారు.**



# పిల్లలు మిమ్మల్నిగౌరవించడం లేదా? పనిష్మెంట్ లేకుండా వారి ప్రవర్తనలో మార్పు తేవాలంటే ఏం చేయాలి?

పిల్లలు ఇంట్లో తిరిగితే ఆ కళే వేరు. వాళ్ల మాటలు కూడా మనకు సంతోషాన్నిస్తుంటాయి. కానీ, కొన్నిసార్లు వారి ప్రవర్తన మనల్ని నిరాశకు గురిచేస్తుంది. తల్లిదండ్రులుగా, మన పిల్లలు మన మాట వినాలని, మనల్ని గౌరవించాలని కోరుకోవడం సహజం. అయితే, కొన్నిసార్లు పరిస్థితులు భిన్నంగా ఉంటాయి. ముఖ్యంగా, వారు మనల్ని గౌరవించనప్పుడు ఆ బాధ తీరనిది. ఎవరికీ చెప్పుకోలేనిది కూడా. మీ పిల్లలు మిమ్మల్ని గౌరవించడం లేదని మీరు భావిస్తున్నట్లయితే, ఇలా మీ ఒక్కరికే జరుగుతుందని దిగులు పడుతూ కూర్చోకండి. ప్రతి ఇంట్లో ఉండే సమస్యే ఇది. అనేక మంది తల్లిదండ్రులు ఈ సవాలును ఎదుర్కొంటారు. సరైన విధానాలు, చిట్కాలు పాటించి, మీ పట్ల మీ పిల్లలకు గౌరవాన్ని పెంపొందించవచ్చు. మీ బంధాన్ని మెరుగుపరచుకోవచ్చు. మీ పిల్లలు మిమ్మల్ని గౌరవించకపోతే ఏమి చేయాలో తెలుసుకోవడానికి కొన్ని ముఖ్యమైన చిట్కాలను ఇక్కడ అందిస్తున్నాము.



## పిల్లలు మిమ్మల్ని గౌరవించకపోతే ఏం చేయాలంటే..?

పిల్లలు మీకు తగిన గౌరవం ఇవ్వనప్పుడు అది చాలా బాధాకరంగా ఉంటుంది. ఇది అనేక కారణాల వల్ల వచ్చే సమస్య. ఈ కష్టమైన పరిస్థితిని అధిగమించడానికి, గౌరవప్రదమైన సంబంధాన్ని పెంపొందించడానికి కొన్ని చిట్కాలు ఉన్నాయి. అవేంటంటే..

వయస్సు దశ: ఎదుగుతున్న పిల్లలలో, ముఖ్యంగా టీనేజ్ వయస్సులో స్వాతంత్ర్య భావాలు ఉండటం వల్ల కొన్నిసార్లు గౌరవం లేని ప్రవర్తన సాధారణం కావచ్చు.

నచ్చకపోవడం: మీ పిల్లవాడికి వినపడకపోవడం పోవడం వల్ల, ప్రేమపూర్వకంగా చెప్పకపోవడం వల్ల లేదా మీరు చెప్పే విషయాలు ముఖ్యమైనవి కావని భావించడం వల్ల అలా ప్రవర్తించవచ్చు. వారు ప్రతికూలమైనదైనా సరే, దృష్టిని ఆకర్షించడానికి ప్రయత్నించవచ్చు.

భావోద్వేగాలను వ్యక్తీకరించడంలో ఇబ్బంది: పిల్లలకు తమ నిరాశ లేదా కోపాన్ని సరిగ్గా వ్యక్తీకరించడానికి పదాలు లేదా వీలు కుదరనప్పుడు వారు గౌరవం లేకుండా ప్రవర్తించవచ్చు.

నేర్చుకున్న ప్రవర్తన: పిల్లలు ఇంట్లో చూసే ప్రవర్తనను అనుకరిస్తారు. పెద్దలు ఒకరితో ఒకరు లేదా వారితో గౌరవం లేకుండా మాట్లాడుకోవడం చూస్తే, వారు దానిని అనుకరించవచ్చు.



హద్దులు లేకపోవడం: స్థిరమైన లేదా స్పష్టమైన నియమాలు లేకపోవడం వల్ల పిల్లలు గౌరవం లేకుండా ప్రవర్తించవచ్చు.

అధికార పోరాటాలు: పిల్లలు పెద్దవుతున్న సమయంలో ఎక్కువ స్వయంప్రతిపత్తిని కోరుకుంటుంటారు. ఈ సమయంలో అధికారం లేదా పెత్తనం చెలాయించే విషయాలలో అధికార పోరాటాలు జరగొచ్చు.

బాహ్య ప్రభావాలు: తోటివారి ఒత్తిడి లేదా మీడియాలో గౌరవం లేని ప్రవర్తనకు గురికావడం ఒక పాత్ర పోషించవచ్చు.

అంతర్లీన సమస్యలు: కొన్నిసార్లు, గౌరవం లేకపోవడం మానసిక ఆరోగ్య సమస్యలు లేదా అభ్యసన ఇబ్బందులకు సంకేతం కావచ్చు.

మీ ప్రవర్తనలో తెచ్చుకోవాల్సిన మార్పులు

మీ చర్యలు చాలా ముఖ్యమైనవి. మీరు అంగీకరించకపోయినా, మీ పిల్లలను, ఇతరులను మర్యాదగా, దయతో, సానుభూతితో చూడండి. మీ భాగస్వామి పట్ల తల్లిదండ్రుల పట్ల గౌరవప్రదమైన సంబంధం ఉంటే, మొత్తం కుటుంబానికి బలమైన పునాదిగా ఉంటుంది. పిల్లలు మాట్లాడేటప్పుడు శ్రద్ధగా వినండి. కళ్ళల్లోకి చూస్తూ మాట్లాడండి. వారితో ఏకీభవించకపోయినా వారి భావాలను గుర్తించండి.



## గౌరవంగా మాట్లాడండి:

కష్టమైన విషయాలను ప్రస్తావించేటప్పుడు లేదా హద్దులు నిర్ణయించేటప్పుడు కూడా ప్రశాంతంగా, మర్యాదగా మాట్లాడండి. అరవడం, తిట్టడం లేదా వ్యంగ్యంగా మాట్లాడటం మానుకోండి.

స్పష్టమైన హద్దులు ఏర్పాటు చేయండి:

కుటుంబానికి గౌరవప్రదమైన ప్రవర్తన ఎలా ఉంటుందో స్పష్టంగా వివరించండి. స్థిరమైన నియమాలను ఏర్పాటు చేయండి. సంభాషణ, ప్రవర్తనకు సంబంధించిన నియమాలను తెలియజేసి, వాటిని స్థిరంగా అమలు చేయండి. పర్యవసానాలను వివరించి పిల్లలు అర్థం చేసుకునేలా చేయండి. ఖాళీ బెదిరింపులు ఇవ్వకండి.

గౌరవం లేని ప్రవర్తనను శాంతంగా పరిష్కరించండి:

గౌరవం లేని ప్రవర్తన ప్రతిసారీ జరిగినప్పుడు దాన్ని పరిష్కరించండి. దానిని పట్టించుకోకపోతే అది సబబేననే భావన వారిలో కలుగుతుంది. గౌరవం లేని ప్రవర్తనను పరిష్కరించేటప్పుడు ప్రశాంతంగా ఉండటం చాలా ముఖ్యం. కోపంతో స్పందించడం పరిస్థితిని మరింత దిగజార్చవచ్చు. వారి ప్రవర్తన మిమ్మల్ని ఎలా బాధపెడుతుందో వ్యక్తీకరించండి. వారి మాటలు, చర్యలు ఇతరులను ఎలా ప్రభావితం చేస్తాయో మీ పిల్లవాడికి అర్థమయ్యేలా తెలియజేయండి.

కాంప్లిమెంట్స్ ఇస్తూ ఉండండి:

మీ పిల్లలు గౌరవప్రదంగా ప్రవర్తించినప్పుడు వారిని గుర్తించి ప్రశంసించండి. ఇది వారిని అవే పనులు రిపీట్ చేయడానికి ప్రోత్సహిస్తుంది. గౌరవప్రదమైన ప్రవర్తనకు చిన్న బహుమతులు లేదా ప్రత్యేక అధికారాలను పరిగణించండి.

## సానుభూతిని పెంచుకోండి:

మీ బంధాన్ని బలోపేతం చేయడానికి పిల్లలతో ఒంటరిగా గడపండి. వారి ప్రవర్తన మీకు పూర్తిగా నచ్చకపోయినా వారి భావాలకు విలువ ఇవ్వండి. ప్రతి చిన్న తప్పుకు పెద్ద ఘర్షణ అవసరం లేదు. అత్యంత ముఖ్యమైన సమస్యలపై దృష్టి పెట్టండి.

గౌరవాన్ని డిమాండ్ చేయకండి:

గౌరవం పరస్పరం ఇచ్చి పుచ్చుకోవాలి. మీ పిల్లలను గౌరవంగా చూడటం ద్వారా, మీరు వారి గౌరవాన్ని తిరిగి పొందే అవకాశం ఉంటుంది. పరస్పర అవగాహన, పరిగణన ఆధారంగా సానుకూల, ఆరోగ్యకరమైన సంబంధాన్ని ఏర్పరచుకోవడంపై దృష్టి పెట్టండి. చిల్డ్రన్ సైకాలజిస్ట్ ను సంప్రదించి సమస్యలను పరిష్కరించేందుకు ప్రయత్నించండి.

# జాగ్రత్త! ఈ పండ్లను కలిపి తిన్నారంటే అనారోగ్యాన్ని కొని తెచ్చుకున్న వారు అవుతారు!





ఆరోగ్యం కోసం పండ్లు ఎంతో ముఖ్యమైనవో మనందరికీ తెలుసు. వాటిలో విటమిన్లు, ఖనిజాలు, ఫైబర్ పుష్కలంగా ఉంటాయి. ఇవి మన శరీరాన్ని అనేక రోగాల నుండి కాపాడతాయి, జీర్ణక్రియను మెరుగుపరుస్తాయి ,రోగనిరోధక శక్తిని పెంచుతాయి. అయితే, కొన్నిసార్లు మనం చేసే ఒక చిన్న పొరపాట్లు మన ఆరోగ్యానికి హాని కలిగించవచ్చు. అదేంటంటే కొన్ని రకాల పండ్లను కలిపి తినడం. ఆయుర్వేదం ,పోషకాహార నిపుణులు కొన్ని రకాల పండ్ల కలయికను ఆరోగ్యానికి మంచిది కాదని సూచిస్తున్నారు. వాటి గురించి వివరంగా తెలుసుకుందాం

1) పుచ్చకాయ ,కర్బూజ - ఎప్పుడూ కలిపి తినకూడదు:

పుచ్చకాయ ,కర్బూజ జాతికి చెందిన పండ్లను వేర్వేరుగా తినడమే మంచిది. వీటిని ఇతర పండ్లతో కలిపితే జీర్ణ సమస్యలు వచ్చే అవకాశం ఉంది. ముఖ్యంగా పుచ్చకాయ చాలా తేలికగా ,త్వరగా జీర్ణమవుతుంది. ఇందులో నీటి శాతం చాలా ఎక్కువగా ఉంటుంది. ఇతర పండ్లతో కలిపినప్పుడు, పుచ్చకాయ త్వరగా జీర్ణమవ్వడానికి ప్రయత్నిస్తుంది, కానీ ఇతర పండ్లు ఆలస్యంగా జీర్ణమవుతాయి. దీని వల్ల కడుపులో అసౌకర్యం, గ్యాస్ వంటి ఇతర జీర్ణ సంబంధిత సమస్యలు తలెత్తవచ్చు. కర్బూజ కూడా పుచ్చకాయ లాంటి లక్షణాలనే కలిగి ఉంటుంది కాబట్టి వీటిని కూడా విడిగా తీసుకోవడమే ఉత్తమం. మీరు ఒకేసారి పుచ్చకాయను తినండి లేదా కర్బూజను మాత్రమే తినడానికి ప్రయత్నించండి.

2) తీపి పండ్లు ,పుల్లటి పండ్లు - కలిపితే సమస్యలే:

ద్రాక్ష, స్ట్రాబెర్రీ, ఆపిల్, దానిమ్మ ,నారింజ వంటి పుల్లని లేదా సబ్-యాసిడ్ పండ్లను అరటిపండ్లు ,ఎండుద్రాక్ష వంటి తియ్యటి పండ్లతో ఎప్పుడూ కలపకూడదని ఆయుర్వేదం చెబుతోంది. ఇది చాలా చెడ్డ కాంబినేషన్ అని చెప్పవచ్చు. తీపి పండ్లు జీర్ణం కావడానికి ఎక్కువ సమయం తీసుకుంటాయి, అయితే ఆమ్ల పండ్లు త్వరగా జీర్ణమవుతాయి. ఈ రెండింటినీ కలిపి తిన్నప్పుడు, తీపి జీర్ణక్రియ అస్తవ్యస్తం అవుతుంది. కడుపులో పులియబెట్టడం (ఫెర్మెంటేషన్) జరుగుతుంది, ఇది గ్యాస్, ఉబ్బరం, ఎసిడిటీ ,తలనొప్పి వంటి సమస్యలకు దారితీయవచ్చు. కాబట్టి, తీపి పండ్లను విడిగా తినండి లేదంటే ఇతర తీపి పండ్లతో కలిపి తినండి. అలాగే, ఆమ్ల పండ్లను విడిగా లేదా ఇతర ఆమ్ల పండ్ల జాతికి చెందిన వాటితో కలిపి మాత్రమే తీసుకోండి.

3) బొప్పాయి ,నిమ్మకాయ - ప్రాణాంతక కలయిక:

బొప్పాయి ,నిమ్మకాయ కలయికను ఆరోగ్య నిపుణులు అత్యంత ప్రమాదకరమైన కలయికల్లో ఒకటిగా పరిగణిస్తారు. ఈ రెండింటినీ కలిపి తినడం వల్ల రక్తహీనత (రక్తంలో ఐరన్ శాతం తగ్గడం) లేదా హిమోగ్లోబిన్ అసమతుల్యత ఏర్పడే ప్రమాదం ఉంది. కొన్ని అధ్యయనాల ప్రకారం, ఈ కలయిక శరీరానికి విషపూరితంగా కూడా మారవచ్చు. కాబట్టి, మీ ఆరోగ్యం కోసం ఈ రెండు పండ్లను ఎప్పుడూ కలిపి తినకండి. వీటిని విడివిడిగా, అది కూడా కొంత సమయం వ్యవధిలో తీసుకోవడం మంచిది.

4) పండ్లు ,కూరగాయలు - జీర్ణక్రియకు విరుద్ధం:

చాలా మంది పండ్లను ,కూరగాయలను కలిపి తినడానికి ఇష్టపడతారు. ఇది జీర్ణక్రియకు అంత మంచిది కాదు. పండ్లు ,కూరగాయలు వేర్వేరు ఎంజైమ్‌ల సహాయంతో వేర్వేరు సమయాల్లో జీర్ణమవుతాయి. పండ్లలో సహజ చక్కెరలు (ఫ్రక్టోజ్) ఎక్కువగా ఉంటాయి, ఇవి కూరగాయల జీర్ణక్రియకు ఆటంకం కలిగిస్తాయి. ఉదాహరణకు, నారింజను క్యారెట్‌తో కలిపి తింటే కడుపు నొప్పి, గుండెల్లో మంట ,ఇతర జీర్ణ సంబంధిత సమస్యలు వచ్చే అవకాశం ఉంది. అలాగే, పండ్లను సలాడ్‌లలో లేదా కూరగాయల జ్యూస్‌లలో కలపడం కూడా మంచిది కాదు. వీలైనంత వరకు పండ్లను విడిగా, భోజనానికి ముందు లేదా భోజనం మధ్యలో తీసుకోవడానికి ప్రయత్నించండి. కూరగాయలను విడిగా లేదా ఇతర కూరగాయలతో కలిపి తీసుకోవచ్చు.

మరికొన్ని ముఖ్యమైన విషయాలు:

పండ్లను ఎప్పుడూ భోజనం చేసిన వెంటనే తినకూడదు. భోజనం తర్వాత కనీసం ఒక గంట లేదా రెండు గంటల గ్యాప్ ఉండాలి.

వివిధ రకాల పండ్లను ఒకేసారి ఎక్కువగా తినడం కూడా జీర్ణ సమస్యలకు దారితీయవచ్చు.

పండిన ,తాజాగా ఉన్న పండ్లనే తినడానికి ప్రయత్నించండి.

మీ శరీర తత్వాన్ని బట్టి కొన్ని రకాల పండ్ల కలయికలు ఇబ్బంది కలిగించవచ్చు. కాబట్టి, మీ శరీరం ఎలా స్పందిస్తుందో గమనిస్తూ ఉండటం ముఖ్యం.

ఆరోగ్యంగా ఉండాలంటే పండ్లను సరైన సమయంలో, సరైన విధంగా తీసుకోవడం చాలా ముఖ్యం. పైన తెలిపిన పండ్ల కలయికలను నివారించడం ద్వారా మీరు జీర్ణ సంబంధిత సమస్యలను నివారించవచ్చు ,పండ్ల యొక్క పూర్తి పోషక విలువలను పొందవచ్చు.



# నయనతారతో పీవీ సింధు.. ఫొటోలు వైరల్



భారత బ్యాడ్మింటన్ క్రీడాకారిణి పి.వి. సింధు నటి నయనతార దంపతులను కలిశారు. ఈ సందర్భంగా వారితో గడిపిన ఆహ్లాదకరమైన సమయాన్ని పంచుకుంటూ ఆ ఫొటోలను సోషల్ మీడియాలో షేర్ చేశారు.

"అందమైన సాయంత్రం.. అద్భుతమైన విందు.. మనసుకు నచ్చే సంభాషణలు.. లెక్కలేనన్ని నవ్వులు. కొన్ని మాటలు.. మనుషులను మనం చూసే కోణాన్ని ఎంతలా మారుస్తాయో కదా! స్నేహితులుగా మా మాటలు ప్రారంభించాం. జీవితం, ప్రేమ.. ఇలా ఎన్నో విషయాల గురించి పంచుకున్నాం. బయటకు వచ్చేటప్పుడు ఒకరికొకరం ఎన్నో ఏళ్లుగా తెలుసు అనే భావన కలిగింది" అని సింధు రాసుకొచ్చారు. విక్కీ, నయన్‌లది చాలా మంచి మనసంటూ ఆమె ప్రశంసించారు. ప్రస్తుతం ఈ ఫొటోలు వైరల్ కాగా.. పలువురు ప్రముఖులు స్పందిస్తున్నారు. మహేశ్ బాబు భార్య నమ్రత ఈ చిత్రాలకు లవ్ ఎమోజీలతో కామెంట్ పెట్టి తన ప్రేమను తెలిపారు. ఇక ఈ ఫొటోలను పంచుకుంటూ నయనతార.. 'ఫ్యామిలీ' అనే క్యాప్షన్ జతచేశారు.

# ఎన్టీఆర్ డ్రాగన్ కోసం అలియాభట్



అగ్ర కథానాయకుడు ఎన్టీఆర్ నటిస్తున్న 'డ్రాగన్' సినిమా తారాగణం ఎంపిక ఇంకా పూర్తి కాలేదు. ఒకవైపు చిత్రీకరణ కొనసాగిస్తూనే.. మరోవైపు నటీనటుల ఎంపికపై దృష్టి పెడుతూ వచ్చారు దర్శకుడు ప్రశాంత్ నీల్. ఇప్పుడు అందుకు సంబంధించిన కసరత్తులు తుదిదశకు చేరుకున్నట్టు సమాచారం. బాలీవుడ్ కథానాయకుడు షాహిద్ కపూర్ ఇందులో నటిస్తున్నట్టు చాలా రోజులుగా ప్రచారం సాగుతోంది. ఆయనతోపాటు ప్రముఖ కథానాయిక అలియాభట్ పేరు కూడా తాజాగా తెరపైకి వచ్చింది. ఓ కీలక పాత్రలో అలియా నటించేందుకు అంగీకారం తెలిపారని బాలీవుడ్ వర్గాలు చెబుతున్నాయి.

ఇప్పటికే ఈ సినిమాలో అనిల్ కపూర్ ఓ కీలక పాత్రని పోషిస్తున్న సంగతి తెలిసిందే. బలమైన తారాగణంతో 'డ్రాగన్' మరింత ఆసక్తిని, అంచనాల్ని రేకెత్తిస్తోంది. ఎన్టీఆర్‌ని ఢీ కొట్టే పాత్రలో షాహిద్ కపూర్ నటించనున్నట్టు తెలుస్తోంది. ఎన్టీఆర్ భుజానికి శస్త్రచికిత్స జరగడంతో ఆయన కొన్నాళ్లుగా చిత్రీకరణకు దూరంగా ఉన్నారు. ఆయన రంగంలోకి దిగేలోపు నటీనటుల ఎంపిక ప్రక్రియని పూర్తి చేసి, సినిమాని వేగంగా పూర్తి చేయాలనే ఆలోచనలో చిత్రబృందం ఉన్నట్టు తెలుస్తోంది.

# భక్తి... వారాహిశక్తి



సుమంత్, ఐశ్వర్య రాజేశ్ ప్రధాన పాత్రధారులుగా తెరకెక్కుతున్న చిత్రం 'మహేంద్రగిరి వారాహి'. మీనాక్షి గోస్వామి, మాళవిక నాయర్ కీలక పాత్రలు పోషిస్తు న్నారు. సంతోష్ జాగర్లపూడి దర్శకత్వం వహిస్తున్నారు. కలిపు మధు, లక్ష్మణ్ నిర్మాతలు. భక్తి, అంతుచిక్కని రహస్యాల నేపథ్యంలో ఓ థ్రిల్లర్ కథతో రూపొందుతున్న ఈ చిత్రం ఈ నెల 11న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇందులోని ది రేజ్ ఆఫ్ వారాహి... పాటని ప్రముఖ కథానాయకుడు నాగచైతన్య శుక్రవారం విడుదల చేశారు. అనూప్ రూబెన్స్ స్వరకల్పనలోని ఈ గీతానికి కడలి సత్యనారాయణ సాహిత్యం సమకూర్చగా, నకాష్ అజీజ్ ఆలపించారు. కథా ప్రపంచాన్ని, అందులోని గాఢతని ఆవిష్కరించే ఈ పాట వారాహి అమ్మవారి శక్తిని చాటుతుందని సినీ వర్గాలు చెప్పాయి.

# ఆనంద్ దేవరకొండలా నేను మాట్లాడలేను



తన మరిది, హీరో ఆనంద్‌లా తనకు మాట్లాడడం రాదని నటి రష్మిక అన్నారు. హీరో ఆనంద్ దేవరకొండ , వైష్ణవి చైతన్య జంటగా నటించిన చిత్రం 'ఎపిక్: ఫస్ట్ సెమిస్టర్'. ఆదిత్య హాసన్ తెరకెక్కించిన ఈ సినిమా సెప్టెంబర్ 11న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో ట్రైలర్ లాంచ్ ఈవెంట్ నిర్వహించారు. రష్మిక అతిథిగా హాజరై సందడి చేశారు. ఆమె మాట్లాడుతూ.. ఆనంద్ ప్రతి ఇంటర్వ్యూలో చాలా బాగా మాట్లాడతారని.. తనకు అలా మాట్లాడడం రాదని సరదాగా చెప్పారు. ఇక ఈ సినిమా రొమాంటిక్ కొరియన్ డ్రామాలా ఉందని తెలిపారు.

# ఫిట్‌గా ఉన్నవాళ్లూ 'ఇంపాక్ట్'గానా?: సురేశ్ రైనా




ఇంపాక్ట్ రూల్‌పై క్రికెట్ వర్గాల్లో చర్చ కొనసాగుతోంది. దీన్ని ఉంచాలా? వద్దా? అనేదానిపై బీసీసీఐ కూడా ఇప్పటికే చర్యలను ముమ్మరం చేసింది. కొందరు ఈ రూల్‌కు అనుకూలంగా మాట్లాడుతుంటే.. మరికొందరేమో దీనివల్ల బ్యాటింగ్, బౌలింగ్ మధ్య సమతుల్యత దెబ్బతింటుందని అభిప్రాయపడుతున్నారు. తాజాగా మాజీ క్రికెటర్ సురేశ్ రైనా దీనిపై కీలక వ్యాఖ్యలు చేశాడు. ఫిట్‌గా ఉన్న ప్లేయర్లూ ఈ రూల్‌తో బ్యాటింగ్ చేసేసి బెంచ్‌కే పరిమితమవుతున్నారని తెలిపాడు.

"ఐపీఎల్‌లో  ఈ ఇంపాక్ట్ రూల్‌కు నేను వ్యతిరేకం. ఎందుకంటే.. చాలా మంది ఫిట్ ప్లేయర్లు కూడా బ్యాటింగ్ చేసేసి ఊరుకుంటున్నారు. ఇలా చేస్తే వారిలో నైపుణ్యాలు ఎలా మెరుగవుతాయి? వరల్డ్ కప్‌లోనూ ఇలాంటి రూల్ లేదు. అభిమానులను ఎంటర్‌టైన్ చేయడానికి దీనిని తీసుకొచ్చారని నేను అర్థం చేసుకోగలను. కానీ, బౌలర్లకు చాలా ఇబ్బందులే. దీని వల్ల వారికి ఏమాత్రం ప్రయోజనం లేదు. గతంలో 170 పరుగులు అంటేనే మంచి స్కోరు. ఇప్పుడు 250 అయినా సరే ఈజీగానే ఛేదిస్తున్నారు. 300 రన్స్‌ను కూడా కొట్టేసేలా ఉన్నారు. బౌలర్లకు ఇది పీడకలగా మారుతోంది. వికెట్ తీయడానికి ఆప్షన్లే ఉండట్లేదు. అదనంగా బ్యాటర్ ఉండటంతో దూకుడుగా ఆడేస్తూ బౌలర్లపై తీవ్ర ఒత్తిడి తెస్తున్నారు" అని రైనా తెలిపాడు. 2023 సీజన్‌లో బీసీసీఐ ఈ ఇంపాక్ట్ రూల్‌ను తొలిసారి అమలు చేసింది.

ఇప్పుడే వద్దు..

"భారత ఆటగాళ్లను బిగ్‌బాష్, ద హండ్రెడ్ టోర్నీలకు అనుమతించక్కర్లేదు. ఇప్పుడు మన లీగే పెద్దది. గతంలో ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్ పర్యటనలకు వెళ్లినప్పుడు నేను కూడా అక్కడి లీగ్‌ల్లో ఆడేందుకు ఆసక్తిచూపించా. కానీ, ఇప్పుడు మన ఐపీఎల్‌లోనే ఆడేందుకు విదేశీ ప్లేయర్లు ఉత్సాహపడుతున్నారు. అలాంటప్పుడు మనం ఆ లీగ్‌ల్లో ఆడాల్సిన అవసరం లేదు" అని రైనా అభిప్రాయపడ్డాడు.

ధోని షాక్ అయ్యాడు..

ధోని అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికినప్పుడే రైనా కూడా ఆ నిర్ణయం ప్రకటించాడు. తొలుత ఈ విషయం చెప్పినప్పుడు ధోని షాక్‌కు గురైనట్లు తాజాగా రైనా తెలిపాడు. "క్రీడల్లో ఏదొక రోజు వీడ్కోలు చెప్పాలి. దేశం కోసం ఆడాం. అందుకు తల్లిదండ్రులు ఎన్నో త్యాగాలు చేశారు. ఆటకు గుడ్‌బై చెప్పే టైమ్ వచ్చిందని నాకు అప్పుడు అనిపించింది. కుటుంబంతో కలిసి గడపాల్సిన అవసరం ఉంది. నాకు అప్పుడు 33 ఏళ్లు అనుకుంటా. డ్రెస్సింగ్ రూమ్‌లో ధోని ఉన్నప్పుడు వెళ్లి 'కెరీర్ ముగిసింది' అని అన్నా. ఆ మాటలకు ధోని ఒక్కసారిగా కలవరానికి గురయ్యాడు" అని నాటి ఘటనను గుర్తు చేసుకున్నాడు. అప్పుడు వీరిద్దరూ ఐపీఎల్ కోసం బయోబబుల్‌లో ఉన్నారు.

# మేం చేయలేం కానీ..: ఆటగాళ్ల వసతి కోసం బీసీసీఐ రిక్వెస్ట్‌పై ఐవోఏ




జపాన్ వేదికగా జరగబోయే ఆసియా గేమ్స్‌లో వసతి సదుపాయాలు, క్రికెట్ మైదానంలోని పిచ్ నాణ్యతపై సర్వత్రా విమర్శలు వచ్చాయి. మరీ ముఖ్యంగా క్రికెటర్లు ఉండేందుకు చాలా చిన్న గదులను సిద్ధం చేసినట్లు వార్తలు వచ్చాయి. దీంతో తమ ప్లేయర్ల కోసం ప్రత్యేకంగా వసతి ఏర్పాటు చేయాలని బీసీసీఐ విజ్ఞప్తి చేసింది. కానీ, ఈ అభ్యర్థనను భారత ఒలింపిక్ సంఘం తిరస్కరించినట్లు తెలుస్తోంది. ప్రత్యేకంగా ఎవరికీ ఇలాంటి వసతి సదుపాయాలు కల్పించడం లేదని.. అది క్రికెటర్లకైనా తమ నిబంధనలు ఒకేలా ఉంటాయని ఐవోఏ స్పష్టత ఇచ్చినట్లు కథనాలు వస్తున్నాయి. అయితే సొంతంగా క్రికెటర్లకు వసతి కల్పించే అవకాశం మాత్రం బీసీసీఐకి ఉందని ఐవోఏ సీఈవో రఘురామ్ అయ్యర్ చెప్పినట్లు సమాచారం.

"క్రీడాకారులకు వసతి ఏర్పాట్ల గురించి బీసీసీఐ  సీఈవో హేమంగ్ అమిన్ నిరంతరం మాతో సంప్రదింపులు చేస్తూనే ఉన్నారు. ఆసియా గేమ్స్‌లో సదుపాయాలను అంచనా వేయడానికి జపాన్‌కు ఓ టీమ్‌ను పంపించాలని క్రికెట్ బోర్డు భావించింది. ఐవోఏ కూడా అందుకు సమ్మతించింది. ఆ కమిటీ ఇచ్చిన నివేదికను బట్టి ఆర్గనైజర్లు కల్పించిన సదుపాయాలను వారు వినియోగించుకుంటారా? లేకపోతే స్వతహాగా ఏర్పాట్లు చేసుకుంటారా? అనేది వారి ఇష్టం. సొంతంగా వసతి కల్పించుకుంటామంటే మాకేమీ అభ్యంతరం లేదు. మేం మాత్రం ప్రత్యేకంగా ఎలాంటి సౌకర్యాలు కల్పించబోం" అని అయ్యర్ స్పష్టం చేసినట్లు సదరు కథనాలు వెల్లడించాయి. ఆసియా గేమ్స్ ఆర్గనైజర్లు.. భారత  పురుషుల జట్టు ప్లేయర్లకు త్రీస్టార్ హోటల్, మహిళా క్రికెటర్ల కోసం ఫోర్ స్టార్ హోటల్‌ను కేటాయించారు. ఒక్కో గదిని ఇద్దరు ప్లేయర్లు షేర్ చేసుకోవాలి. మొదట మహిళా జట్టు జపాన్‌కు వెళ్లనుంది. సెప్టెంబర్ 17 నుంచి వారి మ్యాచులు ప్రారంభమవుతాయి. ఇక అక్కడి వేదికలు, హోటళ్లలో ఉండే సదుపాయాలను చెక్ చేసేందుకు వచ్చే వారంలో ఓ కమిటీ వెళ్లనుంది. ఆ తర్వాతే దీనిపై బీసీసీఐ తుది నిర్ణయం తీసుకుంటుంది.

# పిరికిపందలతో పోటీ పడ్డా: ఒలింపిక్ పతక విజేత తీవ్ర వ్యాఖ్యలు

డైమండ్ లీగ్ ఫైనల్స్‌లో ఓడిపోవడంతో ఒలింపిక్ పతక విజేతకు పట్టరాని కోపం వచ్చింది. తన ప్రత్యర్థులపై పరుష వ్యాఖ్యలు చేశాడు. వారంతా మూర్ఖులు, పిరికిపందలు అంటూ విమర్శించాడు. ఇంతకీ అసలేమైంది?

బ్రస్సెల్స్ వేదికగా డైమండ్ లీగ్ పోటీలు జరుగుతున్నాయి. అందులో 1500 మీటర్ల రేసును ఒలింపిక్ పతక విజేత, నార్వేకు చెందిన జాకబ్ ఇంగెబ్రిట్‌సెన్  నాలుగో ప్లేస్‌తో ముగించాడు. చివరి వరకూ దాదాపు అగ్రస్థానంలో ఉన్న అతడు లైన్‌కు చేరువగా వస్తున్న తరుణంలో ఒక్కసారిగా వెనకబడ్డాడు. దీంతో టాప్-3లోనూ నిలవలేకపోయాడు. ఆస్ట్రేలియా అథ్లెట్ మేయర్స్ కామెరూన్ (3:30.14), కెన్యాకు చెందిన కోయిచ్ ఫన్యూయెల్ (3:30.18), యూఎస్‌ఏ అథ్లెట్ స్ట్రాండ్ ఇథన్ (3:30.50) తొలి మూడు స్థానాల్లో ఉన్నారు. ఈ క్రమంలోనే రేసు ముగిసిన తర్వాత ఇంటర్వ్యూలో జాకబ్ తీవ్ర వ్యాఖ్యలు చేశాడు. చివరి 30 మీటర్లకు వచ్చేసరికి ప్రత్యర్థులు ఒక్కసారిగా తనకు అడ్డుగా పరిగెత్తినట్లు అతడు ఆరోపించాడు.

"నా ప్రత్యర్థులంతా పిరికిపందలు. వారంతా ఓ క్యూ లైన్ మాదిరిగా పరిగెడుదామని భావించారు. ఒకరి వెనుక ఒకరు దాక్కున్నారు. ఇక, ఆఖర్లో నా ముందు ఉన్న రన్నర్ సరిగా పరిగెత్తకపోవడంతో నా లైన్ తప్పిపోవాల్సి వచ్చింది. నేను అలాంటి పరిస్థితుల్లోకి వెళ్లాలని అనుకోలేదు. కానీ, చివరికి తప్పలేదు. ఇదంతా ప్రత్యర్థుల వ్యూహంలో భాగమే. తన సొంత టీమ్‌మేట్ కోసమే వారు అలా చేశారు. ఈ రేసు



ఫలితంతో చాలా నిరాశ చెందాను. కొంతమంది పిరికివాళ్లతో పోటీ పడ్డా. తొలి స్థానంలో ఉన్న కామెరూన్ మాత్రమే కాస్త మంచి రేసర్‌లా కనిపించాడు. మిగతావారంతా ఓడిపోయినవారే" అని జాకబ్  వ్యాఖ్యానించాడు.

PRINTER, PUBLISHER AND OWNED BY SHANKARAGALLU VENKATESULU, AND PRINTED AT M/S SREE VASAVI PUBLICATIONS#4/38, Main Road, Settur515, 767, Ananthapuram Dist., (A.P)
EDITOR : SHANKARAGALLU VENKATESULU. Email: anantha janasakshi2019@gmail.com, Cell : 9533633213, RNI REGD NO : APTEL/2015/61314